
హెచ్‌ఎంపాడు మండలం తిమ్మారెడ్డిపల్లి వద్ద నిర్మించిన తారురోడ్డు

పైసలిస్తేనే.. పండుగ!


చేసిన పనులకు బిల్లుల కోసం ఎదురుచూపులు

'పల్లె పండుగ' పనులకు విడుదల కాని నిధులు

- జిల్లాలో రూ.70.70 కోట్లు పెండింగ్
- రెండో దశలో ఎస్సీకాలనీల్లో చేసిన పనులకు ఒక్క రూపాయి కూడా విడుదల కాని దైన్యం
- సమాధానం చెప్పలేక అధికారులు సతమతం


మార్కాపురం మండలం రాయవరంలో నిర్మించిన సీసీరోడ్డు, కాలువలు

ఉత్సాహంగా 'పల్లె పండుగ' పనులు చేపట్టి పూర్తిచేసిన వారు బిల్లుల కోసం ఎదురుచూస్తున్నారు. తొలుత ఎంత వేగంగా పనులు చేస్తే అంతేస్థాయిలో డబ్బులు వస్తాయని చెప్పిన అధికారులు ప్రస్తుతం ఇరకాటంలో పడ్డారు. ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడంతో బిల్లుల కోసం వచ్చి అడుగుతున్న వారికి సమాధానం చెప్పలేక, పెండింగ్ పనులు పూర్తిచేయలేక సతమతం అవుతున్నారు. జిల్లాలో ఇప్పటివరకు పల్లె పండుగ పనులకు సంబంధించి రూ.70 కోట్ల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. పనులు చేసిన వారంతా అధికారపార్టీ వారే కావడంతో వారు నేతల చుట్టూ తిరుగుతున్నారు.



ఒంగోలు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చిన మూడు నెలలకే గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన పేరుతో పెద్దఎత్తున గ్రామాల్లో అభివృద్ధి పనులను ప్రారంభించింది. పల్లె పండుగ పేరుతో సీసీ రోడ్లు, డ్రైన్లు, తారురోడ్లు, ఇతరత్రా పనులను ఉపాధి హామీ పథకం మెటీరియల్ కోటా నిధులతో మంజూరు చేసింది. అలా జిల్లాలో తొలిదశలో ఒక్కొక్క నియోజకవర్గానికి సగటున రూ.15కోట్ల వంతున రూ.120 కోట్లు, రెండవ దశలో ఎస్సీ కాలనీల్లో పనులకు మరో రూ.41 కోట్లు, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఇతరుల ప్రతిపాదనల మేరకు మరో రూ.9 కోట్లు వెరసి రూ.170కోట్ల విలువైన పనులు మంజూరయ్యాయి. అధికభాగం పనులను అక్టోబరులో మంజూరు చేయగా అనంతరం కొన్ని మంజూరు అయ్యాయి.

ఉత్సాహంగా పనులు పూర్తి

సంక్రాంతి నాటికి ఈ పనులు పూర్తిచేసేలా లక్ష్యం నిర్దేశించిన ప్రభుత్వం, చేసిన పనులకు ప్రతి గురువారం చెల్లింపులు చేసేలా నిర్ణయించింది. డ్వామా, పంచాయతీరాజ్ శాఖల పర్యవేక్షణలో ఈ పనులు చేపట్టగా కలెక్టర్ స్థాయిలో ప్రతివారం సమీక్షలు చేపట్టారు. అధికారం వచ్చిన ఆనందంలో ఉన్న అధికార పార్టీ స్థానిక నేతలకు ప్రభుత్వం ఏర్పడ్డ కొద్దినెలలకే ఒకస్థాయి పనులు దక్కడంతో ఉత్సాహంగా వాటిని ప్రారంభించారు. అధికారులు కూడా తొలుత పనుల పర్యవేక్షణ ఎక్కువగానే చేశారు. అంతేకాక తొలి నెలన్నర పాటు ప్రతి గురువారం చేసిన పనులకు బిల్లుల చెల్లింపు జరిగింది. దీంతో వేగవంతంగా పనులు పూర్తిచేశారు. డిసెంబరు నుంచి బిల్లుల చెల్లింపు మందగించింది. ఇంచుమించు రెండు నెలలుగా అసలు బిల్లులు పడటం లేదు. దీంతో పనులు చేసిన వారు బిల్లుల కోసం తిరుగుతుండగా చేయాల్సిన పనులు ముందుకు సాగడం లేదు.

త్వరలో ఇస్తామంటున్న అధికారులు

చెల్లింపు చేసిన దాని కన్నా రెట్టింపునకుపైగా పెండింగ్‌లో ఉండటంతో పనులు చేసిన బిల్లులు అడుగుతున్న వారికి సమాధానం చెప్పలేక, చేయాల్సిన పనులు పూర్తికి వత్తిడి చేయలేక అధికారులు సతమతం అవుతున్నారు. దీంతో పనులు నత్తనడకన సాగుతున్నాయి. రెండవ దశలో ఎస్సీ కాలనీల్లో చేపట్టిన పనులకు ఒక్క రూపాయి కూడా చెల్లింపు జరగలేదు. ఆ పనులు మరింత ఆలస్యం అవుతున్నాయి. దీనిపై డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ స్పందిస్తూ బిల్లుల పెండింగ్ మాట వాస్తవమేనన్నారు. తొలుత ప్రతివారం ఇచ్చినా ఆ తర్వాత ఆగాయన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి విషయాన్ని తీసుకెళ్లామని, త్వరలో నిధులు వస్తాయని పేర్కొన్నట్లు చెప్పారు.


శిక్షణలో తుపాకీ గురి పెడుతున్న ఎస్పీ దామోదర్

లక్ష్యాన్ని ఛేదించేలా తర్ఫీదు పొందాలి

6

ఫైరింగ్ రేంజ్ ప్రాక్టీస్‌లో ఎస్పీ దామోదర్

స్టోనాలో గ్రానైట్ వ్యాపారుల ఆశలు ఆవిరి

6

చైనా బయ్యర్లకు వీసాల నిరాకరణ

స్టాల్స్ ఏర్పాటులో సైతం కనపడని ఆసక్తి

జిల్లా నుంచి ఉత్సాహంగా వెళ్లిన ఔత్సాహికులకు నిరాశ

పరిశ్రమల దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో కలెక్టర్ తమీమ్ అన్సారియా

7

ఆ రూ.48లక్షలు ఎందుకిచ్చారు?

సీఐడీ కేసులు ఏమైనా వాదించావా..

లీగల్ అసిస్టెంట్‌గా పనిచేయడానికి అర్హత ఉందా..

ముసుగులు ధరించిన ఆ ముగ్గురు ఎవరు..

తులసిబాబును మరోసారి విచారించిన ఎస్పీ

ఉదయాన్నే గుంటూరు నుంచి పోలీసు కస్టడీకి..


7 గంటల పాటు విచారణ

నేడు తిరిగి గుంటూరు కోర్టుకు తరలింపు


ఒంగోలు తాలూకా పోలీస్‌స్టేషన్‌లో తులసిబాబు

వివరాలు మెయిన్‌లో

జీరో.. మొర్రో!



పాతవరం గ్రామానికి చెందిన ఒక రైతు ఆరు ఎకరాల డీకే భూమిని కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ కూడా చేయించుకున్నాడు. ఆ భూమిని ఆన్‌లైన్‌లో ఎక్కించి పట్టాదారు పాసుపుస్తకాలు ఇచ్చేందుకు మధ్యవర్తి ద్వారా రెండేళ్ల క్రితం ఒక అధికారికి రూ.3 లక్షలు ఇచ్చారు. సదరు అధికారి ఆ పని చేయకుండా వెళ్లిపోయాడు.

దర్శికి చెందిన ఇద్దరు రైతులు 22ఏలో నమోదైన భూములను క్రమబద్ధీకరించేందుకు రూ.3లక్షల చొప్పున అదే అధికారికి రెండేళ్ల క్రితం ముడుపులు చెల్లించారు. ఆ అధికారి ఎన్నికల సమయం వచ్చేవరకు పనిచేయకపోవటంతో ఇక పనికాదనే ఉద్దేశంతో వారు గట్టిగా అడిగి డబ్బులు వెనక్కు తీసుకున్నారు. మరికొంతమంది రైతులు ఎలాగు పని చేయలేదు కాబట్టి తమ డబ్బులు వెనక్కు ఇవ్వాలని ముడుపులు తీసుకున్న అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

- క్రమబద్ధీకరణకు నోచుకోని రెవెన్యూ రికార్డులు
- ఏళ్లతరబడి ఇబ్బందులు పడుతున్న రైతులు
- గత వైసీపీ పాలనలో ముడుపులు తీసుకొని బదిలీ అయిన అధికారులు
- వారి చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోని వైనం

దర్శి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ రికార్డుల క్రమబద్ధీకరణ కోసం మండలంలో అనేకమంది రైతులు ఏళ్లతరబడి తిరుగుతున్నారు. గత వైసీపీ పాలనలో రెవెన్యూ రికార్డులు తప్పులతడకగా మారటంతో నిజమైన హక్కుదారుల భూములు కూడా 22ఏలో, జీరో ఖాతాల్లో పడ్డాయి. మరికొన్ని భూములకు హక్కు కలిగిన రైతులు ఎంతోకాలంగా సాగు చేసుకుంటున్నప్పటికీ వారి పేర్లు రికార్డుల్లోకి ఎక్కలేదు. అప్పట్లోనే పలువురు రైతులు రికార్డుల క్రమబద్ధీకరణ కోసం కొందరు అధికారులకు లక్షలాది రూపాయలు ముడుపులు చెల్లించారు. ఆ అధికారులు అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేశారు. ఎన్నికల అనంతరం ముడుపులు తీసుకున్న అధికారులు బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్లారు. ఈ నేపథ్యంలో బాధిత రైతులు ఏం చేయాలో పాలుపోక అల్లాడుతున్నారు. రాజంపల్లికి చెందిన కొంతమంది రైతులు 22ఏలో చేరిన భూములను క్రమబద్ధీకరణ కోసం రెండుసార్లు ముడుపులు చెల్లించినా పని జరగకపోగా అధికారుల చుట్టూ ఇప్పటికీ తిరుగుతున్నారు.

పని కాక డబ్బులు వెనక్కి.

ఏడు సంవత్సరాల క్రితం అప్పటి రెవెన్యూ అధికారులకు 22ఏలో చేరిన భూములను క్రమబద్ధీకరించేందుకు రూ.8లక్షలు ముడుపులు చెల్లించారు. ఆ అధికారులు బదిలీ కావటంతో ఎలాంటి పని జరగలేదు. ముడుపులు తీసుకున్న కొందరు అధికారులు పదవీ విరమణ పొంది వెళ్లిపోయారు. ఆ డబ్బులు కోల్పోయారు. ఆ తర్వాత రెండేళ్ల క్రితం అదే భూమిని క్రమబద్ధీకరించేందుకు అప్పుడు పనిచేస్తున్న అధికారికి రూ.5లక్షలు ముడుపులు చెల్లించారు. రెండోసారి డబ్బులు తీసుకున్న అధికారి ఆ పని చేయలేదు. దీంతో విసుగుచెంది ఆ అధికారి నుంచి కొంత డబ్బులు తీసుకున్నట్లు సమాచారం. మిగిలిన సొమ్ము కోసం అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

ఇతర ప్రాంతాలకు వెళ్లి..

టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ అధికారులు ఇక్కడ ఉంటే ఇబ్బందిపడతామనే ఉద్దేశంతో ఇతర ప్రాంతాలకు వెళ్లి హాయిగా ఉద్యోగాలు చేసుకుంటున్నారు.

మిగతా 6లో...


మద్దిపాడు మండలం రాచవారిపాలెంలో మినీగోకులంను ప్రారంభించి గేదెలకు మేత వేస్తున్న డ్వామా పీడీ జోసెఫ్‌కుమార్ (ఫైల్)

పాడిరైతులకు బాసటగా..

శరవేగంగా మినీగోకులాల నిర్మాణాలు

- మంజూరు చేసినవి 1,153 ● 622 పూర్తి, వివిధ దశల్లో 439

7

మృతి చెందిన మహిళ గుర్తింపు

ఆమె వేటపాలెం బండ్ల బాపనయ్య కళాశాల లెక్చరర్


సౌజన్య (ఫైల్)

వేటపాలెం(చీరాలటౌన్), ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : రైలు ప్రమాదంలో గత రెండు రోజుల కిందట మృతి చెందిన మహిళను చీరాల రైల్వే పోలీసులు గుర్తించారు. ఆమె వేటపాలెంకు చెందిన బొజ్జగాని సౌజన్య(48). ఈమె స్థానిక బండ్ల బాపనయ్య జూనియర్ కళాశాలలో కామర్స్ లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. భర్త గతకొంత కాలం కిందట మృతిచెందగా, కుమార్తె విజయవాడలో లా కోర్స్ చేస్తుండగా, కుమారుడు ఇతర ప్రాంతంలో చదువుతున్నాడు. ఈక్రమంలో రోజులాగే వాకింగ్ నిమిత్తం ఇంటి నుంచి బయటకు వచ్చి పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందారు. మృతదేహానికి గురువారం పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. తల్లిదండ్రులను కోల్పోయిన బిడ్డలు విలపిస్తుండగా బంధువులు ఓదార్చారు.

మద్యం మత్తులో యువకుల గొడవ

మార్టూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : మద్యం సేవిస్తూ బుధవారం అర్ధరాత్రి కొణిదెన రోడ్డులో కొంతమంది యువకులు గొడవ చేసిన ఘటన జరిగింది. అందిన సమాచారం మేరకు.. మార్టూరు గ్రామానికి చెందిన కొంతమంది యువకులు కొణిదెన రోడ్‌లో మద్యం సేవించారు. అనంతరం రోడ్డుపై అరుపులు, కేకలు వేసుకుంటూ అదేమిటని అడిగిన మహిళపై కూడా భౌతిక దాడి చేసినట్లు తెలిసింది. అనంతరం వారు కొణిదెన రోడ్డు వద్ద మద్యం సేవిస్తుండగా గస్తీ పోలీసులు వారిని అక్కడ నుంచి పంపించివేసినట్లు తెలిసింది. కొణిదెన రోడ్‌లో మద్యం దుకాణాలు ఉండడంతో యువకులు మద్యం కొనుగోలుకు వెళ్లిన సమయంలో ఈ గొడవ జరిగినట్లు తెలిసింది. ఈ విషయమై గురువారం సీఐ ఎం.శేషగిరిరావును ఆంధ్రజ్యోతి వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు. అయినా పూర్తి స్థాయిలో విచారణ చేపడతామన్నారు.

పోతుకట్లలో చోరీ

పోతుకట్ల (పర్చూరు), ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పోతుకట్ల గ్రామంలో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన గండికోట బాజీ ఇంటికి తాళం వేసి పొలం పనులకు వెళ్లారు. బుధవారం సాయంత్రం ఇంటికి వచ్చి చూసేసరికి తాళం తీసి ఉండడాన్ని గుర్తించారు. వెంటనే లోపలికి వెళ్లి చూడగా బీరువా తాళం తీసి అందులో ఉన్న 10గ్రాముల బంగారు వస్తువులు దొంగిలించినట్లు చూసి ఆందోళన చెందారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆ ఇంటిని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మాల్యాద్రి తెలిపారు.

పలుచోట్ల విద్యుత్ అధికారుల తనిఖీలు

యద్దనపూడి, (మార్టూరు) ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : యద్దనపూడి మండలంలో విద్యుత్ అధికారుల బృందాలు గు రువారం గ్రామాలలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో 43 విద్యుత్ సర్వీసులకు చెందిన వారు విద్యుత్ అధిక లోడు వినియోగిస్తున్నారని వారికి 1 లక్షా 23 వేల రూపాయలను పెనాల్టీగా విధించినట్లు బాపట్ల ఏపీసీపీడీసీఎల్ సూపరిం టెండెంట్ ఇంజనీర్ జీ ఆంజనేయులు తెలిపారు. గ్రామాలలో విద్యుత్ అధికారుల బృందాలు తనిఖీలు నిర్వహించిన తర్వాత యద్దనపూడి విద్యుత్ కార్యాలయం వద్ద అధికారులతో కలిసి ఎస్ఈ ఆంజనేయులు విద్యుత్ వినియోగదారులతో మాట్లాడారు. దొంగతనంగా విద్యుత్ ను వినియోగించడం, అక్రమ పద్ధ తులు ద్వారా విద్యుత్‌ను వినియోగించాలనుకోవడం నేరమన్నారు. నెలవారీ బిల్లు లు వెంటనే చెల్లిస్తే పెనాల్టీలే ఉండవన్నారు. కరెంటు మీటర్లు లేని వారు దరఖాస్తు చేసుకుంటే వెంటనే వారికి మీటరును అందచేస్తామన్నారు. అదేవిధంగా ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకాన్ని అందరూ వినియోగించుకోవాలన్నారు. తద్వారా విద్యుత్ బిల్లులు తగ్గుతాయన్నారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ డీఈ మల్లికార్జునరావు, అద్దంకి ఈఈ మస్తాన్‌రావు, యద్దనపూడి ఏఈ టీ సురేష్‌బాబు, పలువురు ఏఈలు పాల్గొన్నారు.

స్టోనాలో గ్రానైట్ వ్యాపారుల ఆశలు ఆవిరి


ప్రదర్శనలో ఏర్పాటుచేసిన స్టాల్స్, చీమకుర్తి నుంచి వెళ్లిన వ్యాపారులు

చైనా బయ్యర్లకు వీసాల నిరాకరణ

స్టాల్స్ ఏర్పాటు కూడా అంతంతమాత్రమే...

జిల్లా నుంచి ఉత్సాహంగా వెళ్లిన ఔత్సాహికులకు నిరాశ

చీమకుర్తి,ఫిబ్రవరి13(ఆంధ్రజ్యోతి): ప్రపంచవ్యాప్తంగా స్టోన్ ఎగ్జిబిషన్లలో బెంగళూరులో రెండేళ్లకొకసారి అట్టహాసంగా నిర్వహించే స్టోనాకు ఎంతో పేరుప్రఖ్యాతులున్నాయి. ప్రపంచంలో జరిగే అతిపెద్ద ప్రదర్శనలలో స్టోనా ఒకటిగా ఉంది.ఈ ప్రదర్శనలో పాల్గొనటానికి చైనా,తూర్పు ఆసియా,యూరప్,పశ్చిమ దేశాలనుంచి పెద్ద ఎత్తున బయ్యర్లు,ట్రేడర్లు,వివిధరకాల స్టోన్ పరిశ్రమకు చెందిన వారు విచ్చేస్తుంటారు. ఇదంతా గతం...ఈనెల 12వతేదీ నుంచి ప్రారంభమైన పదహారవ స్టోనాలో ఇప్పటి వరకూ జరిగిన పదిహేను స్టోనాలకు భిన్నంగా జరుగుతుండటం గ్రానైట్ వ్యాపారులను నివ్వెరపరుస్తోంది. నాలుగురోజుల పాటు జరిగే ప్రదర్శనలో సాధారణంగా తొలి,చివరిరోజులు ప్రారంభాలు,ముగింపుసభలు జరుగుతాయి. రెండు, మూడురోజులు చాలా కీలకంగా ఉంటాయి.రెండోరోజు ఎక్కువ మంది బయ్యర్లు, వ్యాపారులు, ఔత్సాహికులు పాల్గొంటారు. కానీ ఇప్పుడు జరుగుతున్న స్టోనాలో బయ్యర్ల హాజరు అత్యంత సాధారణంగా ఉండటం గ్రానైట్ వ్యాపారులను కలవరపరుస్తోంది. చైనా, ఇండియాల మధ్య నెలకొన్న వాతావరణంతో చైనా బయ్యర్లకు వీసాలను మంజూరు ప్రక్రియను ఇండియా సంక్లిష్టం చేసింది. దీంతో వారి హాజరు కనపడకుండా ఉన్న పరిస్థితి ఏర్పడింది. చీమకుర్తి పరిసరప్రాంతాల్లో విస్తరించిన ప్రపంచ ప్రఖ్యాతిచెందిన గెలాక్సీ గ్రానైట్ సింహభాగం చైనాకు ఎగుమతి అవుతోంది. స్టోనాలో పాల్గొన్న బయ్యర్లు కొనుగోలు ఒప్పందాలు చేసుకోవటం గతంలో ఉండేది. ప్రస్తుతం వారు హాజరు కాకపోవటం స్టోనాను తీవ్ర నిరాశను కల్గిస్తోంది. జిల్లా నుంచి స్టోనాలో పాల్గొన్న ఔత్సాహిక వ్యాపారులు నిరుత్సాహానికి గురయ్యారు. స్టోనా ప్రదర్శన చూడాలని ఉత్సాహంగా వెళ్లిన గ్రానైట్ ఫ్యాక్టరీ ఓనర్లు సైతం గతస్థాయిలో స్టాల్స్ ఏర్పాటు చేయక పోవటంతో నిరాశకు గురయ్యారు.

గ్రానైట్ క్వారీయింగ్, కటింగ్, పాలిషింగ్ ప్రక్రియలో ఉపయోగించే అధునాతన పరికరాలతో కూడిన స్టాల్స్ ఏర్పాటు చేయటం ఈసారి జరుగుతున్న స్టోనాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఇక శుక్రవారం అయినా విదేశాల నుంచి బయ్యర్లు వస్తారేమే అన్న ఆశతో స్టోనాకు వెళ్లిన వ్యాపారులు ఎదురుచూస్తున్నారు. జిల్లా నుంచి ఆపిల్ గ్రానైట్ అధినేత శిద్దా సూర్యప్రకాశరావు, కోడూరి వెంకట్రావు, చిన్నపురెడ్డి మస్తాన్‌రెడ్డి, శేఖరెడ్డి మలినేని వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సహకార ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : సహకార శాఖద్వారా అమలు జరుగుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి ఉద్యమంలా తీసుకెళ్లాలని కలెక్టర్ తమీమ్‌అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో గురువారం జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించి మాట్లాడారు. ఐక్యరాజ్య సమితి 2025ను అంతర్జాతీయ సహకార సంవత్సరంగా ప్రకటించిన నేపథ్యంలో జిల్లాలో సహకార ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్ళేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. నెలవారీ ప్రణాళికను రూపొందించి తదనుగుణంగా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కేంద్ర సహకార బ్యాంకు, జిల్లా మహిళా సమాఖ్య, చేనేత సహకార సంఘాలు, గొర్రెల పెంపకందార్ల సహకార సంఘాలు, జిల్లామార్కెటింగ్ సహకార సంఘాలు తదితరాల ఆధ్వర్యంలో సెమినార్లు, ప్రదర్శనలు, శిక్షణ తరగతులను నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించి తదనుగుణ చర్యలను ఆయాశాఖల అధికారులు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం అంశాల వారీగా సమీక్షించి దిశా నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఓబులేషు, జిల్లా సహకార అధికారి బి. శ్రీనివాసరెడ్డి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాసరావు, పీడీసీసీ బ్యాంకు సీఈవో బిందు ప్రత్యూష, నాబార్డు జిల్లా అధికారి రవికుమార్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి పద్మశ్రీతో పాటు పలుశాఖల అధికారులు ఉన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ముందస్తు జాగ్రత్తలతో నోటి క్యాన్సర్ నివారణ

రిమ్స్‌లో అవగాహన ర్యాలీ

ఒంగోలు, కార్పొరేషన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : తగిన జాగ్రత్తలు తీసుకుంటే ముందుగానే నోటి క్యాన్సర్‌ను నివారించవచ్చని జీజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ నామినేని కిరణ్ కుమార్ తెలిపారు. నోరు, మాక్సీలో ఫేషియల్ సర్జరీ దినోత్సవాన్ని పురస్కరించుకుని రిమ్స్ మెడికల్ కాలేజి, జీజీహెచ్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నామినేనితోపాటు, రిమ్స్ మెడికల్ కాలేజి సూపరింటెండెంట్ డాక్టర్ వై. ఏడుకొండలు హాజరై మాట్లాడారు. డాక్టర్ కిరణ్ మాట్లాడుతూ వెల్‌స్కోప్ పరికరం ద్వారా ప్రాథమిక దశలోనే క్యాన్సర్‌ను గుర్తించవచ్చని తెలిపారు. అందులో భాంగా ఈ ఏడాది నిపుణులతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఎరుపు లేదా తెలుపు మచ్చలు, నోటి గడ్డలు వంటివి క్యాన్సర్ సంకేతాలు కావచ్చని తెలిపారు. అయితే వాటిని మొదట్లోనే గుర్తించడానికి అవసరమైన క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు ఒంగోలులోని జీజీహెచ్‌లోఉచితంగా పరీక్షలు చేస్తామన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు మాట్లాడుతూ క్యాన్సర్‌రహిత రాష్ట్రంగా తీర్చి దిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. జీజీహెచ్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన క్యాన్సర్ స్క్రీనింగ్ విభాగంలో సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. అనంతరం మెడికల్ కాలేజీలోని సెమినార్ హాల్‌లో వైద్య విద్యార్థులకు మాక్సీల్లో ఫేషియల్ చికిత్స, కారణాలు, అవగాహన అనే అంశాలపై వివరించారు కార్యక్రమంలో సీఎస్ఆర్ఎంవో డాక్టర్ మాధవిలత, డాక్టర్లు సుధాకర్ బాబు, తిరుమలరావు, హిమశిల్ప, శ్రీనివాసరెడ్డి, పోతురాజు, తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీలో పాల్గొన్న వైద్యులు, వైద్య విద్యార్థులు

రైతులకు తీపిని పంచుతున్న నల్ల చెరకు

- ఈ ఏడాది మంచి డిమాండ్
- పెట్టుబడులు పోను ఎకరాకు రూ.2లక్షల పైనే ఆదాయం
- బల్లికురవ మండలంలో 200 ఎకరాల్లో సాగు
- ఇతర ప్రాంతాల నుంచి వ్యాపారులు వచ్చి కొనుగోలు

బల్లికురవ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది నల్ల చెరకు సాగు చేసిన రైతులు లాభాలబాటలో ఉన్నారు. పెట్టుబడులు పోను ఎకరాకు రెండు లక్షల వరకు ఆదాయం వస్తుంది. చెరకు సాగు చేసిన రైతుల్లో ఆనందరం వెల్లివిరుస్తోంది. వ్యాపారులు సైతం గ్రామాలకు వచ్చి చెరకు గెడలను కొనుగోలు చేసి వెళుతుండడంతో రైతులకు కూడా పెద్ద ఇబ్బంది లేదు. గత ఏడాది ధరలు కొంత వెనకంజ వేయగా ఈ ఏడాది మాత్రం మంచి డిమాండ్‌తో కొనుగోళ్లు జరుగుతున్నాయి. తాము చెరకు పంటను నమ్ముకొని సాగు చేస్తున్నామని, ధరలు ఆశాజనకంగా ఉన్నాయని రైతులు అంటున్నారు.

బల్లికురవ మండలం అంటే జనవరి నుంచి నల్ల చెరకు పంటకు కేరాఫ్‌గా మారుతుంది. మండలంలోని కూకట్లపల్లి, గొర్రెపాడు గ్రామాలలో ఎన్నో ఏళ్ల నుంచి రైతులు నల్ల చెరకును సాగు చేస్తున్నారు. ఈ ఏడాది అ గ్రామాలను చూసి అంబడిపూడి, వైదన, కొత్తూరు, వెలమవారిపాలెం తదితర గ్రామాలలో కూడా రైతులు చెరకు పంట వైపు ఆసక్తిని చుపారు. మండలంలో మెత్తం 200 ఎకరాల్లో రైతులు గత ఏడాది ఏప్రిల్‌లో నల్ల చెరకు సాగు చేశారు. బోరు బావుల నీరు అందుబాటులో ఉన్న రైతులకు చెరకు పంట తీపిని పంచింది. రైతులు పండించిన నల్ల చెరకు కోతలు గత పదిహేను రోజుల నుంచి ఊపందుకున్నాయి. రైతుల వద్దకు వైజాగ్, విజయవాడు, కాకినాడ, భీమవరం, నంద్యాల, అత్మకూరు, కలిదిండి, ఏలూరు, కడప తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులు వచ్చి నల్ల చెరకును కొనుగోలు చేస్తున్నారు. ఎకరా చెరకు పంటను రూ.4 లక్షల వరకు కొనుగోలు చేస్తున్నారు. ఎకరా చెరకు తోటలో 25వేల నుంచి 30వేల వరకు గెడల దిగుబడి వస్తున్నాయి. వ్యాపారులు గెడలను కొట్టించుకొని లారీలలో తరలిస్తున్నారు. రుచిగా, తీపిగా చెరకు గెడలు బహిరంగ మార్కెట్‌లో ఒకటి రూ.40కి వ్యాపారులు విక్రయిస్తున్నారు. ఎన్నో ఏళ్ల నుంచి నల్ల చెరకు సాగుకు బల్లికురవ మండలం ప్రసిద్ధి చెందడంతో వ్యాపారులు కూడా సీజన్ వస్తే నేరుగా వస్తున్నారని రైతులు తెలిపారు.


ఆకును తొలగిస్తున్న కూలీలు

చెరకు సాగుకు పెట్టుబడులు ఇలా

ఎకరంలో నల్ల చెరకు సాగు చేయాలంటే రైతులు ముందుగా ఎకరాకు విత్తనపు చెరకు ముక్కలు 12 వందలు నాటుతారు. ఒక గెడ రూ.10 వెచ్చించి తెస్తారు. పెట్టుబడులు పోయి గెడలు కొట్టుడుకు వచ్చే సమాయానికి రూ.2లక్షల వరకు రైతులకు ఖర్చులు అవుతాయి. ఎకరం చెరకు సాగుకు కౌలు కూడా రూ.40వేల వరకు పలుకుతుంది. రైతులు ఎకరా రూ.4లక్షలకు వ్యాపారులకు అమ్మకాలు చేస్తున్నారు. ఏడాది కాలంలో చెరకు సాగు పూర్తి అయి అమ్మకాలు పూర్తి అవుతాయి. రిటైల్‌గా అయితే రైతులు తోటల వద్ద ఒక గెడ రూ.30కి అమ్మకాలు చేస్తున్నారు. అదే వ్యాపారులు అయితే ఒక గెడ రూ.40కి అమ్మకాలు చేస్తున్నారు.

రెండు గ్రామాల్లో అధికం

బల్లికురవ మండలంలోని కూకట్లపల్లి, గొర్రెపాడు గ్రామాలలోనే గత రెండు దశాబ్దాల నుంచి రైతులు నల్ల చెరకు సాగు చేస్తున్నారు. నష్టాలు వచ్చిన లాభాలు వచ్చినా రైతులు చెరకును పండిస్తుంటారు. మెదట్లో వ్యాపారులు వచ్చి కొనుగోలు చేయని సమయంలో రైతులే నేరుగా తిరునాళ్లకు తీసుకెళ్లి అమ్మేవారు. అయితే మంచి రుచి, నాణ్యమైన చెరకు దిగుబడి అవుతుండడంతో వ్యాపారులే నేరుగా వచ్చి కొంటున్నారని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ రెండు గ్రామాలలో సాగును చూసిన పక్కపక్క గ్రామాల్లో కూడా అడపాదడపా సాగు చేస్తున్నారు.

లక్ష్యాన్ని ఛేదించేలా తర్ఫీదు పొందాలి

ఫైరింగ్ రేంజి ప్రాక్టీస్‌లో ఎస్పీ దామోదర్

ఒంగోలు క్రైం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి) : బుల్లెట్ లక్ష్యాన్ని ఛేదించేలా పోలీసు అధికారులు తర్ఫీదు పొందాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ చెప్పారు. శుక్రవారం చీమకుర్తి మండలం పల్లామల్లి కొండలలో ఉన్న ఫైరింగ్ రేంజిలో వార్షిక ఫైరింగ్ రేంజి ప్రాక్టీస్ జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో ప్రజలు, ప్రభుత్వం, ధన, ప్రాణ రక్షణకు ఎల్లవేళలా సంసిద్ధులు కావాలని సూచించారు. అదే సమయంలో తుపాకీలు ఎలా వినియోగించాలో స్వయంగా తర్ఫీదు ఇచ్చారు. పిస్టల్, ఎస్ఎల్ఆర్, ఏకే 47 లాంటి గన్‌లను ఎలా వినియోగించాలి అనేది షూట్ చేసి వివరించారు. అత్యవసర పరిస్థితిలో కాల్పులు జరపాల్సి వస్తే తీసుకోవాల్సిన చర్యల గురించి తెలిపారు. తుపాకీ వినియోగించే సమయంలో ఏకాగ్రత ముఖ్యమన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు సేవలు చాలా కీలకమని చెప్పారు. అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ కె.నాగేశ్వరరావు, ఏఆర్ అదనపు ఎస్పీ అశోక్‌బాబు, డీఎస్పీలు లక్ష్మీనారాయణ, నాగరాజు, సాయిఈశ్వర్ యశ్వంత్, కే శ్రీనివాసరావు పాల్గొన్నారు.


ఫైరింగ్ ప్రాక్టీస్ చేస్తున్నఎస్పీ, పోలీసులు

ఒంగోలు నగర శివారు ప్రాంతాలలో దొంగలు హల్‌చల్

అవీఇవీ

త్రోవగుంటలో చోరీ.. కొప్పోలు రోడ్డులో దొంగలు సంచారం

ఒంగోలు క్రైం,ఫిబ్రవరి13(ఆంధ్రజ్యోతి): నగరంలో దొంగలు హల్‌చల్ చేశారు.గురువారంరాత్రి శివారు ప్రాంతాలే లక్ష్యంగా చోరీలకు పాల్పడ్డారు. కర్నూలురోడ్డులోని ఆంధ్రకేసరినగర్‌లో ఓ ఇంటి తాళాలు పగులగొట్టి సుమారుగా రూ. 10 లక్షలు విలువైన సొత్తును అపహరించుకెళ్లారు. అదే విధంగా త్రోవగుంటలోని అంబేద్కర్ నగర్‌లో బొచ్చు అంజమ్మ ఇంటి తాళాలు పగులకొట్టి 4 సవర్ల బంగారం ఆభరణాలు అపహరించుకెళ్లారు. ఇదే విధంగా బుధవారం అర్ధరాత్రి ముగ్గురు దొంగలు కొప్పోలు రోడ్డులోని డ్రీమ్స్ నగర్‌లో హల్‌చల్ చేశారు. అయితే అక్కడ ఓ కారు రావడం చూసి దొంగలు పరారయ్యారు. శివారు ప్రాంతాలలో గస్తీ తగ్గడంతో దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. దీనిపై పోలీసులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆంధ్రకేసరి నగర్‌లో భారీ చోరీ

తాళం వేసి ఉన్న ఇళ్లే దొంగల టార్గెట్

రూ.10లక్షల విలువైన సొత్తు అపహరణ

ఇంటిని పరిశీలించిన సీఐ


ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

ఒంగోలు క్రైం, ఫిబ్రవరి13(ఆంధ్రజ్యోతి): తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీకి పాల్పడి సుమారు రూ.10 లక్షల విలువైన సొత్తును దొంగలు అపహరించుకుని వెళ్లారు. ఈ సంఘటన స్థానిక కర్నూలు రోడ్డులోని ఆంధ్రకేసరి నగర్‌లో గురువారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలలోకి వెళితే... బ్యాంక్ రిటైర్డ్ ఉద్యోగి తుమ్మకూరి పాండురంగారావుకు ఆరోగ్యం బాగలేక భార్యతో కలిసి ఈ నెల 8న మార్కాపురంలో కుమార్తె వద్దకు వెళ్లారు. శుక్రవారం ఉదయం పక్క ఇంటి వారు పాండురంగారావుకు ఫోన్ చేసి ఇంటి తలుపులు పగలకొట్టి ఉన్నాయని చెప్పారు. దీంతో ఆయన వచ్చి చూడగా ఇంటి ప్రధాన ద్వారం పెకలించి ఉంది. గుర్తు తెలియని వ్యక్తులు లోపల బీరువాను పగలకొట్టి సుమారు 20 సవర్ల బంగారు ఆభరణాలు, కిలో వెండి సామగ్రి, రూ.50 వేల నగదును అపహరించుకెళ్లారు. చోరీకి గురైన సొత్తు సుమారు పదిలక్షలు రూపాయల విలువ ఉండవచ్చని అంచనా. తాలూకా పోలీసులకు సమాచారం ఇవ్వగా వేలిముద్రల నిపుణులు, డాగ్‌స్క్వాడ్‌తో వెళ్లి ఆధారాలు సేకరించారు. ఇంటి పరిసరాలను సీఐ అజయ్ కుమార్ తన సిబ్బందితో పరిశీలించారు. చుట్టుపక్కల సీసీ ఫుటేజీని పరిశీలిస్తున్నారు.

జీరో.. మొర్రో..!

(5వ పేజీ తరువాయి)

ఇక్కడ లక్షలాది రూపాయలు ముడుపులు చెల్లించిన రైతులు పనులు జరగక, డబ్బులు నష్టపోయి ఇబ్బందిపడుతున్నారు. కొంతమంది అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించినా ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవటతో ఇలాంటి సంఘటనలు తరచూ పునరావృతవుతున్నాయి.

చర్యలు తీసుకునేవారేరీ?

దర్శిలో ఎన్నికల సమయంలో పనిచేసిన అధికారులు ఆ నిధులను కూడా దుర్వినియోగం చేసినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్నికల సమయంలో భోజనాలు, షామియానాలు ఇతర పనులు చేసిన పలువురికి సక్రమంగా డబ్బులు కూడా చెల్లించలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఒక అధికారి ఎన్నికల సమయంలో కొనుగోలు చేసిన ఫర్నిచర్‌ను కూడా తన వెంట తీసుకెళ్లాడు. ఎన్నికల నిధులకు సంబంధించిన ఆడిట్ గురించి గాని, కొనుగోలు చేసి ఫర్నీచర్‌ను గాని జిల్లా అధికారులు పట్టించుకోలేదు. దీంతో ఆ అధికారులు లక్షలాది రూపాయలు లబ్ధిపొందటంతో పాటు విలువైన సామాన్లు తమ సొంతం చేసుకున్నారు. ఎన్నికలు జరిగి ఎనిమిది నెలలు గడుస్తున్నా ఏ కారణం చేతనో ఇప్పటివరకు జరిగిన అక్రమాలపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు గతంలో జరిగిన అవినీతి, అక్రమాలను పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

నాడు ఆర్భాటంగా జగనన్న కాలనీలు...

కనీస వసతులు కల్పించని వైసీపీ ప్రభుత్వం

లబ్ధిదారులకు శాపంగా మారిన వైనం

లక్షల రూపాయలు వెచ్చించి ఇళ్ల నిర్మాణాలు

ఉండలేక.. వెళ్లలేక.. సతమతం


వేలమూరిపాడు రోడ్డులో జగనన్న కాలనీలో రోడ్డు దుస్థితి

అద్దంకి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : కొత్త కాలనీలు కాదు.. కొత్తగా ఊర్లే ఏర్పడుతున్నాయి... వైసీపీ ప్రభుత్వం హయాంలో ప్రతి ఒక్క నేత నుంచి వచ్చిన మాటలు... అయితే ఇప్పుడు ఆయా కాలనీలలో పరిస్థితులు గమనిస్తే కనీసం చిట్టడవులను తలపించేలా ఆయా కాలనీలు ఉన్నాయి. నాయకుల మాటలు నమ్మి ఇళ్ల నిర్మాణం చేసుకున్న లబ్ధిదారుల బిక్కు బిక్కు మంటూ గడపాల్సిన పరిస్థితి ఏర్పడింది. వైసీపీ ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ఏర్పాటు చేసిన జగనన్నకాలనీలు... అప్పటి అధికారుల ఒత్తిడి తట్టుకోలేక ఇళ్ల నిర్మాణం చేసుకున్న లబ్ధిదారుల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. లక్షల రూపాయలు వెచ్చించి ఇళ్ళ నిర్మాణం చేసుకున్న లబ్ధిదారులు కనీస వసతులు కూడా లేకపోవటం తో అక్కడ ఉండలేక.. అక్కడ ఇంటిని వదిలి మరలా అద్దంకి పట్టణంలోకి వచ్చి అద్దె ఇళ్లల్లోకి రాలేక సతమతమవుతున్నారు. అప్పట్లో అధికారులు, ప్రజా ప్రతినిధుల మాటలు నమ్మి నిలువునా మోస పోయామని లబ్ధిదారులు లబోదిబో అంటున్నారు. అన్ని వసతులు కల్పన పూర్తయిన తరువాతనే లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం, గృహ ప్రవేశాలు జరుగుతాయని అధికారులు, ప్రజా ప్రతినిధులు చెప్పారు. ఆచరణలో మాత్రం పరిస్థితి వేరుగా మారింది. అధికారుల ఒత్తిడి తట్టుకోలేక లబ్ధిదారులు హడావుడిగా ఇళ్ల నిర్మాణం చేసుకున్నారు. అద్దంకి పట్టణంలో సుమారు 2వేల మంది లబ్ధిదారులకు బొమ్మనంపాడు రోడ్డు, వేలమూరిపాడు రోడ్డు, నాగులపాడు రోడ్డులలో లే అవుట్‌లు వేసి ఇళ్ల స్థలాలు కేటాయించారు. బొమ్మనంపాడు రోడ్డులో ఉన్న లేఅవుట్ అద్దంకి పట్టణానికి సుమారు 4కి.మీ దూరంలో ఉంది. సుమారు వెయ్యి మంది లబ్ధిదారులకు ప్లాట్లు కేటాయించారు. కనీస రవాణా వసతి కూడా లేదు. వర్షం పడితే కాలనీకి వెళ్లే పరిస్థితి కూడా లేదు. దీంతో ప్రస్తుతం 20 మంది లబ్ధిదారులు మాత్రమే నివాసం ఉంటున్నారు. దీంతో రాత్రి సమయంలో బిక్కు బిక్కు మంటూ గడుపుతున్నారు. అక్కడ ఉండలేక.... ఖాళీ చేసి రాలేక సతమతమవుతున్నారు. ఇక వేలమూరిపాడు, నాగులపాడు రోడ్డు లలో ఉన్న లేఅవుట్‌లో ఎక్కువ మంది లబ్ధిదారులు నివాసం ఉంటున్నా కనీస వసతులు కల్పించలేదు. విద్యుత్ సౌకర్యం మినహా మిగిలిన ఎలాంటి కనీస వసతుల కల్పన జరగలేదు. కనీసం గ్రావెల్ రోడ్లు, సీసీ డ్రైన్‌లు, తాగునీటి వసతుల కల్పన కూడా లేకపోవడంతో నివాసం ఉంటున్న లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. కనీసం సైడ్ డ్రైన్‌లు కూడా లేకపోవడంతో మురుగు ఇళ్ల ముందు నిలిచిపోతుంది. కాలనీలకు వెళ్లే రోడ్లు కూడా అభివృద్ధికి నోచుకోలేదు. నాడు వైసీపీ పాలకులు చేసిన నిర్లక్ష్యం లబ్ధిదారులకు శాపంగా మారి ఇప్పటికీ నరకయాతన అనుభవించాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొత్త గ్రామాలు చిట్టడవులుగా మారాయని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

కూటమి ప్రభుత్వం వచ్చాక ఎన్టీఆర్ కాలనీలుగా మార్పుతో సరి

సార్వత్రిక ఎన్నికలలో వైసీపీ ఓటమి చెంది కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జగనన్న కాలనీల పేర్లనును ఎన్‌టీఆర్ కాలనీలుగా మార్పు చేశారు. అయితే ఆయా కాలనీలలో వసతుల కల్పనపై మాత్రం కూటమి ప్రభుత్వం ఇంకా దృష్టి పెట్టకపోవడంతో లబ్ధిదారుల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. ఒక్కో ఇంటి నిర్మాణానికి సుమారు 10 నుంచి 12 లక్షల రూపాయల వరకు ఖర్చు అయింది. అందులో ప్రభుత్వం నుంచి 1.80 లక్షల రూపాయలు మాత్రమే వచ్చాయి. లక్షల రూపాయలు వెచ్చించి కట్టుకున్న ఇంటిని వదిలి రాలేక, వసతుల లేమి మధ్య ఉండలేక ఇబ్బంది పడుతున్నారు.

ప్రేమంటే...

రెండు అక్షరాలు కాదు.. రెండు అందమైన జీవితాలు

ప్రేమంటే రెండు అక్షరాలు కాదు.. అందులో అనిర్వ చనీయమైన భావన ఉంది. దీనికి కులం, మతం, ప్రాంతం అన్న బేధం ఉండదు. ఇష్టపడిన వారికి ఎంతటి సమస్య ఉన్నా గానీ, ఎంతటి అవాంతర మున్నా గానీ తాను ఉన్నానని కలిగించే ధైర్యం.

ఆకర్షణతో దగ్గరై, రోజుల వ్యవధిలో ముగిసేది కాదు ప్రేమంటే. కడ వరకు, కట్టెకాలే వరకు ఒకరి కష్టనష్టాలను ఒకరు తెలుసుకుంటూ.. ఒకరి ఇష్టాలను మరొకరు గౌరవించు కుంటూ.. జీవితాంతం తోడుండేదే ప్రేమ.



చీరాలటౌన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి)

అదొకబలమైన బంధం.. మౌనంగా ఉన్నా ఊసును తెలిపే మధురానుబంధం. అదో మ్యాజిక్ సరాగాల బంధం. అటువంటి ప్రేమతో ఎందరో ప్రముఖులు దగ్గరై ఒకరినొకరు అర్థం చేసుకుంటూ జీవితాన్ని ఆనందంగా గడుపుతున్నారు.

క్షణికావేశంలో ఎవరికీ దగ్గర కాకూడదని, భాగస్వామిని కచ్చితంగా ఎంచుకున్నాకే జీవితాన్ని ప్రారంభించాలని మానసికవేత్తలు సూచిస్తున్నారు.



కాలానుగుణంగా మార్పు...



గతంలో ఇద్దరు వ్యక్తులు ఇష్టపడిన ప్పుడు వారి ప్రేమకు కులం, మతం, ఆస్తిపాస్తులు అడ్డు గోడలుగా ఉండేవి. ఈక్రమంలో ఎన్నో దాడులు, దారుణాలు జరిగాయి. ఈక్రమంలో ఎంతోమంది కాలరాశారు. నేటి ఆధునికయుగంలో కొన్ని ప్రేమలకు ఆ ప్రేమికులే అవాంతరాలుగా ఉంటున్నారు. అతికొద్ది కాలంలోనే ఆకర్షణలకు లోనై కొద్ది రోజుల ప్రయాణంతోనే ముగింపు పలుకు తున్నారు. మరికొందరు ఏడాది, మరి కొందరు పెళ్లిపీటలు వరకు మాత్రమే ప్రయాణాలు సాగిస్తున్నారు. కొందరైతే ఒకరిద్దరు పిల్లలు పుట్టే వరకు ఉంటున్నారు. తరువాత ఒకరినొకరు అర్థం చేసుకోవ డంలో బలహీనమై పోలీస్ స్టేషన్ల మెట్లెక్కుతున్నారు. ఈజీవితాలు చిన్నాభిన్నం చేసుకుంటున్నారు. ఈక్రమంలో ఇటువంటి వాటికి పాల్పడకుండా ప్రేమను పవిత్రంగా చూడాలని ఒకప్పటి ప్రేమ విజేతలు.. నేటి అధికారులు ఆంధ్రజ్యోతితో ముఖాముఖిలో పంచుకున్నారు.

హౌస్ సర్జన్‌గా చేస్తూ...



డాక్టరు ఐ బాబూరావు ఎంబీబీఎస్ పూర్తి చేసి హౌస్ సర్జన్‌గా విధుల్లో ఉన్నప్పుడు 1995లో సుభాషిణిని చూశారు. ఏడాది తరువాత ఎలాగోలా ఒప్పించి విషయాన్ని పెద్దలు వరకు తీసుకెళ్లారు. స్వల్ప ఇబ్బందులు ఎదురైనప్పటికీ అందరి అండతో 1996లో వివాహమైంది. ప్రస్తుతం వీరికి ఇద్దరు కుమార్తెలు. పెద్దపాప చెర్రీ ఎండీ పల్మనాలజీ చదువుతుండగా, చిన్నపాప స్ఫూర్తి ఇంజనీరింగ్ ఫైనలియర్ చదువుతున్నారు. అలాగే డాక్టరు బాబూరావు చీరాలలో ప్రేమ హాస్పిటల్ నడుపుతుండగా, భార్య సుభాషిణి అదే హాస్పిటల్‌లో అడ్మినిస్ట్రేటివ్‌గా విధి నిర్వహణ చేస్తూ భర్తకు తోడుగా నిలిచారు.

ముసలయ్య, రాజ్యలక్ష్మీ దంపతులు



1995లో కారంచేడు మండలంలో జీ ముసలయ్య మండల సర్వేయర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆ సమయంలోనే అదేకార్యాలయంలో కంభంపాటి రాజ్యలక్ష్మి డిప్యూటీ తహసీల్దార్‌గా విధుల్లో ఉన్నారు. ఈనేపథ్యంలో కొద్దికాలం ఉద్యోగ బాధ్యతల్లో ఉన్న ముసలయ్యకు తనకు జీవితాంతం నడిచే భాగస్వామి తనేనని భావించారు. అనుకున్నది తడువుగా ధైర్యం చేశారు. 1998లో ప్రేమను వ్యక్తం చేశారు. ముందు కాదన్నా, తరువాత ముసలయ్య మంచితనం, మర్యాదలు గుర్తించిన రాజ్యలక్ష్మి ఓకే చెప్పారు. దీంతో ఇద్దరు పెద్దలను ఆశ్రయించారు. కులాలు వేరు కావడంతో పెద్దలు ఒప్పుకోలేదు. చివరకు రెండు కుటుంబాల వారిని ఒప్పించి 2002లో వివాహం చేసుకున్నారు. వారికి కుమార్తె అక్షత సంతానం. ప్రస్తుతం రాజ్యలక్ష్మి ఏపీ సిరీస్ జాయింట్ సెక్రటరీ విభాగంలో అంబేడ్కర్ గురుకుల పాఠశాల విభాగానికి డిప్యూటీ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తుండగా, ముసలయ్య చీరాల డివిజనల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

అమ్మానాన్న ఒకరినొకరు అర్థం చేసుకున్నారు : అక్షత



అమ్మానాన్నా చాలా బిజీగా ఉంటారు. పని భారం అధికంగానే ఉంటుంది. ఎప్పుడు తొందరపడరు. ఒకరినొకరు బాగా అర్థం చేసుకుంటారు. సమస్యపై మాట్లాడుకుని సరి చేసుకుంటారు. అదేక్రమంలో నాపై కూడా ప్రత్యేక కేర్ తీసుకుంటున్నారు.

పాడిరైతులకు బాసటగా...

శరవేగంగా మినీగోకులాల నిర్మాణాలు

మంజూరు చేసినవి 1,153

622 పూర్తి, వివిధ దశల్లో 439

ఒంగోలు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి) : అధిక శాతం సబ్సిడీతో పశుపోషకుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం చేపట్టిన మినీగోకులం పథకం పాడి రైతులకు బాసటగా నిలుస్తోంది. కొద్దినెలల వ్యవధిలోనే 622 గోకులాల నిర్మాణాలు పూర్తి కాగా మరో 439 వివిధ దశల్లో ఉన్నాయి. గతంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఉపాధి హామీ నిధుల ద్వారా ఈ పథకాన్ని ప్రారంభించారు. తర్వాత ఏడాదిలో ఎన్నికలొచ్చి ప్రభుత్వం మారిది. అనంతరం అధికారంలోకొ వచ్చిన వైసీపీ ఈ పథకాన్ని అటకెక్కించింది. కనీసం పూర్తయిన పనులకు కూడా బిల్లులు ఇవ్వకుండా ఇబ్బందిపెట్టింది. పశుపోషకులకు ఎంతో ఉపయోగకరమైన ఈ పథకాన్ని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తిరిగి చేపట్టింది. పశువుల షెడ్లకు 90శాతం, కోళ్లు, గొర్రెలు పెంపకం షెడ్లకు 70శాతం సబ్సిడీపై గరిష్ఠంగా రూ.2.30 లక్షలు యూనిట్ విలుగా నిర్ణయించి మంజూరు చేశారు. తీర ప్రాంత మండలాల్లో 50, ఇతర ప్రాంత మండలాల్లో 25 వంతున జిల్లాకు 1,075 యూనిట్లు మంజూరు చేయగా అధికారులు విస్తృత ప్రచారంతో భారీగా దరఖాస్తులు వచ్చాయి.

నిధులు రావడమే ఆలస్యం..

లబ్ధిదారుల ఎంపిక బాధ్యత పశుసంవర్ధకశాఖది. మంజూరు, నిధుల కల్పన, నిర్మాణ పర్యవేక్షణ డ్వామాది. 1,075 యూనిట్లకు 1,361 యూనిట్లను పశుసంవర్ధకశాఖ అధికారులు ఎంపికచేశారు. అందులో ఇప్పటికే పశువుల పాక ఉండి ఉండటం లేదా సొంత స్థలాలు కానివారు 208 మంది ఉన్నట్లు గుర్తించిన డ్వామా అధికారులు వాటిని రద్దుచేసి 1,153 మంజూరు చేశారు. అందులో 1,061 నిర్మాణాలు ప్రారంభించగా ఇప్పటికే 622 పూర్తయ్యాయి. మరో 437 షెడ్లు రూఫ్ దశకు చేరగా 217 షెడ్లు బేస్‌మెంట్ స్థాయిలో ఉన్నాయి. వీటిని ఈనెలలో పూర్తిచేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. నిజానికి తొలుత ఇచ్చిన స్థాయిలో చేసిన పనులకు బిల్లుల చెల్లింపు జరిగి ఉంటే ఈ పాటికి మొత్తం నిర్మాణాలు పూర్తయ్యేవి. రెండు నెలలుగా ఉపాధి పథకం మెటీరియల్ పనుల బిల్లుల చెల్లింపు ఆలస్యం అవుతుండటంతో ఈ పనులు కాస్తంత నెమ్మదించాయి. అయితే తక్కువ మొత్తం కావడంతో నిర్మాణదారులను అధికారులు ఒప్పించి పనులు జరిగేలా చేస్తున్నారు. దీంతో ఆయా ప్రాంతాలలో పనులు పూర్తిగా ఆగిపోకుండా కొనసాగుతున్నాయి. అధికభాగం నాలుగు గేదెలకు సరిపడా ఉండే షెడ్లు మంజూరు చేయడంతో ఎండ, చలి, వర్షం నుంచి వాటికి ఈ షెడ్ల ద్వారా రక్షణ కలుగుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో అధికభాగం పాడిరైతులు రెండు నుంచి నాలుగు గేదెలలోపు వారే ఉండటంతో వారికి ఈ పథకం బాసటగా నిలుస్తోంది.

పరిశ్రమల దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

ఔత్సాహిక పారిశ్రామికవేత్తల కమిటీ సమావేశంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తల నుంచి సింగిల్ విండో ద్వారా అందిన దరఖాస్తులను నిర్దేశించిన సమయంలోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ సమావేశపు హాలులో గురువారం జిల్లా పారిశ్రామిక ప్రోత్సాహక కమిటీ సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించి మాట్లాడారు. సీఎం చంద్రబాబు ఆశయాలకు అనుగుణంగా జిల్లాను పారిశ్రామికంగా రాష్ట్రంలో ముందుండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరిశ్రమల స్థాపన ద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలు కలుగుతాయని, ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. సింగిల్ విండో పథకంలో భాగంగా జిల్లాలో 2024 డిసెంబరు నుంచి ఫిబ్రవరి వరకు పరిశ్రమల ఏర్పాటుకు 437 రాగా అందులో 421 దరఖాస్తులను ఆమోదించామన్నారు. 2024- 2025 ఆర్థిక సంవత్సరానికి పీఎంఈజీపీ లక్ష్యాల మేరకు మంజూరు, గ్రౌండింగ్‌కు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ పథకం కింద 577 దరఖాస్తులు రాగా 367 దరఖాస్తులను సంబంధింత బ్యాంకులకు పంపగా రూ.871.01 లక్షల మార్జిన్ మనీతో 263 దరఖాస్తులు బ్యాంకులు మంజూరు చేశాయని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరగా గ్రౌండింగ్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఎల్‌డీఎంను కలెక్టర్ ఆదేశించారు. పీఎం విశ్వకర్మ యోజన ప్రోగ్రాం కింద జిల్లాలో 16,193 దరఖాస్తులు రాగా స్టేజ్-1లో 14,430 దరఖాస్తులను పరిష్కరించగా, స్టేజ్-2లో 9 పెండింగ్‌లో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. పరిశ్రమల ప్రోత్సాహలకు సంబంధించి 199 రాగా 193 దరఖాస్తులను సిఫార్సు చేస్తూ రూ.7,17,093 లక్షలను అందించాలని సమావేశంలో ఆమోదించారు. సమావేశంలో పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజర్ శ్రీనివాసరావు, ఏపీఎస్‌ఎఫ్‌సీ బ్రాంచ్ మేనేజర్ కే నరసింహారెడ్డి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ మదన్‌మోహన్, ఫ్యాక్టరీస్ అధికారి రాఘవరెడ్డి, విద్యుత్ శాఖ డీఈ కే కృష్ణకాంత్, ఎల్‌డీఎం రమేష్, వివిధ శాఖల అధికారులు గొట్టిపాటి వెంకటనాయుడు, జే రవికుమార్, ఎస్. శ్రీనివాసులు, దివాకర్, శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

పొగాకు రైతు శ్రేయస్సే జీపీఐ లక్ష్యం



మాట్లాడుతున్న ఇండోనేషియా జీపీఐ ప్రతినిధి ఆన్‌సల్మా

మద్దిపాడు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): పొగాకు రైతులలో నైపుణ్యాన్ని పెంచి దిగుబడి అధికంగా సాధించేందుకు జీపీఐ తనవంతు కృషిచేస్తుందని ఇండోనేషియా జీపీఐ ప్రతినిధి ఆన్ సల్మా తెలిపారు. గురువారం గుండ్లాపల్లి పొగాకు రైతు పల్లకి సత్యనారాయణ రెడ్డి బ్యారన్ వద్ద పొగాకు రైతులకు యాజమాన్య పద్ధతులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జీపీఐ సీనియర్ మేనేజర్ పునీత్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆన్ సల్మా మాట్లాడుతూ పొగాకు నాణ్యతను బట్టి రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందన్నారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులపై మొగ్గు చూపాలని అన్నారు. సీనియర్ మేనేజర్ పునీత్ మాట్లాడుతూ కొన్ని మెలకువలు పాటిస్తే నాణ్యమైన పొగాకు పండించవచ్చని అన్నారు. రైతులు బ్యారన్‌లో కాల్పు చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి అన్నారు. మేనేజర్ శ్యామల మాట్లాడుతూ రైతులు యాజమాన్య పద్ధతులు పాటించి సేంద్రియ ఎరువులతో పాటు వేపనూనె కషాయాన్ని వాడుకోవచ్చని, ప్రతి రైతు వ్యవసాయ సాంకేతికను అలవాటు చేసుకోవాలని అన్నారు. రైతు పల్లకి సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తే మేలు జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో పల్లకి రామసుబ్బారెడ్డి, రామచంద్రారెడ్డి, చావా శ్రీనివాసరావు, వెంకట సుబ్బారావు, శ్రీను, సుజాత, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

16న ప్రకాశం బాలోత్సవ్

4వేల మంది విద్యార్థులు హాజరు

8 వేదికలపై సాంస్కృతిక కార్యక్రమాలు



మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ, పక్కన రామరాజు, సుబ్రమణ్యం

ఒంగోలు కల్చరల్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి) : ప్రకాశం బాలోత్సవ్ కార్యక్రమాన్ని ఈ నెల 16వ తేదీన ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు బాలోత్సవ్ అధ్యక్షుడు బండారు లక్ష్మీనారాయణ చెప్పారు. స్థానిక ఎల్‌బీజీ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాలోత్సవ్‌లో 38 అకడమిక్ అంశాలు, 17 సాంస్కృతిక అంశాలు ఉంటాయని, జిల్లాలోని 100 పాఠశాలల నుంచి 4 వేల మంది విద్యార్థులు హాజరవుతారని చెప్పారు. వీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో 8 స్టేజీలపై సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులలో ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు, దేశభక్తి భావాలను నింపేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అమరావతి బాలోత్సవ్ కార్యదర్శి యు.వి.రామరాజు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పిల్లల అభివృద్ధి కోరుకునే వారందరూ కలిసి ఈ బాలోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాలోత్సవ్ ప్రధాన కార్యదర్శి కే సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ 16వ తేదీ ఉదయం 9 గంటలకు ప్రారంభకానున్న ఈ ఉత్సవంలో శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్, జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ దామోదర్, జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, నగర మేయర్ సుజాత పాల్గొంటారన్నారు. ఇక 15వ తేదీ రాత్రి 6 గంటలకు నగరంలోని ప్రముఖ నృత్య కళాకారులచే సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని, బాలోత్సవం నిర్వహణకు 300 మంది ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చినట్లు వర్కింగ్ ప్రెసిడెంట్ డి.వీరాంజనేయులు తెలిపారు. విలేకరుల సమావేశంలో బాలోత్సవం ఉపాధ్యక్షులు సిహెచ్.వినోద్, కె.ఎఫ్.బాబు, ప్రవీణ్, వీరాస్వామి, విజయ్ పాల్గొన్నారు.

పెండింగ్ కేసులపై దృష్టిసారించాలి

నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ

ఫైరింగ్‌లో ప్రతిభ కనబరిచిన వారికి అభినందనలు

6 డ్రోన్ కెమెరాలు అందజేత



మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్, పక్కన ఏఎస్పీ

ఒంగోలు క్రైం, ఫిబ్రవరి13 (ఆంధ్రజ్యోతి) : నిర్దిష్టమైన ప్రణాళికతో పెండింగ్ కేసులు దర్యాప్తు చేయాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ పేర్కొన్నారు. గురువారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలోని గెలాక్సీ భవన్‌లో నెలవారీ వార్షిక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ పాత కేసులను సమీక్షించి పలు సూచనలు చేశారు. సాంకేతిక పరిజ్ఞానంతో దర్యాప్తు వేగవంతం చేయాలని కోరారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని, గుర్తు తెలియని మృతి కేసులపై ప్రధానంగా దృష్టి సారించాలని ఆదేశించారు. అదే విధంగా పల్లామల్లి ఫైరింగ్ రేంజిలో గురువారం ఉదయం జరిగిన ఫైరింగ్ ప్రాక్టీస్‌లో అత్యంత ప్రతిభ కనబరిచిన ట్రాఫిక్ సీఐ పాండురంగారావు, దర్శి ఎస్సై మురళి, పామూరు సీఐ భీమానాయక్‌లను ఎస్పీ అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు.

ఆరు డ్రోన్ కెమెరాలు అందజేత

జిల్లాలోని కనిగిరి, వెలిగండ్ల, ముండ్లమూరు, పామూరు ,గిద్దలూరు, కొండపి పోలీసుస్టేషన్లకు దాతలు డ్రోన్ కెమెరాలను ఎస్పీకి అందజేశారు. వారిని ఎస్పీ అభినందించారు.

షాపింగ్ కాంప్లెక్స్‌ల అద్దె బకాయిలు చెల్లించాలి

మాల కార్పొరేషన్ ఛైర్మన్ పెద్దపూడి విజయకుమార్



ఎమ్మార్వో కార్యాలయం వద్ద దుకాణాలను పరిశీలిస్తున్న విజయకుమార్

ఒంగోలు (నగరం), ఫిబ్రవరి13(ఆంధ్రజ్యోతి):జిల్లాలో ఉన్న ఎస్సీ షాపింగ్ కాంప్లెక్స్ దుకాణాల నెలవారీ అద్దె బకాయిలను వెంటనే చెల్లించాలని రాష్ట్ర మాల కార్పొరేషన్ ఛైర్మన్ పెద్దపూడి విజయకుమార్ కోరారు. గురువారం ఆ యన జిల్లాలోని కొండపి,ఒంగోలు నగరంలోని ఎస్సీకార్పొరేషన్ షాపింగ్ కాంప్లెక్స్ దుకాణాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన ఒంగోలు నగరంలోని ఏబీఎం జూనియర్ కళాశాల ఎదురు గల ఎస్సీ షాపింగ్ కాంప్లెక్స్ దుకాణాలను, గోపికృష్ణ థియేటర్ దగ్గర గల ఎస్సీ షాపింగ్ కాంప్లెక్స్ దుకాణాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన నిర్వాహకులతో మాట్లాడుతూ దుకాణాలు ఎవరికి కేటాయిస్తే వారే నిర్వహించుకోవాలన్నారు. నిర్వాహకులు షాపింగ్ కాంప్లెక్స్ దుకాణాలను అద్దెలకు ఇచ్చినట్లు అయితే అట్టివారిని తొలిగించి మరొకరికి దుకాణాలను కేటాయిస్తామన్నారు. బకాయిలు చెల్లించకుంటే తొలిగిస్తామన్నారు. ఛైర్మన్ వెంట ఎస్సీకార్పొరేషన్ ఈడీ అర్జున్ నాయక్ ఉన్నారు.

వేసవిలో తాగునీటి ఇబ్బంది లేకుండా చూడాలి

- మునిసిపల్ ఆర్డీ హరికృష్ణ
- నగర అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష


కమిషనరు, ఎంఈలతో మాట్లాడుతున్న మున్సిపల్ ఆర్డీ హరికృష్ణ

ఒంగోలు, కార్పొరేషన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : వేసవి కాలం సమీపిస్తున్న నేపథ్యంలో నగర ప్రజలకు తాగునీటి ఇబ్బంది లేకుండా చూడాలని మునిసిపల్ గుంటూరు రీజనల్ డైరెక్టర్ హరికృష్ణ కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. గురువారం ఒంగోలు విచ్చేసిన ఆయన నగర కమిషనరు డాక్టర్ కే. వెంకటేశ్వరరావు, మునిసిపల్ ఇంజనీర్ చెంచయ్య, రెవెన్యూ అధికారి భాస్కర్‌తో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆర్డీ నగర అభివృద్ధి కోసం చేపడుతున్న పనులను త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే పనుల్లో నాణ్యత లోపించకుండా నిధుల సౌలభ్యతను బట్టి ప్రాధాన్యం మేరకు పనులు చేపట్టాలని సూచించారు. అలాగే ఎన్ క్యాప్ నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులు, నగర సుందరీకరణలో భాగంగా బ్యూటిఫికేషన్ పనుల గురించి కమిషనర్‌ను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూసుకోవడంతోపాటు, సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుల్లో నీటి నిల్వలు ఎప్పటికప్పుడు పరిశీలన చేయాలని ఆదేశించారు. నగరంలో రోడ్డు విస్తరణ పనుల పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్న ఆర్డీ కొత్త కూరగాయల మార్కెట్‌లో అద్దె వసూళ్లలో చేపట్టిన చర్యలను అభినందించారు. అలాగే పూర్తి బకాయిలు త్వరగా వసూలు చేయాలన్నారు. ఇదిలా ఉండగా మార్చి నెలాఖరుకు నూరు శాతం ఆస్తి, నీటి పన్నులు, వ్యాపార తదితర పన్నులు వసూలు చేసి, ఒంగోలు కార్పొరేషన్ ప్రథమ స్థానంలో ఉండేలా చూడాలని సూచించారు. ఈ సందర్భంగా ఆర్డీ కార్యాలయానికి వచ్చే సమయంలో నగరంలో జరుగుతున్న పలు పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

అవీ..ఇవీ


రెవెన్యూ సెక్షన్‌లో ఫైళ్లను పరిశీలిస్తున్న మేయర్

రెవెన్యూ విభాగంలో మేయర్ ఆకస్మిక తనిఖీలు

ఒంగోలు, కార్పొరేషన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : నగరపాలక సంస్థ కార్యాలయంలో ఉద్యోగుల పనితీరును నేరుగా తెలుసుకునేందుకు మేయర్ గంగాడ సుజాత గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ మేరకు రెవెన్యూ సెక్షన్‌లోని పలు ఫైళ్ళను పరిశీలించారు. అలాగే కార్పొరేషన్‌కు ఆదాయ వనరులు సమకూర్చే విభాగమైన రెవెన్యూ సెక్షన్‌లో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. పన్నుల వసూళ్లలో పురోగతి సాధించాలని తెలిపారు. ఇదిలా ఉండగా ఫైళ్ల నిర్వహణ పక్కాగా ఉండాలని ఆదేశించారు. ప్రతి ఉద్యోగి బాధ్యతతో పనిచేయాలని, ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా వ్యవహరించాలని సూచించారు.

వక్ఫ్ సవరణ బిల్లును అడ్డుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం శీతాకాలం పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కాకముందే వక్ఫ్ సవరణ బిల్లును పార్లమెంట్‌లో చర్చకు పెట్టడాన్ని ఎస్‌డీపీఐ పార్టీరాష్ట్ర నాయకుడు అబ్దుల్ సత్తార్ ఖండించారు. రాష్ట్ర వ్యాప్త నిరసన కార్యక్రమాల్లో భాగంగా గురువారం ప్రార్థనల అనంతరం బిలాల్‌నగర్ సర్కిల్ వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం ముస్లింలపై పగపట్టిందని, కుట్రపూరితంగానే సమావేశాలు మొదలు కాకముందే పార్లమెంట్‌లో చర్చకు పెట్టడం దుర్మార్గంగా ఉందని అన్నారు. ఈ బిల్లును అన్ని రాజకీయ పార్టీలు అడ్డుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు అబ్దుల్ సత్తార్, పఠాన్ ఖాజా వలి, అయూబ్, ఖలీల్, సుల్తాన్ తదితరులు ఉన్నారు.


కరపత్రాన్నిఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

మార్చి 8న పాటల పోటీలు

ఒంగోలు కల్చరల్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి):అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 8వ తేదీన పాటల పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా రంగభూమి కళాకారుల సంఘ ప్రతినిధులు తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దనరావు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షులు బేతంశెట్టి హరిబాబు మాట్లాడుతూ మహిళ గురించి సినీ, ప్రయివేట్ పాటలతో పోటీ నిర్వహించటం జరుగుతుందని, ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.3 వేలు, రు.2 వేలు, వెయ్యి రూపాయలు, రూ.500 చొప్పున రెండు కన్సొలేషన్ బహుమతులు ఉంటాయన్నారు. స్థానిక ఎన్టీఆర్ కళాక్షేత్రంలో 8వ తేదీ సాయంత్రం 4 గంటల నుంచి పోటీలు ప్రారంభమవుతాయని, పాల్గొనాలనే ఆసక్తి ఉన్నవారు 9963201398, 9848135643 నెంబర్లలో సంప్రదించాలని అన్నారు. కరపత్ర ఆవిష్కరణ కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి అంగలకుర్తి ప్రసాద్, కోశాధికారి ధేనువకొండ వెంకట సుబ్బారావు, ఏల్చూరి అనంతలక్ష్మి, జి.వెంకట్రామయ్య, ఏ.నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కొండపి పోలీస్‌స్టేషన్‌కు డ్రోన్ అందజేత

కొండపి, ఫిబ్రవరి13 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణలో భాగంగా కొండపి పోలీస్‌స్టేషన్‌కు డ్రోన్ కెమెరాను మండలంలోని ప్రైవేటు స్కూళ్ల నిర్వాహకులు ఎస్పీ దామోదర్‌కు గురువారం రాత్రి అందజేశారు. నేరాల నియంత్రణకు, అసాంఘిక కార్యక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు, నిఘా కార్యక్రమాలకు ఎంతగానో ఉపకరిస్తుందని, పోలీస్ శాఖకు సహకరించిన స్కూళ్ల నిర్వాహకులను ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో స్కూళ్ల నిర్వాహకులు అడ్డాల శ్రీనివాసరావు, చిడిపోతు శిశిర్ చౌదరి, ఎం. హరినాథ్, ఎన్. ప్రసన్నకుమార్, ఆర్. శ్రీనివాసరావు, కే. రాజేష్ పాల్గొన్నారు.

బాధితులకు బాసటగా కూటమి ప్రభుత్వం : బీఎన్

- చీమకుర్తిలో రూ.12.79 లక్షల సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్‌ల పంపిణీ
- లబ్ధిదారుని ఇంటికెళ్లి అందజేసిన విజయకుమార్
- పులికొండలో గోకులంషెడ్ ప్రారంభం


లబ్ధిదారుడికి సీఎంఆర్ఎఫ్ చెక్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్

చీమకుర్తి,ఫిబ్రవరి13(ఆంధ్రజ్యోతి): బాధితకుటుంబాలకు కూటమి ప్రభుత్వం బాసటగా నిలుస్తుందని ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ తెలిపారు. చీమకుర్తి టౌన్,మండలంలోని ఎనిమిది గ్రామాల్లో గురువారం విజయకుమార్ సుడిగాలి పర్యటన నిర్వహించారు.సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన చెక్కులను నేరుగా లబ్ధిదారుడి ఇంటికి వెళ్లి అందజేశారు. తమ వద్దకి వచ్చి మరీ తమకు చెక్కులను అందచేసిన విజయకుమార్‌కి లబ్ధిదారులు ఆత్మీయస్వాగతం పలికి సత్కరించి ధన్యవాదాలు తెలిపారు. చీమకుర్తి మున్సిపాలిటీ,నేకునంబాదు, చంద్రపాడు, పాటిమీదపాలెం, దేవరపాలెం, నిప్పట్లపాడు, పులికొండ, నాయుడుపాలెం గ్రామాల్లో 12మంది లబ్ధిదారులకు రూ.12.79లక్షల రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రజలనుంచి వచ్చిన వినతిపత్రాలను స్వీకరించారు. పాటిమీదపాలెం ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. అక్కడి వసతులను పరిశీలించారు.విద్యార్థులతో ముచ్చటించారు.

పులికొండలో గోకులంషెడ్ ప్రారంభం

మండలంలోని పులికొండ గ్రామంలో ప్రభుత్వం మంజూరుచేసిన నిధులతో లబ్ధిదారుడు నిర్మించిన గోకులంషెడ్‌ని గురువారం ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ ప్రారంభించారు. బలహీనవర్గాలు ఆర్థికంగా అభివృద్ధి చెందటానికి కూటమి ప్రభుత్వం చేయూతనందిస్తుందన్నారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొల్లపూడి సుబ్బారావు, మండలపార్టీ అధ్యక్షుడు గొట్టిపాటి రాఘవరావు, టీడీపీ నాయకులు మన్నం ప్రసాద్,ఉన్నం సుబ్బారావు, ముదివర్తి రాధాకృష్ణమూర్తి, గాలి వెంకటసుబ్బయ్య, నల్లూరి వెంకట్రావు, బెల్లం కోటేశ్వరరావు, లక్ష్మీనారాయణ, ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

నగరంలో రోడ్డు విస్తరణ పనులు వేగవంతం


ఒంగోలులోని సీవీఎన్ రీడింగ్ వద్ద ఎక్సకవేటర్‌తో ఆక్రమణలు తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

ఒంగోలు, కార్పొరేషన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగర అభివృద్ధి కోసం నగరపాలక సంస్థ చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు వేగవంతం అయ్యాయి. ఈ మేరకు వారం రోజులుగా పనులు వేగం పుంజుకున్నాయి. ఇప్పటికే కొత్తపట్నం బస్టాండ్ సెంటర్‌లో ఆక్రమణలు తొలగించి ఆ ప్రాంతాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు పనులు జరుగుతుండగా, మరోవైపు కర్నూలు రోడ్డులోని ఆర్టీసీ డిపో సమీపంలో రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. మెయిన్ డ్రైన్‌లు ఆక్రమించి నిర్మించి ర్యాంపుల వేయగా, కమిషనరు వెంకటేశ్వరరావు ఆ ప్రాంతంలో ట్రాఫిక్ నియంత్రణ, ప్రజల సౌకర్యార్థం పనులపై ప్రత్యేక దృష్టి సారించారు. దీంతో పనులు జరుగుతుండగా తాజాగా సీవీఎన్ రీడింగ్ రూమ్ వద్ద నుంచి కొణిజేడు బస్టాండ్ సెంటర్ వరకు దక్షిణం వైపు రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. దీంతో ఆ ప్రాంతంలోని ఆక్రమణలు తొలగిస్తున్నారు. దీంతోపాటుగా నగరంలోని పలు ముఖ్య కూడళ్లలో రోడ్డు విస్తరణ పనులు చేపట్టనున్నట్లు కమిషనరు వెంకటేశ్వరరావు తెలిపారు.

దీంతో గత కొద్ది రోజులగా కార్పొరేషన్ ఆధ్వర్యంలో రోడ్డు విస్తరణ, ఆక్రమణల తొలగింపు తదితర పనులతో నగర రూపు రేఖలు మారుతున్నాయంటూ ప్రజల నుంచి ప్రశంసలు వినిపిస్తున్నాయి.

బైకు అదుపుతప్పి యువకుడి మృతి

జరుగుమల్లి, ఫిబ్రవరి13 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో తన మోటార్ సైకిల్ అదుపుతప్పి ఓ యువకుడు మరణించిన ఘటన మండలంలోని కామేపల్లి- రావులకొల్లు అడ్డరోడ్డు మూలమలుపు వద్ద గురువారం జరిగింది. వెలిగండ్ల మండలం నరసమాంబపురం గ్రామానికి చెందిన మాదిరెడ్డి వెంకటేశ్వర్లు (46) కామేపల్లిలోని పోలేరమ్మ ఆలయం వద్ద పూజలు చేయించుకుని తిరిగి వెళుతూ మూలమలుపులో ఉన్న నీటిపైపులైను వాలుతొట్టిని ఢీకొట్టి అక్కడికక్కడే మరణించాడు.

కరాటేలో హైదరాబాద్ స్కూలు విద్యార్థుల ప్రతిభ

ఒంగోలు, కార్పొరేషన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మంగమూరు రోడ్‌లోని హైదరాబాద్ పబ్లిక్ స్కూలు విద్యార్థులు కరాటేలో ప్రతిభ చాటారు. ఈనెల 9వ తేదీన విజయవాడలో జరిగిన 22వ రాష్ట్ర స్థాయి కరాటే పోటీలలో ఒంగోలుకు చెందిన హైదరాబాద్ స్కూలు విద్యార్థులు కటా విభాగంలో తమ ప్రతిభను చాటారు. పాఠశాలలో చదువుతున్న పూర్వి బ్రాంజ్ మెడల్, నిఖిల్ సాయి గోల్డ్ మెడల్ సాధించగా, అక్షిత బ్రాంజ్ మెడల్, హస్విక బ్రాంజ్ మెడల్, వరుణ్ గోల్డ్ మెడల్, జశ్విత సిల్వర్ మెడల్ సాధించారు. ఈ మేరకు గురువారం హెచ్‌పీఎస్ డైరెక్టర్ ఎన్. జగదీష్ విజేతలను, కోచ్ జి. అనిల్ కుమార్‌ను అభినందించారు.

నేటి నుంచి కరవదిలో వాలీబాల్ పోటీలు

ఒంగోలు(రూరల్),ఫిబ్రవరి13(ఆంధ్రజ్యోతి): ఒంగోలు మండలం కరవది గ్రామంలో ఈనెల 14వతేదీ నుంచి 16వతేదీ వరకు రాష్ట్రస్థాయి ఇన్విటేషన్ స్త్రీ ,పురుష వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు పీఆర్ఆర్ జడ్పీ ఉన్నతపాఠశాల పూర్వ విద్యార్థులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసిన దివంగత సూరిగుచ్చి హనుమంతరావు జ్ఞాపకార్థం ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం సా యంత్రం 4గంటల నుంచి కరవది జడ్పీఉన్నత పాఠశాలలో పోటీలు ప్రారంభమవుతాయని నిర్వాహకులు తెలిపారు.

6ఏ కేసు నమోదు

సంతనూతలపాడు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): స్థానిక మూడో నంబర్ రేషన్‌షాపునకు సంబంధించి రికార్డుల్లో ఉండాల్సిన వాటికన్నా అధికంగా 270 కిలోల బియ్యం, 144 కిలోల జొన్నల నిల్వలు ఉండటంతో గురువారం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడి చేసి డీలర్‌పై 6ఏ కింద కేసు నమోదు చేశారు. దాడిలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రాజ్యలక్ష్మి, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ గుణవంశీ, వీఆర్‌వో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ కుటుంబసభ్యులకు పూర్వపు కలెక్టర్ పరామర్శ

మండలంలోని ఎం.వేములపాడు మాజీ సర్పంచ్ రామదాసు ఇటీవల అనారోగ్యంతో మరణించారు. గురువారం జిల్లా పూర్వపు కలెక్టర్ దాసరి శ్రీనివాసులు రామదాసు కుటుంబసభ్యులను పరామర్శించారు.



అసిస్టెంట్ కమిషనరుగా కొండయ్య బాధ్యతల స్వీకరణ

ఒంగోలు, కార్పొరేషన్; ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగరపాలక సంస్థ అసిస్టెంట్ కమిషనరుగా డొక్కా కొండయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. చీరాలలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న కొండయ్యకు ఉద్యోగోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్వర్వులు జారీ చేసింది. ఈ మేరకు గురువారం ఆయన కమిషనరు డాక్టర్ కే. వెంకటేశ్వరరావును కలిసి బాధ్యతలు స్వీకరించారు.

రీసర్వేపై ఆర్డీవో సమీక్ష

కొండపి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీఏబీ కండ్రిగలో జరుగుతున్న రీసర్వే కార్యక్రమంపై ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న కొండపిలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా రైతులకు ఇస్తున్న నోటీసులు, ఇతర సర్వే రికార్డులను పరిశీలించారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలపై సమీక్షించారు. మ్యూటేషన్ ఫైళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వీఆర్వోలకు సూచనలు చేశారు.

విద్యుత్ అధికారుల ఆకస్మిక దాడులు

సంతనూతలపాడు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): విద్యుత్ అధికారులు మండలంలో 32 టీములుగా విడిపోయి గురువారం ఒంగోలు ట్రాన్స్‌కో ఏఈ ఎం.హరిబాబు ఆధ్వర్యంలో ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా 2,037 విద్యుత్‌మీటర్లను తనిఖీచేశారు. 227 విద్యుత్‌మీటర్లకు సంబంధించి అదనపులోడు, మాల్‌ప్రాక్టీసు కేసులను నమోదుచేసినట్లు అధికారులు తెలిపారు. ఎటువంటి అనుమతిలేకుండా విద్యుత్ వాడకంపై 3కేసులు నమోదుచేసినట్లు తెలిపారు. రూ.9,62,600 లను అపరాధరుసుంగా విధించారు.

మినీ గోకులం షెడ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

మండలంలోని కొనగానివారిపాలెం గోశాలలో మినీగోకులం షెడ్‌ను గురువారం ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ ప్రారంభించారు. ఈసందర్భంగా నిర్వహించిన పూజలో ఎమ్మెల్యే పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. టీడీపీ జిల్లా నాయకులు మన్నం ప్రసాద్, చీమకుర్తి మండ ల అధ్యక్షులు గొట్టిపాటి రాఘవరావు, రావిపాటి రాంబాబు, కొనగానివారిపాలెం నాయకులు పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వామపక్ష నేతలు

19న కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా నిరసన

- ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపు

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 19వతేదీన కలెక్టరేట్ ఎదుట జరిగే నిరసనలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వామపక్షాల నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక మల్లయ్య లింగం భవన్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీపీఐ జిల్లాకార్యదర్శి ఎంఎల్ నారాయణ, సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కే మాబు, సీపీఐ ఎంఎల్ నాయకురాలు లలితకుమారి, న్యూడెమోక్రసీ నాయకుడు కె. హనుమంతరావులు మాట్లాడారు. బీజేపీ పాలనలో ప్రజలలో కొనుగోలు శక్తి తగ్గిపోయిందన్నారు. ఆర్థిక వ్యవస్థలో తగ్గిన డిమాండ్ సమస్యను పరిష్కరించడానికి బదులు అందుకు విరుద్ధంగా మోదీ ప్రభుత్వం సంపన్నులకు రాయితీలు ఇస్తూ ఖర్చుల్లో కోత పెట్టడం దుర్మార్గంగా ఉందన్నారు. ఆహార సబ్సిడీలు, వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, గ్రామీణాభివృద్ధి, సామాజిక సంక్షేమంపై పెట్టిన ఖర్చు గత ఏడాది కంటే బాగా తగ్గిపోయిందన్నారు. అవసరం ఉన్నా ఉపాధి హామీ పథకానికి అదనంగా నిధులు కేటాయింపులు లేవన్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ వ్యతిరేక విధానాలను నిరసగా జరిగే ధర్నాలో అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వామపక్షాల నాయకులు ఆర్.వెంకట్రావు, సయ్యద్ యాసిన్, కె వీరారెడ్డి, చీకటి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న డీపీఎం డేవిడ్

సమీకృత వ్యవసాయ క్లస్టర్‌తో మహిళా రైతుల జీవనోపాధుల పెంపు

నాగులుప్పలపాడు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): సమీకృత వ్యవసాయ క్లస్టర్‌తో మహిళా రైతుల జీవనోపాధులు పెంపొందించవచ్చని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ పి.డేవిడ్ సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ఏపీఎం బత్తుల నరేంద్రకుమార్ అధ్యక్షతన వివిధ శాఖల అధికారులకు వ్యవసాయ క్లస్టర్‌పై అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ డేవిడ్ మాట్లాడుతూ సమీకృత వ్యవసాయ క్లస్టర్‌ను జిల్లాలోని మద్దిపాడు, నాగులుప్పలపాడు మండలాలలో అమలు చేస్తున్నామన్నారు. ఇందుకోసం నాగులుప్పలపాడు మండలంలో అమ్మనబ్రోలు, నాగులుప్పలపాడు గ్రామాలను ఎంపిక చేశామని, ఆయా గ్రామాలలోని 300 మహిళా రైతు కుటుంబాలకు రైతు ఉత్పత్తిదారుల సంఘాల ద్వారా ఒక్కొక్కరికి 5 రకాల యూనిట్లను మంజూరు చేయించి వారి జీవనోపాధులను పెంపొందిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్థకశాఖ ఏడీఏ నాగభూషణం, మండల వ్యవసాయాధికారి వెంకట్రావు, ఏపీవో రవిబాబు, ఉద్యానశాఖ ఏవో ప్రత్యూష, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

వాస్తవ నివేదికలు ఇవ్వాలి

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని 98 ఎయిడెడ్ పాఠశాలలకు త్రీమెన్ కమిటీలు నియమించినందున ఆ కమిటీలు ప్రభుత్వానికి వాస్తవ నివేదికలను ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె. వెంకట్రావు, సీహెచ్ ప్రభాకర్‌రెడ్డిలు ఒక సంయుక్త ప్రకటనలో కోరారు. ఎయిడెడ్ పాఠశాలల్లో యూడైస్ ప్రకారం విద్యార్థుల రోలుకు వాస్తవ విద్యార్థులకు తేడా ఉన్నందున త్రీమెన్ రిపోర్టును పంపాలని విద్యాశాఖ కమిషనర్ ఆదేశాలు జారీచేసినందున తదనుగుణంగా జిల్లాలో చర్యలు తీసుకోవాలని వారు కోరారు. అదే విధంగా ఎయిడెడ్ పాఠశాలల్లో మిగులుగా ఉన్న ఉపాధ్యాయులను ప్రభుత్వ పాఠశాలల్లోకి సీనియారిటీ లిస్టు తయారు చేసి కౌన్సెలింగ్ నిర్వహించాలని వారు కోరారు.

ఘనంగా సరోజిని నాయుడు జయంతి

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : స్థానిక దామచర్ల సక్కుబాయమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం ఆంగ్లశాఖ, ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ ఆధ్వర్యంలో ఆంగ్ల రచయిత్రి, స్వాతంత్ర్య సామ్రాజ్య నేత, సామాజిక కార్యకర్త సరోజిని నాయుడు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన సభకు ప్రిన్సిపాల్ డాక్టర్ డి.కళ్యాణి అధ్యక్షత వహించి మాట్లాడారు. ఆంగ్ల శాఖాధిపతి సుధారాణి, ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కన్వీనర్ డాక్టర్ పి. ఇందిరా, పి. కుసుమకుమారి, డాక్టర్ ఎం. శ్రీనివాసరెడ్డి, పి. యామిని అమ్మాజీ తదితరులు ఉన్నారు.

ట్రాక్టర్‌లకు రేడియం స్టిక్కర్లు


ట్రాక్టర్‌కు రేడియం స్టిక్కర్‌లు అంటిస్తున్న పోలీసు

కొండపి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ప్రమాదాలు జరగకుండా ట్రాక్టర్, ట్రక్కులకు రేడియం స్టిక్కర్‌లను కొండపి పోలీసులు గురువారం అంటించారు. ఈ సందర్భంగా సీఐ సోమశేఖర్ మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని అన్ని ట్రాక్టర్‌లకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రేడియం స్టిక్కర్‌లు అంటిస్తున్నామన్నారు. రాత్రిళ్లు చీకట్లో కూడా ఈ స్టిక్కర్లు మెరుస్తూ ఎదురుగా వచ్చే వాహనదారులకు కనిపిస్తాయన్నారు.

202 ఇంకుడుగుంతలు మంజూరు

కొండపి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలోని నాలుగు గ్రామ పంచాయతీలకు 202 ఇంకుడు గుంతలు మంజూరయ్యాయని ఎంపీడీవో రామాంజనేయులు తెలిపారు. మండలంలోని వెన్నూరు, చినవెంకన్నపాలెం, మిట్టపాలెం, పెదకండ్లగుంట గ్రామ పంచాయతీలకు మంజూరయ్యాయన్నారు. 15వ తేదీ పనులు ప్రారంభిస్తామన్నారు.

క్రైం సమాచారం

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

మద్దిపాడు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి):మండలంలోని ఏడుగుండ్లపాడు హర్షిణి కళాశాల సమీపంలో మోటార్ సైకిల్ అదుపుతప్పిన ఘటనలో మహిళకు గాయాలయ్యాయి. బాపట్ల జిల్లా పెదకూరపాడు సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న హేమలత తన ద్విచక్ర వాహనంపై ఒంగోలు నుంచి పెదకూరపాడు వెళ్తుండగా ఏడుగుండ్లపాడు సమీపంలోకి వచ్చేసరికి ఎదురుగా డీసీఎం వాహనం వేగంగా రావడంతో సడన్‌గా బ్రేక్ వేయడంతో అదుపుతప్పి కిందపడింది. స్థానికులు చికిత్స నిమిత్తం హేమలతను ఒంగోలు సంఘమిత్ర ఆస్పత్రికి తరలించారు.

క్రైం సమాచారం

వరిగడ్డి లారీ దగ్ధం

● వరిగడ్డికి విద్యుత్ తీగలు తాకడంతో ఘటన
● మంటలను ఆర్పిన ఫైర్ సిబ్బంది



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

ఎర్రగొండపాలెం రూరల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ తీగలను తాకి నిప్పురవ్వలు రాలడంతో గడ్డిలారి దగ్ధమైన ఘటన మండలంలోని యల్లారెడ్డిపల్లి గ్రామ సమీపంలో గురువారం చోటుచేసుకొంది. స్థానికులు, ఫైర్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం, కృష్ణా జిల్లా నుండి వీరభద్రాపురం రైతులు మధ్యవర్తి ద్వారా వరిగడ్డి లోడును తెంపించుకున్నారు. గ్రామంలో ఒక చోట కొంత దించి మరొక చోటికి తరలిస్తున్న సమయంలో వీరభద్రాపురం యల్లారెడ్డిపల్లి మార్గమధ్యలో కిందికి వేళాడుతున్న విద్యుత్ తీగలు తాకి మంటలు అంటుకున్నాయి. వెంటనే అప్రమత్తమైన డ్రైవర్ లారీని పక్కకు పెట్టి దిగిపోయాడు. స్థానికులు ఫైర్ కార్యాలయానికి సమాచారం అందించారు. వారి సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లి మంటలను అదుపు చేశారు.

రోడ్డు ప్రమాద బాధితుడికి పరామర్శ



రవికుమార్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి

కంభం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై వెళుతూ రోడ్డు ప్రమాదానికి గురై గాయపడిన టీడీపీ ఎస్సీ సెల్ నాయకుడు సిరివెళ్ల రవికుమార్‌ను ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పరామర్శించారు. గురువారం కంభం పట్టణంలో కంభం చెరువు నీటిసంఘం అధ్యక్షులు పార్శ ఆదినారాయణ ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమానికి ద్విచక్ర వాహనంపై వస్తున్న రవికుమార్ వాహనం అదుపుతప్పి కిందపడ్డాడు. దీంతో ఆయన కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన రవికుమార్‌ను కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స చేస్తున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి వైద్యశాలకు వచ్చి పరామర్శించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

మార్చి 8న పాటల పోటీలు



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు కల్చరల్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి):అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 8వ తేదీన పాటల పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా రంగభూమి కళాకారుల సంఘ ప్రతినిధులు తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దనరావు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షులు బేతంశెట్టి హరిబాబు మాట్లాడుతూ మహిళ గురించి సినీ, ప్రయివేట్ పాటలతో పోటీ నిర్వహించటం జరుగుతుందని, ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.3 వేలు, రు.2 వేలు, వెయ్యి రూపాయలు, రూ.500 చొప్పున రెండు కన్సొలేషన్ బహుమతులు ఉంటాయన్నారు. స్థానిక ఎన్టీఆర్ కళాక్షేత్రంలో 8వ తేదీ సాయంత్రం 4 గంటల నుంచి పోటీలు ప్రారంభమవుతాయని, పాల్గొనాలనే ఆసక్తి ఉన్నవారు 9963201398, 9848135643 నెంబర్లలో సంప్రదించాలని అన్నారు. కరపత్ర ఆవిష్కరణ కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి అంగలకుర్తి ప్రసాద్, కోశాధికారి ధేనువకొండ వెంకట సుబ్బారావు, ఏల్చూరి అనంతలక్ష్మి, జి.వెంకట్రామయ్య, ఏ.నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వాస్తవ నివేదికలు ఇవ్వాలి

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని 98 ఎయిడెడ్ పాఠశాలలకు త్రీమెన్ కమిటీలు నియమించినందున ఆ కమిటీలు ప్రభుత్వానికి వాస్తవ నివేదికలను ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె. వెంకట్రావు, సీహెచ్ ప్రభాకర్‌రెడ్డిలు ఒక సంయుక్త ప్రకటనలో కోరారు. ఎయిడెడ్ పాఠశాలల్లో యూడైస్ ప్రకారం విద్యార్థుల రోలుకు వాస్తవ విద్యార్థులకు తేడా ఉన్నందున త్రీమెన్ రిపోర్టును పంపాలని విద్యాశాఖ కమిషనర్ ఆదేశాలు జారీచేసినందున తదనుగుణంగా జిల్లాలో చర్యలు తీసుకోవాలని వారు కోరారు. అదే విధంగా ఎయిడెడ్ పాఠశాలల్లో మిగులుగా ఉన్న ఉపాధ్యాయులను ప్రభుత్వ పాఠశాలల్లోకి సీనియారిటీ లిస్టు తయారు చేసి కౌన్సెలింగ్ నిర్వహించాలని వారు కోరారు.

తీరనున్న తాగునీటి సమస్య

● ఎన్టీఆర్ కాలనీ, ఇందిరమ్మ కాలనీలకు పైపులైన్ ఏర్పాటు
● పంచాయతీ నిధులు రూ.3 లక్షలతో పనులు





కాలువ తవ్వుతున్న ఎక్స్‌కవేటర్, కాలువ వెంబడి ఏర్పాటు చేసిన పైపులు

ఎర్రగొండపాలెం, ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి) 13: ఎర్రగొండపాలెం మేజరు పంచాయతీలో శివారు కాలనీలైన ఎన్టీఆర్‌కాలనీ, ఇందిరమ్మ కాలనీలలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు జోక్యంతో గురువారం పంచాయతీ కార్యదర్శి రాజశేఖరరెడ్డి పైపులైన్ నిర్మాణపు పనులు ప్రారంభించారు. ఈ పనులకు గ్రామ పంచాయతీ నిధులు నుంచి రూ.3 లక్షలు నిధులు ఖర్చు చేస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి రాజశేఖరరెడ్డి తెలిపారు. ఈ పైపులైన్ నిర్మాణంతో ఎన్టీఆర్ కాలనీ, ఇందిరమ్మకాలనీ, బలపాలఫ్యాక్టరీ కాలనీలకు సాగర్‌జలాలతో తాగునీటి సమస్య తీరుతుందని తెలిపారు. తాగునీటి సమస్య తీర్చాలని ఇటీవల రెండు కాలనీల మహిళలు ఖాళీ బిందెలతో ఎర్రగొండపాలెం పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన తెలిపిన విషయం విదితమే.

గంజాయి గుప్పు.. గుప్పు



● గిద్దలూరులో విచ్చలవిడిగా విక్రయాలు

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): గంజాయి అక్రమ రవాణా విక్రయదారులపై ఉక్కుపాదం మోపుతాం, ఎంతటి వారినైనా కటకటాల్లోకి పంపిస్తాం, ఇది నిత్యం కళాశాలలో నిర్వహించే అవగాహన సదస్సులో పోలీసు అధికారులు చెప్పే మాట. అంతే కాకుండా రాష్ట్ర ప్రభుత్వంలో ఉండే ముఖ్య ప్రజాప్రతినిధులు కూడా చెబుతున్న మాట. అయితే ప్రజాప్రతినిధుల, పోలీసు అధికారుల మాటలకు వాస్తవానికి పూర్తి విరుద్ధంగా ఉంటోంది. పట్టపగలే గంజాయి మత్తులో కొందరు విద్యార్థులు ఉంటున్నారు. గంజాయి వినియోగం గిద్దలూరు ప్రాంతంలో విస్తృతంగా కనిపిస్తోంది. నాటి వైసీపీ ప్రభుత్వం అరాచక కార్యకలాపాలపై పట్టించుకోకపోవడం, చూసీచూడనట్లు వ్యవహరించడం వలన నేడు ఈ దుస్థితి ఏర్పడింది. విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని పోలీసుల కళ్లు గప్పి విక్రయాలు జరుపుతున్నారు. రైల్వేస్టేషన్, బస్టాండ్, ప్రధాన కూడళ్లు, పలు కళాశాలల వద్ద విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఇటీవల అర్బన్ సీఐ కె.సురేష్ ఒక మహిళతో పాటు మరికొందరిని అదుపులోకి తీసుకుని గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వారందరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించారు. పోలీసులు చర్యలు అడపాదడపా చేపడుతున్నప్పటికీ చాపకింద నీరులా గుట్టుచప్పుడు కాకుండా గంజాయి మత్తు సాగుతోంది.

పట్టించుకునే వారేరీ ?

గంజాయి విక్రయదారులపై పోలీసుల పూర్తిస్థాయి నిఘా కొరవడిందనే విమర్శలు ఉన్నాయి. అందువల్లే ఈ ప్రాంతంలో గంజాయి సరఫరా జరుగుతోందని విమర్శలు వినిపిస్తున్నాయి. దీనికితోడు విద్యార్థులు కూడా జత అవుతున్నారు. గంజాయి రోజూ విజయవాడ, నెల్లూరు, గుంటూరు నుండి రైళ్లు, బస్సుల ద్వారా దిగుమతి అవుతున్నట్లు సమాచారం. ఇలా వచ్చాక ముందుగానే ఎంచుకున్న ప్రాంతాలకు వెళ్లి విక్రయిస్తున్నారు. అలాగే వీరివద్ద నుంచి ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన గంజాయి స్మగ్లర్లతో స్థానిక గంజాయి విక్రయదారులు కూడా కొనుగోలు చేస్తున్నట్లు సమాచారం.

ప్రతి నీటి బొట్టును ఒడిసి పట్టాలి

● సిబ్బందితో డ్వామా జోసఫ్ కుమార్
● ఇంకుడు గుంతలు తీయించాలని నిర్దేశం



మాట్లాడుతున్న పీడీ జోసఫ్‌కుమార్

పుల్లలచెరువు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): భూమి మీద పడిన ప్రతి నీటి బొట్టును ఒడిసి పట్టాలని డ్వామా పీడీ గంగవరపు జోసఫ్ కుమార్ పిలుపునిచ్చారు. గురువారం రాత్రి పుల్లలచెరువులో ఉపాధి హామీ పథకం అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నీటి బొట్టును ఒడిసి పడితే భావి తరాలను జీవావరణాన్ని అందించిన వారమౌతామన్నారు. అదేవృథా చేస్తే కన్నీరే మిగులుతుందన్నారు. ఈ నెల 15న అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా 1500 ఇళ్ల వద్ద ఇంకుడు గుంతలు తీయించాలన్నారు. భూగర్భ జాలాలు పెంచేందుకు ప్రతి పంచాయతీలోని 25 మంది పాం పండ్స్‌ను రైతులు తమ భూ ముల్లో తవ్వుకోవాలన్నారు. ఎర్రగొండపాలెం నియోజవవర్గంలో భూగర్భ జలా లు అడుగంటి పోయాయని ఇంకుడు గుంతలు, ఫామ్ పాండ్స్ ద్వారా భూగర్భ జలాలు పెంపునకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, స్వయం సహాయక సంఘాలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీడీ భవాని, ఈవోఆర్డీ శ్రీను, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసం కార్మికుల నిరసన

మూడోరోజు కొనసాగుతున్న మున్సిపల్ కార్మికుల దీక్షలు



పొదిలిలో నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం గత ప్రభుత్వం ఇచ్చిన ఒప్పందాలను ప్రభుత్వం అమలు చేయాలని మున్సిపల్ కార్మికులు డిమాండ్ చేశారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కార్మికులు చేస్తున్న దీక్షలు గురువారం మూడో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా సీఐటీయూ పట్టణ కార్యదర్శి రూబెన్ మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికులకు జీవో 36 ప్రకారం వేతనాలు అమలు చేయాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. హెల్త్ అలవెన్స్ ఏర్పాటు చేయాలని, అదనపు పనులు కేటాయించినప్పుడు టీఏ, డీఏ చెల్లించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు సుబ్బరాయుడు, హరి, సలాంఖాన్, ఇమాంసా, మరియదాసు, గురునాథం తదితరులు పాల్గొన్నారు.

పొదిలి : నగర పంచాయితీ కార్మికులకు తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ మండల కార్యదర్శి బి.కోటేశ్వరావు కోరారు. హెల్త్ అలవెన్స్‌లు మంజూరు చేయాలని పట్టణంలో కార్మికులు గురువారం సమ్మె బాటపట్టారు. ఈ సందర్భంగా కోటేశ్వరావు మాట్లాడుతూ నగరపంచాయితీ కార్మికులకు హెల్త్ అలవెన్స్ బకాయిలు సంవత్సర కాలంగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కార్మికులు సమ్మె జరిగిన సంవత్సరం అయినప్పటికీ, నేటికి పూర్తిగా అమలు చేయలేదన్నారు. పండుగ అలవెన్స్ రూ.1000 చెల్లించలేని స్థితిలో ప్రభుత్వం ఉండడం సిగ్గుచేటన్నారు. ఆప్కాస్‌ను వెంటనే రద్దుచేసి ఏజెన్సీలకు ఇవ్వడాన్ని విరమించుకోవాలన్నారు. కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేసిన తర్వాతే ఆప్కాస్‌ను రద్దు చేయాలని చెప్పారు. ప్రమాదాలలో చనిపోయిన కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ఇచ్చి కుటుంబాలవారిని పనిలోకి తీసుకోవాలన్నారు. ప్రభుత్వం కార్మికుల సమస్యలను పరిష్కారానికి ముందుకు రావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు సుబ్బయ్య, నరసింహారవు, నాగేశ్వరావు, శ్రీకాంత్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

17న జెండా మహోత్సవం

గిద్దలూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): రాచర్ల మండలం అనుమలపల్లి గ్రామంలో ఈ నెల 17న సోమవారం జీవనమూర్తి స్వామి వారి జెండా మహోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కమిటీ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. 17న సోమవారం ఉదయం 7గంటలకు గంధం సరుకుల బండి ఉత్సవం, గంధం పూజ, ఉదయం 10గంటలకు పావుకోళ్ల ఉత్సవం, రాత్రి 8 గంటలకు గ్రామోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. మధ్యాహ్నం, రాత్రి భక్తులందరికీ అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

చెక్కభజన, కోలాట పోటీలు

జీవనమూర్తిస్వామి జెండా మహోత్సవం సందర్భంగా ఈ నెల 17న కోలాట పోటీలు నిర్వహించనున్నారు. ప్రథమ బహుమతి రూ.50వేలు, ద్వితీయ విజేతకు రూ.40వేలు, తృతీయ బహుమతి రూ.30వేలు బహుమతి ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు అలాగే చెక్కభజన పోటీలు సైతం నిర్వహించి తొలి మూడుస్థానాల్లో నిలిచిన విజేతలకు వరసగా, రూ.50 వేలు, రూ.40వేలు, రూ.30 వేలు బహుమతిగా ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే గుండు పందెం నిర్వహించి విజేతకు రూ.10వేలు నగదు బహుమతి ఇస్తామన్నారు. ఒక్కో పోటీకి రూ.500 రూపాయల ఎంట్రీ ఫీజు చెల్లించాలని నిర్వాహకులు పేర్కొన్నారు.

16 నుంచి ప్రతిష్ఠ మహోత్సవం

గిద్దలూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆదర్శ బీఈడీ కళాశాల ప్రాంగణంలో ఈ నెల 16 నుంచి రెండు రోజులపాటు అభయాంజనేయస్వామి నూతన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆదర్శ విద్యాసంస్థల అధినేత బుడత తిమ్మయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 16న ప్రత్యేక పూజలు, 17న హోమాలు, అభయాంజనేయస్వామి నూతన విగ్రహ ప్రతిష్ఠ, శిఖర కళశ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

విద్యార్థులకు నేచర్ క్యాంప్

ఎర్రగొండపాలెం రూరల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): నేచర్ క్యాంప్ టూర్‌లో భాగంగా ఎర్రగొండపాలెం, గంజివారిపల్లి అటవీ అధికారుల ఆధ్వర్యంలో ప్రభుత్వ ప్రైవేటు పాఠశాల విద్యార్థులు గురువారం తెలంగాణలోని అమ్రాబాద్‌కు బయలుదేరారు. పెద్దపులుల అభయారణ్యాన్ని సందర్శించేందుకు బయలుదేరినట్లు ఫారెస్టు రేంజర్ సుబ్బారావు తెలిపారు. మార్గమధ్యలోని దోర్నాల, శ్రీశైలం డ్యామ్ తదితర ప్రాంతాలను సందర్శించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

నేడు మెగా జాబ్‌మేళా

● నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలి

ఎర్రగొండపాలెం, ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి) 13 : నియోజకవర్గకేంద్రం ఎర్రగొండపాలెంలో నేడు మెగా జాబ్‌మేళ నిర్వహిస్తున్నట్లు టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు తెలిపారు. స్థానిక అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ ఆడిటోరియంలో ఉదయం 9 గంటలకు ఈ జాబ్‌మేళ ప్రారంభం అవుతుందన్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే, మెగాజాబ్ మేళాలో నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లోని నిరుద్యోగ యవతి, యువకులు హాజరై పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. మెగాజాబ్ మేళాను 20 కంపెనీలు పాల్గొంటాయన్నారు.

వేదిక్ మాథ్స్‌లో ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాయిబాలాజీ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న సాయిచరణ్ రాష్ట్ర స్థాయి వేదిక్ మ్యాథ్స్ పోటీలలో మూడో బహుమతి సాధించాడు. ఈ సందర్భంగా గురువారం పాఠశాలలో చరణ్‌ను ప్రిన్సిపాల్ మస్తాన్‌వలి, ఉపాధ్యాయులు అభినందించి సన్మానించారు.

మురుగు కాలువ సమస్యలు పరిష్కరిస్తాం



మురుగు కాలువను పరిశీలిస్తున్న కమిషనర్

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): భగత్‌సింగ్ కాలనీలోని మురుగు కాలువ సమస్యను పరిష్కరిస్తామని కమిషనర్ డీవీఎస్ నారాయణ అన్నారు. భగత్‌సింగ్ కాలనీలో కొద్దిరోజులుగా నెలకొన్న మురుగు సమస్యను గురువారం ఆయన కౌన్సిలర్ హర్షితాబాబీతో కలిసి పరిశీలించారు. త్వరలోనే సమస్య తీరుస్తామని స్థానికులకు హామీ ఇచ్చారు.

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన ఎంపీడీవో



మధ్యాహ్న భోజనాన్ని రుచిచూస్తున్న ఎంపీడీవో ఈశ్వరమ్మ

కొనకనమిట్ల, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగంపల్లి గ్రామంలో మండలపరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని గురువారం ఎంపీడీవో ఈశ్వరమ్మ పరిశీలించారు. పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. రాగిజావ, చిక్కీలు రోజు అందుతున్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థి చదువు ప్రాముఖ్యత తెలుసుకొని చక్కగా చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి కృష్ణ, ఎంపీటీసీ వెంకటేశ్వర్లు, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

19న కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా నిరసన

● ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న వామపక్ష నేతలు

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 19వతేదీన కలెక్టరేట్ ఎదుట జరిగే నిరసనలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతంచేయాలని వామపక్షాల నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక మల్లయ్య లింగం భవన్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీపీఐ జిల్లాకార్యదర్శి ఎంఎల్ నారాయణ, సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్కే మాబు, సీపీఐ ఎంఎల్ నాయకురాలు లలితకుమారి, న్యూడెమోక్రసీ నాయకుడు కె. హనుమంతరావులు మాట్లాడారు. బీజేపీ పాలనలో ప్రజలలో కొనుగోలు శక్తి తగ్గిపోయిందన్నారు. ఆర్థిక వ్యవస్థలో తగ్గిన డిమాండ్ సమస్యను పరిష్కరించడానికి బదులు అందుకు విరుద్ధంగా మోదీ ప్రభుత్వం సంపన్నులకు రాయితీలు ఇస్తూ ఖర్చుల్లో కోత పెట్టడం దుర్మార్గంగా ఉందన్నారు. ఆహార సబ్సిడీలు, వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, గ్రామీణాభివృద్ధి, సామాజిక సంక్షేమంపై పెట్టిన ఖర్చు గత ఏడాది కంటే బాగా తగ్గిపోయిందన్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ వ్యతిరేక విధానాలను నిరసగా జరిగే ధర్నాలో అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వామపక్షాల నాయకులు ఆర్.వెంకట్రావు, సయ్యద్ యాసిన్, కె వీరారెడ్డి, చీకటి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

వేసవికి ముందే పెరిగిన ఎండలు

● పుచ్చకాయలు, కొబ్బరిబోండాలకు డిమాండ్
● వేడి తీవ్రతకు ఎంతో ఉపయోగం



పుచ్చకాయలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

ఎర్రగొండపాలెం రూరల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలం రాకముందే ప్రజలు పుచ్చకాయల (వాటర్‌మిలాన్) వెంట పడుతున్నారు. ఫిబ్రవరి నెల రెండోవారంలోనే మార్చి నెలలో ఉన్నట్లు పగటిపూట వేడి గాలులు, తీవ్రతఉందని ప్రజలు పేర్కొంటు న్నారు. దీంతో ఎర్రగొండపాలెం పట్టణంలో ప్రధాన రహదారి వెంబడి పుచ్చకాయలు, కొబ్బరిబోండాలకు డిమాండ్ పెరిగింది.

నీటి శాతం పెంచేందుకు ఎంతోమేలు

మానవ శరీరంలో నీటి శాతం పెంచేం దుకు ఈ పుచ్చకాయలు ఎంతో ఉపయోగ పడతాయి. వేసవికాలంలో మానవ శరీరంలో నీటిశాతం తగ్గి దప్పిక పెరుగుతూ ఉంటుంది. అలా శరీరంలో నీటి శాతం తగ్గ కుండా వడదెబ్బ బారీన పడకుండా పుచ్చ కాయలు ఎక్కువగా ప్రజలు తీసుకుంటు ఉంటారు. వైద్యులు కూడా నీటి శాతం ఎక్కువగా ఉన్న కాయలను తీసుకోవాలని సూచిస్తున్నారు. వాటితో పాటు కొబ్బరి బొండాలకు కూడ డిమాండ్ ఉంది, మార్కెట్‌లో ఒక్కో కాయ రూ.50, బాటిల్ అయితే రూ.100 పలుకుతోంది. రానున్నది వేసవి కాలం కావడంతో మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు పేర్కొంటున్నారు.





మార్కెట్‌లో ఉన్న పుచ్చకాయలు, కొబ్బరిబోండాలు

మార్కెట్‌లో పుచ్చకాయ కిలో రూ.40

ప్రస్తుతం మార్కెట్‌లో కిలో రూ. 40లు చొప్పున వ్యాపరస్థులు అమ్మకాలు చేస్తున్నారు. ఈ ప్రాంతంలో కాయలు అందుబాటులో లేకపోవడం ఉన్న ప్రాంతాలలో వైరస్ సోకి కాయ దెబ్బతిందని వ్యాపారులు చెబుతున్నారు.. దీంతో నాణ్యమైన కాయల కోసం తమిళనాడు ప్రాంతం నుండి కొనుగోలు చేస్తున్నామని ఓ వ్యాపారి తెలిపారు.

● టన్ను రూ.14 నుండి రూ.18వేలు

నాణ్యమైన పుచ్చకాయలు టన్ను రూ.14 వేల నుంచి రూ.18 వేల వరకు పలుకుతోంది. డిమాండ్ దృష్ట్యా దూర ప్రాంతం అయిన కోనుగోలు చేస్తున్నారు. ఒక్కో కాయ మొదటి కటింగ్ అయితే 5 నుండి 8 కిలోలు ఉంటుందని, రెండోవ కటింగ్ అయితే 3 కిలోల నుంచి 5 కిలోలు ఉంటుందని తెలిపారు. ఏది ఏమైనా వేసవిలో కొబ్బరిబోండాలకు, పుచ్చకాయలకు డిమాండ్ అయితే బాగానే ఉంది.

ముఖాముఖి

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు

జె.ఇమ్మానియేల్‌రాజు, ఇన్‌చార్జ్ తహసీల్దార్, తాళ్లూరు



ప్రశ్న: రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను ఎంతవరకు పరిష్కరించారు?

జవాబు: మండలంలో రెవెన్యూ సదస్సుల ద్వారా 263 మంది దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 192 పరిష్కరించాం. వివాదాల్లోనివి పెండింగ్‌లో ఉన్నాయి.

ప్ర: రీసర్వేలో వచ్చిన అర్జీలను పరిష్కరించారా?

జ: రీసర్వే జరిగిన ఆరు గ్రామాల నుంచి 303 అర్జీలు వచ్చాయి. వీటిల్లో 168ని పరిష్కరించాం. విస్తరణ కొలతల్లో తేడాలున్న సమస్యల పరిష్కారం కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

ప్ర: మీకోసంలో వచ్చిన అర్జీలపై తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

జ: మీకోసంలో వచ్చిన అర్జీలలోని సమస్యలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నాం. వాటిని ఆయా గ్రామాలకు చెందిన వీఆర్వోలకు పంపిస్తున్నాం. వారు ఇచ్చిన నివేదికలను పరిశీలించి పరిష్కరిస్తున్నాం.

ప్ర: వీఆర్వోల కొరత ఉందా?

జ: పలు గ్రామాలకు రెగ్యులర్ వీఆర్వోలు లేరు. దీంతో రెవెన్యూ సంబంధిత సమస్యలను పరిష్కరించేందుకు ఇన్‌చార్జ్‌లను నియమించాం. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాం.

రీసర్వేలో లోపాలు లేకుండా చూడాలి

ముండ్లమూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో జరుగుతున్న భూముల రీసర్వేలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని తహసీల్దార్ ఎల్.లక్ష్మీనారాయణ ఆదేశించారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను తక్షణమే పరిష్కరించాలన్నారు. ఇటీవల భూముల రీసర్వే చేపట్టినట్టు చెప్పారు. అందులో తప్పులు దొర్లకుండా చూడాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా సర్వే పూర్తి చేయాలన్నారు. మీకోసం వచ్చిన అర్జీలను కూడా నిర్లక్ష్యం చేయకుండా పరిష్కరించాల్సిన బాధ్యత ఉందన్నారు. పెండింగ్ రికార్డులను పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ ఆర్.శ్రీకాంత్, ఆర్ఐ పీఎస్ఆర్ మూర్తి, సీనియర్ అసిస్టెంట్ శేషగిరిరావు, తదితరులు పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘాల బలోపేతానికి కృషి చేయాలి

ముండ్లమూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాలు బలోపేతానికి సిబ్బంది కృషి చేయాలని వెలుగు డీపీఎం సీహెచ్ నరసింహారావు అన్నారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో ఆగిపోయిన పొదుపు సంఘాలను పునరుద్ధరించాలన్నారు. సమావేశంలో ఏపీఎం హనుమంతరావు, సీసీలు రత్నకుమారి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పేదలకు సేవలు అభినందనీయం

దర్శి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మానవతా సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక మల్లారెడ్డి ఆస్పత్రిలో గురువారం దుప్పట్లు, మందులు, పౌష్టికాహారాన్ని కుష్టు రోగులకు పంపిణీ చేశారు. తహసీల్దార్ ఎం.శావణ్‌కుమార్, నగర పంచాయతీ కమిషనర్ వై.మహేశ్వరరావులు వీటిని రోగులకు అందజేశారు. ఈసందర్భంగా వారు పేదలకు మాట్లాడుతూ మానవతా సేవా సంస్థ అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు కార్యక్రమంలో ఆస్పత్రి అధినేత డాక్టర్ మల్లారెడ్డి, మానవతా సంస్థ ప్రతినిధులు డి.వరప్రసాద్, ఎస్వీ సుబ్బారెడ్డి, శ్రీనివాసరెడ్డి, డి.వెంకటరెడ్డి, ఏ.గణేష్ తదితరులు పాల్గొన్నారు.

లక్షలు ఖర్చు చేశారు.. లక్షణంగా వదిలేశారు!

» నిరుపయోగంగా ప్రభుత్వ భవనాలు

» పట్టించుకోని అధికారులు



నిరుపయోగంగా జడ్పీ అతిథి గృహం



నిరుపయోగంగా పౌరసరఫరాల గోడౌన్

దొనకొండ, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): లక్షలాది రూపాయల ఖర్చుతో నిర్మించిన ప్రభుత్వ భవనాలు నిరుపయోగంగా ఉన్నాయి. దీంతో భవనాలు చుట్టూ పిచ్చిమొక్కలు మొలిచాయి. తలుపులు, కిటికీలను చెదలు తినేస్తున్నా, తుప్పుపడుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. దొనకొండలో నాడు లక్షలు ఖర్చు చేసి నిర్మించిన జడ్పీ అతిథి గృహం, పౌరసరఫరాల గోడౌన్ భవనాలను వినియోగంలోకి తీసుకురాలేదు. దొనకొండలో ప్రభుత్వ కార్యాలయాల సమీపంలో 1998లో టీడీపీ ప్రభుత్వంలో దాదాపు రూ.20 లక్షల జడ్పీ నిధులతో జడ్పీ అతిథి గృహం నిర్మాణానికి చర్యలు చేపట్టారు. దీనిని అసంపూర్తిగా వదిలేయటంతో భవనం ప్రారంభానికి నోచుకోలేదు. అసంపూర్తిగా ఉన్న భవనంలో కొన్ని సంవత్సరాలు హౌసింగ్ సిబ్బంది సిమెంట్ గోడౌన్‌గా వినియోగించుకున్నారు. దొనకొండకు వచ్చే పాలకులు, ఉన్నతాధికారులు రైల్వేశాఖకు చెందిన అతిథి గృహాన్ని ఆశ్రయిస్తుంటారు. ఇది ఖాళీగా లేకుంటే ఇతర ప్రాంతాలకు వెళుతుంటారేగాని, జడ్పీ అతిథి గృహం గురించి పట్టించుకొనేవారేలేరు.

2011లో అప్పటి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి కొంతమేర సొంత నిధులు వెచ్చించి అతిథి గృహానికి మరమ్మతులు చేపట్టి కొద్దిరోజులు వినియోగించుకున్నారు. అనంతరం మండల విద్యాశాఖకు భవనం లేకపోవటంతో కొన్నిరోజులు వినియోగించుకున్నారు. అప్పటి జడ్పీ చైర్మన్ ఈదర హరిబాబు దొనకొండ విచ్చేసిన సమయంలో అతిథి గృహం వినియోగం కోసం నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారేగాని అమలుకు నోచుకోలేదు. ప్రస్తుతం భవనం నిరుపయోగంగా మారి చుట్టూ చిల్లచెట్లు పెరిగి శిథిలావస్థకు చేరుకుంటుంది.

అలాగే, అతిథి గృహానికి ఎదురుగా నిర్మించిన పౌరసరఫరాల గోడౌన్ కొన్ని సంవత్సరాలుగా నిరుపయోగంగా ఉంది. సుమారు నాలుగేళ్ల క్రితం కురిచేడు రోడ్డులో దాదాపు కోటి రూపాయల వ్యయంతో భారీ గోడౌన్‌ల నిర్మాణం చేశారు. దీంతో ఈ గోడౌన్‌ను ఖాళీ చేసి నిరుపయోగంగా ఉంచారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి ఈ భవనాలను ఏదో ఒక శాఖకు కేటాయించి వినియోగంలోకి తెచ్చేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వనరుల సంరక్షణకు ప్రజల్ని చైతన్యపరచాలి

» జిల్లాలో 15వేల ఇంకుడు గుంతల నిర్మాణానికి ప్రణాళికలు

» డ్వామా పీడీ జోసఫ్‌కుమార్



శివరాంపురం వద్ద ఇంకుడు గుంతలనిర్మాణ పనులను పరిశీలిస్తున్న పీడీ జోసఫ్‌కుమార్

తాళ్లూరు, ఫిబ్రవరి13 (ఆంధ్రజ్యోతి): వనరుల సంరక్షణపై రైతులు, ప్రజలను చైతన్యపర్చాలని డ్వామా పీడీ గంగవరపు జోసఫ్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని శివరాంపురం గ్రామంలో ఉపాధిహామీ పథకం కింద చేపడుతున్న ఇంకుడు గుంతలనిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా 15వేల ఇంకుడు గుంతల నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్టు చెప్పారు. మురుగునీటి సమస్య తీరేందుకు, భూగర్భజలాలు పెరుగుదలకు ఇంకుడు గుంతలు ప్రయోజనకరంగా ఉంటాయన్న విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. ప్రతి ఇంకుడు గుంతకు ఉపాధి పథకం కింద రూ.ఆరు వేలు మంజూరు చేస్తున్నట్టు చెప్పారు. రైతులు తమ పొలాల్లో ఫామ్‌పాండ్స్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సాహం అందించాలన్నారు. పశువుల షెడ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తయ్యేలా చూడాలన్నారు. అవసరమైతే మరికొన్ని మంజూరుచేస్తున్నట్టు చెప్పారు. అటవీశాఖ ఆధ్వర్యంలో ఉపాధిహామీ పథకం నిధులతో రూ.40లక్షల మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

కార్యక్రమంలో ఎంపీడీవో డి.మనుమంతరావు, ఏపీవో ఎస్.సత్యం, ఏపీవో బి.మురళి, ఈసీ గురుబాబు, తదతరులు పాల్గొన్నారు. కాగా, పీడీ జోసఫ్‌కుమార్‌ను జడ్పీటీసీ మారం వెంకటరెడ్డి కలిశారు. రైతువారీ పనులకు అధిక ప్రాధాన్యత నిచ్చి వారికి తోడ్పాటు నందించాలని కోరారు.

రీసర్వేపై అపోహలొద్దు!



రీసర్వే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ ఆర్డీవో వెంకటశివరామిరెడ్డి

కురిచేడు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): రీసర్వేపై రైతులు అపోహలు చెందవద్దని కనిగిరి ఇన్‌చార్జ్ ఆర్డీవో, వెలిగొండ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.వెంకటశివరామి రెడ్డి అన్నారు. అధికారులకు రైతులు సహకరించాలని ఆయన కోరారు. మండలంలోని పేరుంబొట్లపాలెం గ్రామంలో జరుగుతున్న రీసర్వేను గురువారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గ్రామంలో 693 ఎకరాల భూమి ఉందని చెప్పారు. ఇందులో 229 ఎకరాలు ప్రభుత్వ భూమి, 464 ఎకరాల రైతుల భూమి ఉందన్నారు. గతంలో జరుగుతున్న సర్వేలో అక్కడక్కడా లోపాలు తలెత్తడంతో వాటిని రీసర్వే చేస్తున్నట్టు చెప్పారు. గతంలో సర్వే జరిగే సమయంలో రైతులు లేకపోవడంతో కొన్ని తేడాలు వచ్చాయన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం సదరు రైతులకు ముందస్తు నోటీసులు ఇచ్చి రీసర్వే చేయిస్తున్నట్లు తెలిపారు. ఎక్కడా పొరబాటు జరగకుండా పటిష్టమైన ఏర్పాటుచేస్తు న్నట్లు చెప్పారు. అందుకోసం ఒక బృందాన్ని ప్రత్యేకంగా నియమించామన్నారు. అధికారులకు సొంత నిర్ణ యాలు ఉండవని, రైతులతో మాట్లాడి వారి భూమికి సక్రమంగా హద్దులు నిర్ణయిస్తారని చెప్పారు.

రెవెన్యూ సదస్సులలో వచ్చిన అర్జీలపై విచారణ చేశామని ఇన్‌చార్జ్ ఆర్డీవో తెలిపారు. 252 అర్జీలు రాగా, 212 పరిష్కరించినట్టు చెప్పారు. కొన్నింటిని ఎందుకు పరిష్కరించలేకపోయామో అర్జీదారులకు తెలియజేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ రజనీకుమారి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సవాలతో గ్రామాల్లో ఐక్యత

» ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో నిర్వహించే ఉత్సవాలు గ్రామస్థుల మధ్య ఐక్యతను చాటాలని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. ప్రతిఏటా మాఘశుద్ధ పౌర్ణమి సందర్భంగా బ్రహ్మంగారి తిరునాళ్ల మండలంలోని తాళ్లూరు గ్రామంలో ఘనంగా నిర్వహిస్తారు. అందులోభాగంగా బుధవారం రాత్రి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేవాలయాల్లో ఉత్సవాలు పేరుతో నిర్వహించే కార్యక్రమాలతో ప్రజల మధ్య సమానత్వంతో పాటు ఐక్యతను పెంచుతాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు బాలు ఓబులురెడ్డి, నంబలు వెంకటేశ్వర్లు, కృష్ణారెడ్డి, సానికొమ్ము విజయభాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అలాగే, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దద్దాల నారాయణయాదవ్ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట మూలె మాలకొండారెడ్డి, జడ్పీటీసీ కస్తూరిరెడ్డి, పిల్లి లక్ష్మీనారాయణ రెడ్డి తదితరులు ఉన్నారు.

డిగ్రీ సెమిస్టర్ ఫలితాల్లో ఎంఎస్‌ఎం హవా



ముక్కు మనిషా, దాసరి యామిని



కామిరెడ్డి ధనలక్ష్మి, కొమెర్ల మౌనిక

కనిగిరి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ నాల్గవ సెమిస్టర్ ఫలితాల్లో ఎంఎస్‌ఎం విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారు. ఈ ఫలితాలు గురువారం విడుదలయ్యాయి. ఎంఎస్‌ఎం (జీసీఅండ్‌వైపీఎస్) కళాశాలలో బీఎస్సీ చదువుతున్న కామిరెడ్డి ధనలక్ష్మి 878 మార్కులు, బీఎస్సీ అగ్రికల్చర్‌లో కొమెర్ల మౌనిక 836 మార్కులు, బీఎస్సీ కంప్యూటర్స్‌లో ముక్కు మనిషా 735 మార్కులు, బీకాం కంప్యూటర్స్‌లో దాసరి యామిని 624 మార్కులు సాధించి టౌన్ టాప్‌లో నిలిచారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ ఏలూరి సుబ్బారావు, డైరెక్టర్ నరేంద్ర, ప్రిన్సిపాల్ వీఆర్‌వీ రెడ్డి, అధ్యాపక బృందం అభినందించారు.

అధ్వానంగా గ్రంథాలయాల నిర్వహణ

» ఏళ్ల తరబడి అద్దెభవనాల్లో కొనసాగింపు



దర్శిలో మూతపడిన గ్రంథాలయం


దర్శి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): దర్శి నియోజకవర్గంలో గ్రంథాలయాల నిర్వహణ అధ్వానంగా మారింది. ఏళ్ల తరబడి అన్నీ మండలాల్లో గ్రంథాలయాలు అద్దెభవనాల్లో నడుస్తున్నాయి. సిబ్బంది కొరతతో వారంలో రెండు రోజులు మాత్రమే గ్రంథాలయాలు తెరచుకుంటున్నాయి. మిగిలిన రోజుల్లో మూతబడుతున్నా యి. దీంతో గ్రంథాలయాకు వచ్చే ప్రజలు తీవ్ర అసౌ కర్యానికి గురవుతున్నారు. దర్శి గ్రంథాలయ అధికారి మూడు మండలాల్లో విధులు నిర్వహిస్తున్నారు. దర్శిలో శని, ఆదివారాలు మాత్రమే గ్రంథాలయం తెరచుకుం టుంది. మిగిలిన ఐదు రోజులు మూతబడుతుంది. తాళ్ళూరు మండలంలో మంగళ, బుధ, గురువారం పనిచేస్తుంది. మిగిలిన రోజులు మూతబడుతుంది.

ముండ్లమూరు మండలంలో సోమవారం మాత్రమే పనిచేస్తుంది. మిగిలిన అన్నీ రోజులు తెరుచుకోదు. దర్శి గ్రంథాలయ అధికారి తాళ్ళూరు, ముండ్లమూరు మండలాలకు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. దీంతో మూడు మండలాల్లో అరకొరగానే గ్రంథాలయాలు తెరుచుకుంటున్నాయి. కురిచేడు, దొనకొండ మండలాల్లో కూడా ఒకే అధికారి కొన్నిరోజులు అక్కడ, మరికొన్ని రోజులు ఇక్కడ గ్రంథాలయాలు తెరుస్తున్నారు. రోజురోజుకు గ్రంథాలయ వ్యవస్థ పనితీరు దిగజారిపోతుంది. ఇప్పటికే గ్రంథాలయాల్లో ఆశించిన పుస్తకాలు అందుబాటులో ఉండటం లేదు.

టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రంథాలయ వ్యవస్థను అభివృద్ధి పథంలో నడిచేందుకు చర్యలు చేపడతారని ప్రజలు ఆశిస్తున్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు

» తహసీల్దార్ రవికిషోర్



వాగును ఆక్రమించి వెంచర్ వేసిన భూమిని పరిశీలిస్తున్న తహసీల్దార్ రవికిషోర్

కనిగిరి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములు, వాగులు, వంకలు ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ రవికిషోర్ హెచ్చరించారు. మండలంలోని తుమ్మకుంట పరిధిలోని 335 సర్వే నెంబరులోని వాగు పోరంబోకు భూమని ఆక్రమించి వేసిన వెంచరును గురువారం పరిశీలించారు. ప్రభుత్వ భూములు ఆక్రమించటం చట్టరీత్యానేరమన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి అనుమతులు పొందకుండా వెంచర్లు వేయటం చట్టాన్ని ఉల్లంఘించటమేనని అన్నారు.

ప్రభుత్వ వాగు స్థలాలు ఆక్రమించి వెంచరు వేసిన నిర్వాహకులపై చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ రవికిషోర్ తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వో గాయం ప్రసాద్‌రెడ్డి, సర్వేయర్ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

సత్తా చాటిన నంద్యాల ఎడ్లు



ఎడ్ల బలప్రదర్శన పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

సీఎస్‌పురం(పామూరు), ఫిబ్రవరి13 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలం అయ్యలూరివారిపల్లి గ్రామంలో బుధవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీల్లో నంద్యాల ఎడ్లు సత్తా చాటాయి. ఈపోటీలను ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ప్రారంభించారు. నంద్యాల జిల్లా సిరివెళ్ల మండలం గుంపమాన్‌దిన్నె గ్రామానికి చెందిన కుందురు రాంభూపాల్ రెడ్డికి చెందిన ఎడ్లజత 2101 అడుగుల దూరం లాగగా, ప్రథమ బహుమతి కింద ఎడ్ల యజమాని రూ.1,01,116 అందుకున్నారు.

కడప జిల్లా మైదుకూరుకు చెందిన కుర్రా వెంకటేష్ యాదవ్‌కు చెందిన ఎడ్లజత 1956 అడుగులు లాగగా ద్వితీయ బహుమతి కింద రూ.70,116లు, కుందురు రాంభూపాల్‌కు చెందిన రెండవ ఎడ్లజత 1950 అడుగులు లాగి తృతీయ బహుమతి కింద రూ.50,116 ఎడ్ల యజమానులు అందుకున్నారు. వరుసగా ఏడు స్థానాల్లో వచ్చిన ఎడ్ల యజమానులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బొమ్మనబోయిన వెంగయ్య, ముత్యాల వెంకటసుబ్బారెడ్డి, ఎస్సీ మాలకొండయ్య, పాలగుల్ల మోహన్ రెడ్డి, ఎస్.రమణయ్య, ఎస్.తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలు అందించాలి

ముండ్లమూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించాలని ఎంపీపీ సుంకర సునీత అన్నారు. గురువారం ముండ్లమూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ సమావేశానికి వైద్యాధికారి వెంకటేశ్వర్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ఎంపీపీ సునీత మాట్లాడుతూ రోగులకు మెరుగైన సేవలు అందించటంతో పాటు అన్నిరకాల మందులు ఆస్పత్రిలో ఉండే విధంగా చూడాలన్నారు. ఆస్పత్రికి వచ్చే నిధులను ఆస్పత్రి అభివృద్ధికి మాత్రమే ఖర్చు చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న పథకాలను ప్రతి ఒక్కరికి అందే విధంగా చూడాలన్నారు. వ్యాధులతో గ్రామాల్లో ప్రజలు ఇబ్బంది పడకుండా చూడాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో ఆర్.జనార్దన్, వైద్యాధికారి జాస్మిన్, సీహెచ్‌వో నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యతో ప్రయోజనాలు

పామూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదుతో రైతులకు అన్ని సంక్షేమ పథకాలు చేరువవుతాయని మండల వ్యవసాయాధికారిని కె.రాధ తెలిపారు. మండలంలోని ఇనిమెర్ల గ్రామ రైతు సేవా కేంద్రంలో భూఆధార్ గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి రైతు ఆధార్, పాసుపుస్తకం నకళ్లతోపాటు ఆధార్‌తో లింకైన ఫోన్ తీసుకొని తమ పరిధిలోని రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేసే అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్, సబ్సిడీ విత్తనాలు, బీమా, పంట నష్టపరిహారం, పంట రుణాల కోసం రానున్న రోజుల్లో విశిష్ట గుర్తింపు సంఖ్య ఉంటేనే దక్కుతాయన్నారు. పట్టా భూములు కలిగిన రైతులందరూ తప్పనిసరిగా యూనిక్ కోడ్‌ని రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఏవో రాధ సూచించారు.

తాళ్లూరులో..

తాళ్లూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి రైతుకు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చడానికి రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య ప్రామాణికమవుతుందని ఏవో బి.ప్రసాద్‌రావు అన్నారు. గురువారం లక్కవరం గ్రామంలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రైతు కుటుంబంలో పొలం ఉన్న ప్రతిఒక్కరూ విశిష్ట గుర్తింపు సంఖ్య పొందాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ ఆంజనేయులు, రైతులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలను పరిష్కరించాలి

దర్శి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఎంపీపీ జి.సుధారాణి సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. మండలంలో చేపట్టిన రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తిచేయాలని కోరారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈసందర్భంగా పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్, సాంఘిక సంక్షేమం, రోడ్లు భవనాలు, విద్యుత్, వ్యవసాయం తదితర అంశాలపై చర్చ జరిగింది. సమావేశంలో ఎంపీడీవో ఎల్ .కృష్ణమూర్తి, వివిద శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

జీరో ఖాతాల భూముల పరిశీలన

పామూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇనిమెర్ల గ్రామంలోని చుక్కల భూములను గురువారం తహసీల్దార్ బీవీ రమణారావు పరిశీలించారు. జిల్లాలో చుక్కల భూముల సంఖ్య పామూరు మండలంలో అధికంగా ఉన్నాయన్నారు. జీరోఖాతాల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం త్వరలో చర్యలు తీసుకొంటుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు నల్లబోతుల వెంకటేశ్వర్లు, డిప్యూటీ తహసీల్దార్ బ్రహ్మయ్య, మండల సర్వేయర్ స్వప్న, వీఆర్వోలు మండ్ల శ్రీనివాసులు, ఏ.సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై దాడి

పీసీపల్లి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): యువకుడిపై దాడిచేసిన ఘటన బుధవారం మండలంలోని పెదయిర్లపాడులో చోటుచేసుకుంది. బాధితుడు ఫిర్యాదుమేరకు పోలీసులు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. ఎస్ఐ జి.కోటయ్య, బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. వెంగళాపురం గ్రామానికి చెందిన ఉన్నం శ్రీనివాస్ కర్రల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం పెదయిర్లపాడులో ఉండగా లింగన్నపాలెం గ్రామానికి చెందిన దత్తాత్రేయరెడ్డి వచ్చాడు. అక్కడ ఓ హోటల్ వద్ద ఉన్న అటవీశాఖ సిబ్బందితో దత్తాత్రేయరెడ్డి మాట్లాడుతున్న సమయంలో శ్రీనివాస్ కల్పించుకున్న క్రమంలో ఇద్దరూ ఘర్షణ పడ్డారు.

అదేరోజు సాయంత్రం కొంతమంది మధ్యవర్తులు శ్రీనివాస్ వద్దకు వచ్చి మాట్లాడదాం రండి అని అంకమ్మగుడి సమీపంలోకి తీసుకెళ్లారు. అక్కడ మాట్లాడుతున్న సమయంలో దత్తాత్రేయరెడ్డి వచ్చి కులం పేరుతో దూషిస్తూ రాడ్డుతో దాడి చేసి గాయపరిచినట్లు తెలిపారు. గాయపడిన శ్రీనివాస్ చికిత్స కోసం కనిగిరి ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లాడు. అక్కడి పోలీసులు బాధితుడి నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేయగా పీసీపల్లి పోలీసులు కేసు నమోదు చేశాడు.

పిల్లలు పనిలో కాదు బడిలో ఉండాలి

పీసీపల్లి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): బడిఈడు కలిగిన పిల్లలు పాఠశాలకు వెళ్లి చదువుకోవాలే కాని పనులకు కాదని మండల విద్యాశాఖాధికారులు జి.సంజీవి, ఆర్.శ్రీనివాసులు అన్నారు. బంగారు బాల్యం కార్యక్రమంలో భాగంగా గురువారం పీసీపల్లిలో ప్రభుత్వ లైన్ డిపార్ట్‌మెంట్స్ గుడ్‌హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వెట్టిచాకిరి నిర్మూలన, బాల కార్మికుల నిర్మూలన చట్టంపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దృశ్య, శ్రవణ రూపంలో స్క్రీన్‌పై ప్రదర్శించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఆంజనేయులు, గుడ్‌హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ రమేష్, రాజేష్, అంగన్‌వాడీ టీచర్లు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్‌కు డ్రోన్ కెమెరా అందజేత

ముండ్లమూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారెళ్ల గ్రామానికి చెందిన కార్తికేక కన్‌స్ట్రక్షన్ అధినేత కుంచాల నాగరాజు డ్రోన్ కెమెరాను గురువారం ఒంగోలులో ఎస్పీ దామోదర్‌కు అందజేశారు. నాగరాజు హైదరాబాద్‌లో ఉండి రాలేకపోవటంతో అతని స్నేహితులైన ఒగులూరి శీహర్ష, పాలపర్తి గురవయ్యలు అందజేశారు. ఈసందర్భంగా ఎస్పీ దామోదర్ దాత నాగరాజును ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో దర్శి డీఎస్పీ డి.లక్ష్మీనారాయణ, సీఐ వై.రామారావు, ఎస్ఐ వై.నాగరాజు పాల్గొన్నారు.



సాగు.. పెరిగింది

1 గత ఐదేళ్లతో పోలిస్తే అధికం

1 5.96 లక్షల ఎకరాల్లో వ్యవసాయం

1 అంచనాలకు మించి వరి, పొగాకు, మొక్కజొన్న

1 మిర్చి, వరికి నీటిని సరఫరా చేయాలంటోన్న రైతులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

రబీ సీజన్‌లో సాగు ఆశాజన కంగా ఉంది. గత ఐదేళ్ల కంటే ఈ ఏడాది సాగు గణనీయంగా పెరిగింది. సాధారణ విస్తీర్ణంలో 94 శాతం పంటలు సాగు చేయడం విశేషం. నీటి సరఫరా మెరుగ్గా ఉండటంతో సాగు పెరిగింది. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాలో 5.96 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. అంచనా లకు మించి వరి, మొక్కజొన్న, పొగాకు సాగు చేశారు. రబీలో వరి తర్వాత మొక్కజొన్న ప్రధాన పంట కాగా ఈ ఏడు సాగు భారీగా పెరిగింది. వరి సాగు కూడా రెండేళ్ల కంటే పెరిగింది. అంచనాలను తలకిందులు చేస్తూ పొగాకు సాగు చేపట్టారు. వరి సాధారణ విస్తీర్ణం 1,05,695 ఎకరాలు కాగా 86,730 ఎకరాల్లో సాగు చేశారు. మొక్కజొన్న మూడు జిల్లాల్లో సాధారణ విస్తీర్ణం 1,46,462 ఎకరాలు ఉంటే 1,39,227 ఎకరాల్లో సాగు చేశారు. పల్నాడు జిల్లాలో 55 శాతం అధికంగా మొక్కజొన్న సాగైంది. పల్నాడు జిల్లాలో విస్తృతంగా కంది సాగు చేశారు. సాధారణ విస్తీర్ణం 6,662 ఎకరాలు కాగా 8,292 ఎకరాల్లో సాగు చేశారు. సాధారణం కన్నా 24 శాతం పెరిగింది.


మొక్కజొన్న


పొగాకు


వరి

తగ్గిన శనగ.. పెరిగిన పొగాకు

పల్నాడు, బాపట్ల జిల్లాల్లో శనగ సాగు గణనీయంగా తగ్గింది. పల్నాడు జిల్లాలో సాధారణ విస్తీర్ణం కన్నా 35 శాతం, బాపట్ల జిల్లాలో 47 శాతం తగ్గింది. శనగ సాధారణ విస్తీర్ణం 1,23,970 ఎకరాలు కాగా 76,022 ఎకరాల్లో మాత్రమే ఈ సారి రైతులు సాగు చేశారు. శనగకు ప్రత్యామ్నాయంగా పొగాకు చేశారు. దీంతో పొగాకు సాగు పెద్దఎత్తున పెరిగింది. పొగాకు 28,812 ఎకరాలు సాధారణ విస్తీర్ణం కాగా 90,502 ఎకరాల్లో సాగు చేశారు. దాదాపు 61,690 ఎకరాల్లో పొగాకు సాగు పెరిగింది. సాధారణం కన్నా మూడు రెట్లకు పైగా పొగాకు సాగు పెరగడం గమనార్హం.

పంటల సాగు వివరాలు ఎకరాల్లో..

జిల్లా	సాధారణ విస్తీర్ణం	సాగు	శాతం
పల్నాడు	1,30,157	1,25,125	96
గుంటూరు	1,64,320	1,60,217	97
బాపట్ల	3,51,725	3,11,470	89

ఆశాజనకంగా సాగు..

పంటల సాగు ఆశాజనకంగా ఉంది. దిగుబడులు బాగుంటాయని రైతులు ఆశిస్తున్నారు. శనగ పంట నూర్పిళ్లు జరుగుతున్నాయి. పొగాకు కోత కొత దశలో ఉంది. కొన్ని ప్రాంతాల్లో మొక్కజొన్న కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. వరి నాట్లు పూర్తయ్యాయి. పొగాకు ధర కూడా ఆశాజన కంగా ఉందని రైతులు చెబుతున్నారు.

సాగర్ జలాశయంలో 191.25 టీఎంసీల నీటి నిల్వ

నాగార్జున సాగర్‌లో 312.05 టీఎంసీలు పూర్తి నిల్వ సామర్థ్యం కాగా 191.25 టీఎంసీల నీటి నిల్వ ఉంది జలాశయం నీటి మట్టం 590 అడుగులు కాగా గురువారం 541.3 అడుగులు నీటి మట్టం నమోదైంది. మిర్చికి మార్చి 31 వరకు, వరికి ఏప్రిల్ నెలాఖరు వరకు సాగు నీరు అవసరం ఉందని అప్పటి వరకు సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.

ప్రేమానుబంధం



- రెండు జీవితాలను పెనవేసే మాధుర్యం
- ఒకరిపై ఒకరికి నమ్మకం.. జీవితకాల బాధ్యత
- వయసు ఆకర్షణనే ప్రేమగా భ్రమిస్తున్న యువత
- మూణ్ణాళ్ల ముచ్చటగా మారుతున్న అనుబంధం!

ప్రేమ.. రెండక్షరాల పదం.. కానీ దాని ప్రభావం అనంతం! సూర్యుడి చుట్టూ భూమి తిరిగినట్లు.. ప్రేమ చుట్టూ ప్రపంచం మొత్తం తిరుగుతోందంటే.. ప్రేమ మహత్తు గురించి ఇంకేం చెప్పాలి? రెండు హృదయాలను ఒక్కటి చేసే తీయని మకరందం.. ప్రేమ. రెండు జీవితాలను ఏకం చేసే అనుబంధమిది. మనిషికి మనసుతో వేసిన తియ్యటి అనుబంధం.. మనుగడకి మూలం.. ప్రేమామృతం. పిరికి వాడికి ధైర్యాన్నిస్తుంది.. ధైర్యవంతుడికి బలాన్నిస్తుందీ ప్రేమ. అలాంటి మధుర భావన స్పృశించని హృదయం ఉండదంటే ఆశ్చర్యం కాకపోవచ్చు. భాష, ప్రాంతం, ఏదైనా.. ప్రేమ భావం మాత్రం మారదు. సృష్టిపై ప్రభావమూ మారదు. కులమతాలు ఏవైనా.. దీని అభిమతం మాత్రం ఒక్కటే. ఎవరు ఔనన్నా.. కాదన్నా.. ఈ ప్రేమ తత్వం మాత్రం శాశ్వతం. ఆ ప్రేమను గురించి.. వాలెంటైన్స్ డే సందర్భంగా ప్రత్యేక కథనం.

గుంటూరు, బాపట్ల, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): సకల చరాచర సృష్టిని నడిపించేది ప్రేమ ఒక్కటే. చెట్లూ, చేమలు, పశుపక్ష్యాదులు, జీవరాశి ఏదైనా సరే ప్రేమ మాధుర్యాన్ని చవిచూడాల్సిందే. అయితే వాటికి లేని అదృష్టం.. మనిషికి మాత్రమే దక్కిన అదృష్టం.. ఆ ప్రేమను వ్యక్తం చేయడం. ఇతరులపై కలిగిన అభిమానాన్ని.. ఏర్పడిన ఇష్టాన్ని చెప్పే అవకాశం ఒక్క మనిషికి మాత్రమే దక్కింది. ఆ అభిమా నాన్ని.. ఇష్టాన్ని మహోన్నతమైన ప్రేమగా మలు చుకునే అవకాశం మనకు మాత్రమే ఉంది. కొత్త బంగారులోకంలో ప్రవేశించే యువతీ- యువకుల మధ్య జనించే ప్రేమ మధుర్యం ఇంతని చెప్పలేము. ఆ మాధుర్యం కలకాలం కొనసాగించడమే యువత ముందున్న సవాలు. ప్రేమించుకునే సమయంలో ఏర్పడే అభిమానాలు, ఇష్టాలు, ప్రేమలు జీవితకాలం కొనసాగించడమే అసలైన ప్రేమ. అలాంటి ప్రేమను సొంతం చేసుకోవడమే యువతకు సవాలు. ఆ సవాలును ఎదుర్కోవాలంటే యువతీ యువకులకు ఎంతో చైతన్యం కావాలి.

బాహ్య సౌందర్యమే ప్రేమా?

ప్రపంచాన్నేలే ప్రేమ గెలవాలంటే.. నిలవాలంటే.. ప్రేమంటే ఏమిటో తెలియాలి. యుక్తవయసులో ఏర్పడే ఆకర్షణనే నేటి యువత ప్రేమగా భ్రమిస్తోంది. ఒకరంటే.. ఒకరికి ఏమిటో తెలియకుండానే.. అలవాట్లు.. జీవన విధానాలు.. తెలియ కుండానే.. బాహ్య సౌందర్యాన్ని చూసి ఆకర్షణలో పడిపోతున్నారు. ఎదుటివారి అంతఃసౌందర్యాన్ని వీక్షించకుండానే, హృదయ సౌందర్యాన్ని అనుభూతి చెందకుండానే ప్రేమలో పడిపోతున్నారు. అందుకే చిరకాలం నిలవాల్సిన ప్రేమ బంధాలు, అచిరకాలంలోనే అర్థాంతరంగా ఆగిపోతున్నాయి. ప్రేమంటే ఒకరి పట్ల ఒకరికి నమ్మకం. బాధ్యత. సహనం. క్షమ. నిజాయితీ. పట్టుదల ఉండాలి. మనోబలం ఉండాలి. కుంటుంబ జీవితంలో ఎదురయ్యే సవాళ్లను స్వీకరించే ధైర్యం, ఓపిక ఉండాలి. ఒకరి గౌరవాన్ని ఒకరు పెంచుకుంటూ ముందుకు సాగాలి. అయితే ఇలాంటి నిష్కల్మషమైన, నిర్మలమైన, నిస్వార్థమైన ప్రేమ ఉంటే అది కలకాలం నిలుస్తుంది. ఎన్ని అవాంతరాలు వచ్చినా గెలుస్తుంది. కానీ దురదృష్టవశాత్తూ యువతీ యువకుల మధ్య అలాంటి ప్రేమ కొరవడుతోంది.

సినిమా ప్రేమల వలలో.. యువత

సమాజంలో ప్రేమపై చాలా మందిలో సరైన అవగాహన లేదు. ప్రేమ అనగానే తల్లిదండ్రులు- బిడ్డలు పరస్పర


(మిగతా 6వ పేజీలో)

మారుతున్న ప్రేమ గమనం

కాలం మారినా.. తత్వం మార్చుకోని ప్రేమ.. తన గమనాన్ని మాత్రం మార్చుకుంటోంది. ఒకప్పటి ప్రేమకు పెళ్లి గమ్యమైతే.. నేటి ప్రేమ.. సహజీవనం చాలంటోంది. ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాన్ని కోరుకున్న ఈ ప్రేమ.. నేడు ఒకరికి ఒకరం చాలంటోంది. పిల్లలూ వద్దంటోంది. పంచేకొద్దీ పెరిగే ఈ ప్రేమ.. అసలు పంచనే వద్దంటోంది. బాంధవ్యాలను తెంచేస్తోంది. అన్నీ అనుకూలించినా ప్రేమ అంతిమ గమ్యం పెళ్లి కాదనే ప్రమాద కర ధోరణులు గడచిన దశాబ్దాకాలంలో ఎక్కువైంది. ప్రేమ విషయంలో మారుతున్న యువత ఆలోచనా తీరు ఈ విధంగా ఉంటే ఈ సోషల్ మీడియా యుగంలో ప్రేమ పేరుతో బెదిరింపులు, ఎమోషనల్ బ్లాక్ మెయిల్స్, ఫొటో మార్ఫింగ్‌లు ఇవన్నీ ఆ మధురానుబంధానికి మరింతగా సవాళ్లు విసురుతున్నాయి.

ఎల్‌ఎల్‌ఎమ్ రెండో సెమిస్టర్ ఫలితాలు విడుదల

పెదకాకాని, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): గత అక్టోబరు నెలలో జరిగిన ఎల్.ఎల్.ఎమ్. రెండో సెమిస్టర్ ఫలితాలను వర్సిటీ వెబ్‌సైట్‌లో బుధవారం పొందుపర్చినట్లు పరీక్షల నిర్వహణ నియంత్రణ అధికారి ఆలపాటి శివప్రసాదరావు తెలిపారు. 114 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 87 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. పునఃమూల్యాకనం కోరే విద్యార్థులు ఫిబ్రవరి 14లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



విద్యాజ్యోతిలో... అవినీతి

u జడ్పీ టెండర్ నిబంధనలకు నీళ్లు u ఒకే తరహా పుస్తకానికి ఇద్దరు కాంట్రాక్టర్లు u కమీషన్లతో నాసిరకం పేపర్‌తో మెటీరియల్ ముద్రణ u అక్రమాలపై ఫిర్యాదు చేసేందుకు కొందరు జడ్పీటీసీలు సిద్ధం u అధికారుల తీరుతోనే విద్యార్థులకు మెటీరియల్ పంపిణీలో జాప్యం

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్‌లో అవినీతి కంపు కొడుతోంది. అధికారులు పూర్తిగా అడ్డదారులు తొక్కుతున్నారు. చివరకు పేద విద్యార్థులకు పంపిణీ చేసే విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్‌ను కూడా ఆదాయ వనరుగా మార్చుకున్నారు. అందుకోసం టెండర్ నిబంధనలకు పూర్తిగా నీళ్లొదిలారు. కవర్ పేజీకి ఒక రేటు.. లోపలి పేజీకి మరో రేటు అంటూ అవినీతికి లాకులు తెరిచారు. అధికారులే అందినకాడికి పుచ్చుకోవడంతో నాణ్యత లేని పేపర్‌తో మెటీరియల్‌ను కాంట్రాక్టర్ ముద్రించారన్న ఆరోపణలున్నాయి. విద్యాజ్యోతి పుస్తకం ముద్రణ, టెండర్ ప్రక్రియలో జరిగిన అక్రమాలపై ఫిర్యాదు చేసేందుకు కొంతమంది జడ్పీటీసీలు సిద్ధమయ్యారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని జిల్లా పరిషత్ పాఠశాలల్లో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఏటా విద్యాజ్యోతి పేరుతో స్టడీ మెటీరియల్ అందజేస్తున్నారు. ఇందుకోసం జడ్పీ నిధులను రూ.60 లక్షల నుంచి రూ.80 లక్షల వరకు వెచ్చిస్తుంటారు. ఈ ఏడాది కూడా విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్ పంపిణీకి శ్రీకారం చుట్టారు. అన్ని జడ్పీ పాఠశాలల్లో సుమారు 34 వేల మంది విద్యార్థులు ఉన్నట్లు విద్యాశాఖ ఇచ్చిన సమాచారంతో టెండర్ ప్రక్రియకు వెళ్లారు.



రేటు తక్కువ అని...

గతంలో విద్యార్థులకు పంపిణీ చేసిన విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్‌కు ఇప్పటి మెటీరియల్‌కు చాలా తేడా ఉంది. గతంలో పేజీకి 33 పైసలు చొప్పున చెల్లించి నాణ్యమైన పేపర్‌తో పుస్తకాలు ముద్రించేలా చూసే వారు. ఇప్పుడు పేజీ 31 పైసలకు కాంట్రాక్టు ఇచ్చి నిధులు ఆదా చేశామని అధికారులు చెబుతున్నారు. కానీ ప్రస్తుతం పంపిణీ చేసిన స్టడీ మెటీరియల్ పూర్తి నాసిరకం కలిగిన పేపర్‌తో ప్రింట్ చేశారు. తక్కువ గేజ్ కలిగిన పేపర్ వాడటంతో మెటీరియల్ చూడడానికి కూడా చాలా ఇబ్బందిగా ఉంది. పేజీ రేటు తగ్గించి కాంట్రాక్టు ఒకే చేశామని అధికారులు చెబుతున్నారు. అయితే పేజీ రేటు తగ్గించి కమీషన్ల పెంచడంతో పుస్తకం నాసిరకంగా మారిందన్న ఆరోపణలున్నాయి. కవర్ పేజీకి ఒక రకమైన కమీషన్, లోపలి పేజీలకు మరో రకమైన కమీషన్ ఒప్పందం జరిగినట్లు తెలుస్తోంది. కమీషన్ల సంగతి తేలకపోవడంతోనే విద్యాజ్యోతి ఫైల్ నెల రోజులకు పైబడి పెండింగ్‌లో ఉన్నట్లు చెబుతున్నారు. అధికారుల తీరు వల్ల ఎప్పుడూ డిసెంబరులోనే విద్యార్థులకు అందే స్టడీ మెటీరియల్ ఈ ఏడాది ఫిబ్రవరి 8 వ తర్వాత పాఠశాలలకు చేరింది.

టెండర్లు పిలవాల్సింది ఎవరు?

పంచాయతీరాజ్ చట్టం, ప్రభుత్వ నిబంధనల ప్రకారం జిల్లా పరిషత్‌కు సంబంధించిన అన్ని టెండర్లు జడ్పీ డిప్యూటీ సీఈవో పిలవాలి. ప్రతిసారి ఆ విధంగానే జరుగుతుంది. అయితే జడ్పీ డ్రాయింగ్ అధికారి ఇవ్వాల్సిన టెండర్‌ను ఈ ఏడు మాత్రం మరొకరి పేరుతో జారీచేశారు. పుస్తకాల ముద్రణ బాధ్యతను ఇద్దరు కాంట్రాక్టర్లకు అప్పగించడం వివాదంగా మారింది. ఎప్పుడూ ఒకరికి మాత్రమే కాంట్రాక్టును అప్పగించేవారు. ఈసారి పట్టుబట్టి మరీ వేరే జిల్లా నుంచి మరో కాంట్రాక్టర్‌ను బరిలోకి దింపారు. ఎప్పుడూ పుస్తకాలు సరఫరా చేసే కాంట్రాక్టర్ గతంలో కమీషన్ సరిగా చెల్లించకపోవడంతో కాంట్రాక్టును రెండు భాగాలుగా చేసినట్లు ప్రచారం జరుగుతోంది.

రూ. 4 కోట్ల నిధులకు రెక్కలు..

జడ్పీలో మరో వివాదం తలెత్తింది. ప్రభుత్వం తాజాగా కేటాయించిన 15వ ఆర్థిక సంఘం పనుల కేటాయింపులో చేతి వాటం మొదలైందన్న ఆరోపణలున్నాయి. రూ.4 కోట్ల వ్యవహారంలో నిబంధనలను మీరి ఒకరికి బదులు మరొకరు పనుల కేటాయింపునకు పూనుకుంటున్నారు. కనీసం రెండు శాతం తగ్గకుండా కమీషన్ ఇచ్చిన వారికే పనులు ఇస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీనిపై కూడా ఫిర్యాదుకు కొందరు జడ్పీటీసీలు సిద్ధమయ్యారని సమాచారం.



బైటమంజులూరులో రీసర్వేలో రికార్డులను తనిఖీ చేస్తున్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

రీ-సర్వేతో సమస్యలు పరిష్కారం కావాలి

ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

పంగులూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న రీ-సర్వేతో గ్రామంలో భూ సమస్యలు పరిష్కరించాలని చీరాల ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు సూచించారు. మండలంలోని బైట మంజులూరు గ్రామంలో జరుగుతున్న భూముల రీ-సర్వే ప్రక్రియను గురువారం స్థానిక అధికారులతో కలసి పరిశీలించారు. రైతుల సహకారంతో రీ-సర్వే ప్రక్రియ న్యాయబద్ధంగా నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా భూ రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం నూజెళ్లపల్లి గ్రామంలో ప్రజావేదిక ద్వారా అందిన భూ సమస్యను పరిశీలించారు. కార్యక్రమంలో మండల తహసీల్దార్ సింగారావు, సర్వేయర్ సురేష్, శ్రీనివాసరావు, పలువురు సర్వేయర్లు, వీఆర్వోలు రైతులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీల్లో సెయింట్ ఆన్స్ జయకేతనం



విజేతలతో సెయింట్ ఆన్స్ కళాశాల ప్రతినిధులు

చీరాలటౌన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి వాలీబాల్ పోటీల్లో చీరాల సెయింట్ ఆన్స్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల జయకేతనం ఎగుర వేసింది. గుంటూరు విజ్ఞాన్ యూనివర్సిటీలో జాతీయ స్థాయి యూత్ ఫెస్టివల్ పోటీలు జరగగా అందులో 48జట్లతో పోటీపడిన సెయింట్ ఆన్స్ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. దీంతో గురువారం కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అభినందన సభలో విజేతలను కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు ప్రిన్సిపల్ డా.జగదీష్, తదితరులు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో విజేతలు మరియు అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

విజన్ బిల్డింగ్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన



విజన్ బిల్డింగ్‌పై గ్రామ సంఘ అధ్యక్షులకు శిక్షణ ఇస్తున్న డీఆర్‌డీఏ పీడీ పద్మ

చీరాలటౌన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : విజన్ బిల్డింగ్‌పై ప్రతిఒక్క వీవోఏ అవగాహన కలిగి ఉండాలని డీఆర్‌డీఏ పీడీ పి.పద్మ అన్నారు. మండల పరిధిలోని వెలుగు కార్యాలయంలో 14 మోడల్ మండలాల్లో ఉన్న సిబ్బందికి మూడు రోజుల శిక్షణ కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పీడీ పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏసీ ఉసురుపాటి సుబ్బారావు, ఏపీఎంలు గద్దె సుబ్బారావు, శ్రీనివాసరావు, కడెం మధుసూదనరావు, వీవోఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

నీటి వనరుల గణన పక్కాగా నిర్వహించాలి

అద్దంకి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): చిన్న తరహా నీటి వనరుల గణన పక్కాగా నిర్వహించాలని డిప్యూటీ స్టాటికల్ ఆఫీసర్ డేవిడ్ అన్నారు. అద్దంకి, బల్లికురవ, సంతమాగులూరు, కొరిశపాడు మండలాల పరిధిలోని వీఆర్‌వోలకు గురువారం గణనపై తహసీల్దార్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి 5 సంవత్సరాలకోసారి చిన్న తరహా నీటి వనరుల (వ్యవసాయ బోర్లు, బావులు, చెరువులు) గణన నిర్వహించడం జరుగుతుందన్నారు. రెవెన్యూ గ్రామాల ఆధారంగా గణన చేయాలన్నారు. కార్యక్రమంలో ఆయా మండలాల ఏఎస్‌వోలు అమరనాథ్, సుబ్రహ్మణ్యం, అనూష, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మైలవరం చెరువు వద్ద వివాదాస్పద భూమి పరిశీలన

అద్దంకి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మైలవరం వద్ద ఉన్న చెరువు వద్ద వివాదాస్పదంగా ఉన్న భూమిని చీరాల ఆర్డీవో చంద్ర శేఖర్‌నాయుడు గురువారం పరిశీలించారు. గత ఐదారు సంవత్సరాలుగా ఈ భూమి విషయం తరచూ వివాదాలు జరుగుతున్నాయి. దీంతో పోలీస్ స్టేషన్‌లో కేసులు కూడా నమోదయ్యాయి. ఇటీవల అద్దంకిలో జరిగిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్న మంత్రి గొట్టిపాటి రవి కుమార్ దృష్టికి చె రువు వద్ద భూమి విషయాన్ని గ్రామస్థులు తీసుకుపోయారు. దీంతో గురువారం ఆర్డీవో వివాదాస్పద భూమిని పరిశీలించారు. తహసీల్దార్ శ్రీచరణ్, ఆర్‌ఐ శంకర్, మండల సర్వేయర్ శ్రీలక్ష్మి ఉన్నారు.

మోటార్ సైకిలిస్టుకు గాయాలు

అద్దంకి, ఫిబ్రవరి 13 (ఆంధ్ర జ్యోతి) : అద్దంకి పట్టణంలోని భవానీ సెంటర్‌లో లారీ, మోటార్‌సైకిల్ ఢీకొనడంతో మోటార్‌సైకిలిస్టుకు గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు... గురువారం సాయంత్రం అద్దంకి పట్టణంలోని దామావారిపాలెంకు చెందిన శ్రీనివాసరావు మోటార్‌సైకిల్‌పై రేణింగవరం రోడ్డులో నుంచి దర్శి రోడ్డులోకి వెళ్లే క్రమంలో లారీ ముందు భాగంలో ఢీకొన్నాయి. గాయపడ్డ శ్రీనివాసరావును స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

పొలం తగాదాపై కేసు

మార్టూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : తన పొలంలోకి అక్రమంగా ప్రవేశించి పొలం దున్నడానికి ప్రయత్నించారని పెంట్యాల సత్యనారాయణ అనే వ్యక్తి కాళహస్తి వాసుదేవమూర్తి, తాళ్లూరి బెన్నిలనే వ్యక్తులపై గురువారం స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని సీఐ ఎం.శేషగిరిరావు తెలిపారు. మండలంలోని వలపర్ల పంచాయతీ పరిధిలోని ద్వారకపాడు గ్రామానికి చెందిన పొలంలో అక్రమంగా ప్రవేశించారని సత్యనారాయణ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

నాడు ఆర్భాటంగా జగనన్న కాలనీలు

- కనీస వసతులు కల్పించని వైసీపీ ప్రభుత్వం
- లబ్ధిదారులకు శాపంగా మారిన వైనం
- లక్షలు వెచ్చించి ఇళ్ల నిర్మాణాలు
- ఉండలేక.. వెళ్లలేక.. సతమతం

అద్దంకి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : కొత్త కాలనీలు కాదు.. కొత్తగా ఊర్లే ఏర్పడుతున్నాయి... వైసీపీ ప్రభుత్వం హయాంలో ప్రతి ఒక్క నేత నుంచి వచ్చిన మాటలు... అయితే ఇప్పుడు ఆయా కాలనీలలో పరిస్థితులు గమనిస్తే కనీసం చిట్టడవులను తలపించేలా ఆయా కాలనీలు ఉన్నాయి. నాయకుల మాటలు నమ్మి ఇళ్ల నిర్మాణం చేసుకున్న లబ్ధిదారుల బిక్కుబిక్కు మంటూ గడపాల్సిన పరిస్థితి ఏర్పడింది. వైసీపీ ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలు... అప్పటి అధికారుల ఒత్తిడి తట్టుకోలేక ఇళ్ల నిర్మాణం చేసుకున్న లబ్ధిదారుల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. లక్షల రూపాయలు వెచ్చించి ఇళ్ళ నిర్మాణం చేసుకున్న లబ్ధిదారులు కనీస వసతులు కూడా లేకపోవటం తో అక్కడ ఉండలేక... అక్కడ ఇంటిని వదిలి మరలా అద్దంకి పట్టణంలోకి వచ్చి అద్దె ఇళ్లల్లోకి రాలేక సతమతమవుతున్నారు. అప్పట్లో అధికారులు, ప్రజా ప్రతినిధుల మాటలు నమ్మి నిలువునా మోస పోయామని లబ్ధిదారులు లబోదిబో అంటున్నారు. అన్ని వసతులు కల్పన పూర్తయిన తరువాతనే లబ్ధిదారులు



అద్దంకి పట్టణ సమీపంలో వేలమూరిపాడు రోడ్డులో ఉన్న జగనన్న కాలనీలో రోడ్డు దుస్థితి



నాగులపాడు రోడ్డులో ఉన్న జగనన్న కాలనీలో ఆనవాళ్లు కూడా లేని రోడ్డు, పెరిగిన చిల్లచెట్లు

ఇళ్ల నిర్మాణం, గృహ ప్రవేశాలు జరుగుతాయని అధికారులు, ప్రజా ప్రతినిధులు చెప్పారు. ఆచరణలో మాత్రం పరిస్థితి వేరుగా మారింది. అధికారుల ఒత్తిడి తట్టుకోలేక లబ్ధిదారులు హడావుడిగా ఇళ్ల నిర్మాణం చేసుకున్నారు. అద్దంకి పట్టణంలో సుమారు 2వేల మంది లబ్ధిదారులకు బొమ్మనంపాడు రోడ్డు, వేలమూరిపాడు రోడ్డు, నాగులపాడు రోడ్డులలో లే అవుట్‌లు వేసి ఇళ్ల స్థలాలు కేటాయించారు. బొమ్మనంపాడు రోడ్డులో ఉన్న లేఅవుట్ అద్దంకి పట్టణానికి సుమారు 4కి.మీ దూరంలో ఉంది. సుమారు వెయ్యి మంది లబ్ధిదారులకు ప్లాట్లు కేటాయించారు. కనీస రవాణా వసతి కూడా లేదు. వర్షం పడితే కాలనీకి వెళ్లే పరిస్థితి కూడా లేదు. దీంతో ప్రస్తుతం 20 మంది లబ్ధిదారులు మాత్రమే నివాసం ఉంటున్నారు. దీంతో రాత్రి సమయంలో బిక్కుబిక్కు మంటూ గడుపుతున్నారు. అక్కడ ఉండలేక.... ఖాళీ చేసి రాలేక సతమతమవుతున్నారు. ఇక వేలమూరిపాడు, నాగులపాడు రోడ్డులలో ఉన్న లేఅవుట్‌లో ఎక్కువ మంది లబ్ధిదారులు నివాసం ఉంటున్నా కనీస వసతులు కల్పించలేదు. విద్యుత్ సౌకర్యం మినహా మిగిలిన ఎలాంటి కనీస వసతుల కల్పన జరగలేదు. కనీసం గ్రావెల్ రోడ్డు, సీసీ డ్రైన్‌లు, తాగునీటి వసతుల కల్పన కూడా లేకపోవడంతో నివాసం ఉంటున్న లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. చిన్నపాటి వర్షం పడ్డా కాలనీలలో నడిచే పరిస్థితి లేకుండా పోతుందని ఆందోళన చెందుతున్నారు. కనీసం సైడ్ డ్రైన్‌లు కూడా లేకపోవడంతో మురుగు ఇళ్ల ముందు నిలిచి పోతుంది. ఇక ఆయా కాలనీలకు వెళ్లే రోడ్లు కూడా అభివృద్ధికి నోచుకోలేదు. నాడు వైసీపీ పాలకులు చేసిన నిర్లక్ష్యం లబ్ధిదారులకు శాపంగా మారి ఇప్పటికీ నరకయాతన అనుభవించాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొత్త గ్రామాలు కాస్తా చిట్టడవులుగా మారాయని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఎన్టీఆర్ కాలనీలుగా మార్పుతో సరి

సార్వత్రిక ఎన్నికలలో వైసీపీ ఓటమి చెంది కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జగనన్న కాలనీల పేర్లనును ఎన్‌టీఆర్ కాలనీలుగా మార్పు చేశారు. అయితే ఆయా కాలనీలలో వసతుల కల్పనపై మాత్రం కూటమి ప్రభుత్వం ఇంకా దృష్టి పెట్టకపోవడంతో లబ్ధిదారుల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది.

ఒక్కో ఇంటి నిర్మాణానికి సుమారు 10 లక్షల నుంచి 12 లక్షల రూపాయల వరకు ఖర్చు అయింది. అందులో ప్రభుత్వం నుంచి 1.80 లక్షల రూపాయలు మాత్రమే వచ్చాయి. మిగిలిన డబ్బులు అప్పులు చేసి ఇళ్ల నిర్మాణం చేసుకున్నారు. దీంతో లక్షల రూపాయలు వెచ్చించి కట్టుకున్న ఇంటిని వదిలి రాలేక, వసతుల లేమి మధ్య ఉండలేక ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా కనీసం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వమైనా ఆయా కాలనీలలో కనీస వసతుల కల్పనపై దృష్టి పెట్టాలని లబ్ధిదారులు కోరుతున్నారు.



అద్దంకి పట్టణం సమీపంలో బొమ్మనంపాడు రోడ్డులో జగనన్న కాలని వ్యూ (ఫైల్)

బర్డ్ ఫ్లూ భయం

- తగ్గిన చికెన్, రెస్టారెంట్‌లో విక్రయాలు
- వెలవెలబోతున్న దుకాణాలు, బోరుమంటున్న వ్యాపారులు



ఫౌల్ట్రీ ఫారం

చీరాలటౌన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కాలంలో బర్డ్ ఫ్లూ ప్రచారం జోరందుకుంది. గతంలో నిత్యం రెస్టారెంట్‌లు, చికెన్ స్టాల్స్ విక్రయాలతో కళకళలాడేవి. నేడు ఆ పరిస్థితి లేదు. ప్రజల్లో భయాందోళన పెరిగిపోయింది. ఈక్ర



వెలవెలబోయిన చికెన్‌షాప్

అప్పులతో వ్యాపారాలు చేస్తున్నాం

ఇప్పటికే అప్పులు తెచ్చి వ్యాపారాలు చేస్తున్నాం. షాపులు అద్దెలు కట్టాలి. కుటుంబ అవసరాలు ఉన్నాయి. ఈక్రమంలో వ్యాపారాలు తగ్గడంతో అయోమయంగా మారింది.



- సాధిక్, చికెన్ షాపు నిర్వాహకుడు

మంలో చికెన్ వైపు చూడాలం టే ససేమిరా అంటూ భయపడుతున్నారు. అయితే దుకాణ దారులు వ్యాపారాలు లేక ఇంటి అద్దెలు, మెడికల్, ఈఎమ్‌ఐలతో సతమతమవుతున్నారు. గతంలో కోవిడ్ సమయంలో ఎందరో వ్యాపారులు కనమరుగయ్యారు. ఇప్పుడిప్పుడే అన్నీ సర్దుకున్నాయి. తాజాగా బర్డ్ ఫ్లూ కలకలం రేపుతుండడంతో బతుకుజీవుడా అంటున్నారు. ఒక్కో చిన్న చికెన్ షాపులో గతంలో 70-100 కేజీల చికెన్ విక్రయాలు జరిగేవి. అప్పట్లో ధర రూ.280, రూ.300 వరకు ఉంది. కానీ ప్రస్తుతం ధర రూ.200 ఉండగా 10-15 కేజీల విక్రయాలు జరపడం గగనంగా మారింది. మరోవైపు అధికారులు మన జిల్లాకు ప్రస్తుతం ఇబ్బంది లేదని, ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని చెప్తున్నారు. కానీ ప్రజల్లో ఆందోళన నెలకొనడంతో వ్యాపారాలు వెలవెల బోతున్నాయి.

మొక్కల పెంపకంపై విద్యార్థుల్లో మక్కువ పెంచాలి

చీరాలటౌన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : మొక్కలు పెంపకంపై విద్యార్థుల్లో మక్కువ పెంచాలని అప్పుడే పర్యావరణంలో సానుకూల మార్పులు చోటుచేసుకుంటాయని రాష్ట్ర నేషనల్ గ్రీన్ కోర్ సంచాలకులు స్రవంతి అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా గురువారం నియోజకవర్గ పరిధిలోని పలు పాఠశాలలను ఆమె సందర్శించారు. ఈసందర్భంగా విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. ఎకో క్లబ్‌ల ద్వారా విద్యార్థులు పర్యావరణ పరిరక్షణ ప్రాజెక్టులకు సాధికారత కల్పిస్తామని చెప్పారు. పాఠశాలల ప్రాంగణాల్లోని మొక్కలను పరిశీలించి నీళ్లు పోశారు. కార్యక్రమంలో జిల్లా నేషనల్ గ్రీన్‌కోర్ కోఆర్డినేటర్ పవని భానుచంద్రమూర్తి, ప్రాజెక్టు అధికారి సత్యనారాయణ, ఎకో క్లబ్ కన్వీనర్‌లు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మొక్కలకు నీళ్లు పోస్తున్న రాష్ట్ర నేషనల్ సంచాలకులు స్రవంతి

ప్రేమానుబంధం

(5వ పేజీ తరువాయి)

ధ్రువాలుగా మారిపోతున్నారు. సినిమాల్లో చూపించే ప్రేమ సన్నివేశాలను చూసి వాటినే ప్రేమని భ్రమించి చిన్నారులు కూడా తప్పుదారి పడుతున్నారు. బాల్యంలో ఏర్పడే నిర్మలమైన, నిష్కల్మషమైన ఇష్టాన్ని ఈ అపసవ్య ప్రేమలు ఆక్రమిస్తున్నాయి. ఫలితంగా స్కూలు వయసులోనే చిన్నారులు ప్రేమ వలలో చిక్కి విలవిలలాడుతున్నారు.

లక్ష్యాల ఛేదనతోనే ప్రేమ గమ్యం!

చదువుకునే వయసులో ప్రేమలో పడితే ఇక జీవితం అంతే! ప్రేమ మాధుర్యాన్ని ఆస్వాదనలో మునిగిపోతే భవిష్యత్తు అంధకారమే! అందుకే ప్రేమ అనే గమ్యస్థానం చేరాలనుకునే యువకులు ఎన్నో లక్ష్యాలను ఛేదించుకుంటూ ముందుకు సాగాలి. తొలిగా జీవితాన్ని గెలవాలి. అందుకోసం తనకు తానుగా నిర్ణయించుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలి. ఒక వేళ ప్రేమలో పడినా.. దాన్ని జీవితాన్ని నిర్మించుకునే ప్రస్థానంగా మలుచుకోవాలి. యువతరం.. నవతరం.. తమ లక్ష్యాలను ఛేదించుకుంటూ.. ప్రేమ గమ్యస్థానం చేరుకోవాలి.

22 ఏళ్లు ప్రేమమయం..

ప్రేమకు మూడు సూత్రాలు అనివార్యం. అభిప్రాయాలకు విలువ ఇచ్చుకుని గౌరవించుకోవడం.. ఒకరిని ఒకరు అర్థం చేసుకోవడం.. ఒకరిపట్ల ఒకరు ఓపికగా వ్యవహరించడం.. ఈ మూడూ ఉంటేనే ఆ ప్రేమ బతుకుతుంది. తల్లిదండ్రులు-బిడ్డల మధ్య ఈ మూడు అంశాలు స్పష్టంగా ఉంటాయి. అందుకే ఎన్ని ఇబ్బందులు వచ్చినా ఆ అనుబంధం తెగిపోదు. ప్రతి ఒక్కరి జీవితంలో ఫస్ట్ లవ్ అనేది వారి తల్లిదండ్రుల వద్దే మొదలవుతుంది. అది నిస్వార్థమైన ప్రేమ. యువతీ యువకుల మధ్య ఉండే ప్రేమ కూడా అలా ఉండాలి. 2003లో దగ్గరైన మేము 2005లో ఒక్కటయ్యాం! ఆనాటి నుంచీ ఈనాటి వరకూ మా 22 ఏళ్ల పయనం ఎన్ని ఆటంకాలు వచ్చినా ప్రేమమయంగానే సాగింది. రెండు దశాబ్దాల మా పయనంలో అపోహలు, అపార్థాలు రాకుండా ఉంటాయా? కానీ వాటిని ఓపికతో అర్థం చేసుకుని పరిష్కరించుకుంటూ ముందుకు సాగాం. కుల సమస్య కావచ్చు, ఆర్థిక సమస్యలు కావచ్చు.. పెద్దల అయిష్టత కారణంగా మా కుటుంబాల నుంచి తొలినాళ్లలో ఎదురైన ఇబ్బందులు కావచ్చు.. ఓపికతో ఎదుర్కొన్నాం. జీవితంలో ఎదురైన ప్రతీ కష్టం మా బంధాన్ని మరింత ఘాడపరిచింది.

- గల్లా మాధవి, రామచంద్రరావు

మారుతోన్న అభిప్రాయం

గతంతో పోలిస్తే యువతలో ప్రేమపై అభిప్రాయం మారుతోంది. పూర్తిగా కంఫర్ట్ జోన్‌లో ఉండాలనుకుంటున్నారు. దీనికోసం కుటుంబ బంధాలను కూడా కాదనుకుంటున్నారు. తల్లిదండ్రుల నుంచి వచ్చే ఫిర్యాదులలో ఎక్కువశాతం సోషల్ మీడియాకు సంబంధించినవే ఉంటున్నాయి. మనం కోరుకున్నది మన చెంతకు చేరాలంటే కెరీర్‌పరంగా, కుటుంబ పరంగా అందరి ఆమోదం అవసరమే. కాకపోతే గతంతో పోలిస్తే ప్రేమ విషయంలో కుల, మతాల పట్టింపుల విషయంలో తల్లిదండ్రుల ఆలోచనాతీరు మారుతుండడం శుభపరిణామం

- షేక్. నజీర్, బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్

మంచి.. చెడు రెండూనూ

ప్రేమ అనేది రెండు వైపులా పదును ఉన్న ఆయుధం వంటిది. పూర్తి స్థాయిలో ఒకరికొకరు అర్థం చేసుకుంటే బాగుంటుంది. ఉదాహరణకు ఓ చెడ్డ అలవాటును ఎవరు చెప్పినా మార్చుకోని వ్యక్తి ప్రేమ వల్ల దానికి దూరంగా జరగవచ్చు. కెరీర్‌లో ఎదగడానికి తనే ప్రేరణగా ఉండవచ్చు. కానీ ఇదే సమయంలో అమ్మాయి తిరస్కరిస్తే జీవితమే లేదనుకుని చెడు వ్యసనాలకు బానిసవుతున్న వారు ఎందరో ఉన్నారు.

- డి. కార్తీక్, ఈసీ ఫైనలియర్ స్టూడెంట్

రెండూ బ్యాలెన్స్ చేసుకోగలగాలి

చదువుకునే వయసులో ప్రేమలో పడడం తప్పేమికాదు. కాకపోతే రెండింటిని బ్యాలెన్స్ చేసుకునే పరిపక్వత ఉండాలి. అదే సమయంలో తల్లిదండ్రులను ఒప్పించే ఏ విషయంలో అయినా ముందడుగు వేయాలి. ఒకరి అభిప్రాయంతో మరొకకు ఏకీభవించాల్సిన అవసరమేమి లేదు. ఎదుటి వారి ఇష్టాయిష్టాలను కూడా గౌరవించాలి

- ఎం. వందన, ఈఐఈ, ఫైనలియర్ విద్యార్థిని



శ్రీనివాసులును అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు

జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో అధ్యాపకుడి ప్రతిభ

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో అద్దంకిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పని చేస్తున్న అధ్యాపకుడు ప్రతిభ చూపారు. పాలిటెక్నిక్ కళాశాలలో సాధారణ శాఖాధిపతిగా పని చేస్తున్న డాక్టర్ తాడికొండ శ్రీనివాసులు ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు రాజస్థాన్‌లో జరిగిన 44వ నేషనల్ మాస్టర్ అథ్లెటిక్స్ ఓపెన్ చాంపియన్‌షిప్-2025లో ఆంధ్రప్రదేశ్ తరపున పదివేల మీటర్లు పరుగు పందెంలో మూడవ స్థానం సాధించి కాంస్య పతకాన్ని పొందారు. ఈ సందర్భంగా గురువారం కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది ఘనంగా సత్కరించి అభినందించారు. శ్రీనివాసులు సాధించిన విజయం రాష్ట్రానికి, కళాశాలకు ఎంతో గర్వకారణమని, భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీవో ఝాన్సీ

చినగంజాం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కడవకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంకొల్లు ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ్ బీ, పడాయి బీపై గురువారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పోషణ్ బీ, పడాయి బీపై గురువారం నుండి శనివారం వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఇంకొల్లు సెక్టారు సీడీపీవో టి.ఝాన్సీ తెలిపారు. మొదటి రోజు పడాయి బీపై అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. పడాయి శిక్షణలో భాగంగా ఐదు రకాల అభివృద్ధిలో అంగన్‌వాడీల యొక్క అభివృద్ధిలకు సంబంధించి శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్.ఎం. కుర్రా రామారావు, సూపర్‌వైజర్లు వాణిశ్రీ, సుమలత, ఉషాకుమారి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

జ్యోతయ్య చిరస్మరణీయుడు

అద్దంకి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : మిలటరీ ఉద్యోగిగా దేశ సేవ చేసి పదవీ విరమణ చేసి సామాజిక సేవకు అంకితమైన పంతంగి జ్యోతయ్య చిరస్మరణీయుడు అని రిటైర్డ్ మిలటరీ ఉద్యోగి, యోగా గురువు శేషారెడ్డి అన్నారు. పంతంగి పెద జ్యోతయ్య సంస్మరణ సభ గురువారం స్థానిక పోలీస్ స్టేషన్ ఎదురు ఉన్న స్వగృహం వద్ద జరిగింది. ఈ సందర్భంగా పలు సాహితీ సంస్థల ప్రతినిధులు హాజరై జ్యోతయ్య చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ నిత్యం పేదలకు సేవ చేసేందుకు పరితపించిన జ్యోతయ్య పేదల జీవితాలలో వెలుగులు నింపారన్నారు. నర్రావారిపాలెం శ్మశాన వాటికకు జ్యోతయ్య శాంతివనంగా మార్చాలని పలువురు సూచించారు. కార్యక్రమంలో పలు సాహితీ సంస్థల ప్రతినిధులు దివాకర్ దత్, తాళ్లూరు వెంకటసుబ్బయ్య, మన్నం త్రిమూర్తులు, చప్పిడి వీరయ్య, భద్రయ్య మలాది శ్రీనివాసరావు, చుండూరి మురళీసుధాకర్, రఫీ, కావూరి రఘుచంద్, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, పంతంగి ఆంజనేయులు, ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.



జ్యోతయ్యకు నివాళులు అర్పిస్తున్న సాహితీ సంస్థల ప్రతినిధులు

రైతులకు తీపిని పంచుతున్న నల్ల చెరకు

- ఈ ఏడాది మంచి డిమాండ్
- పెట్టుబడులు పోను ఎకరాకు రూ.2లక్షల పైనే ఆదాయం
- బల్లికురవ మండలంలో 200 ఎకరాల్లో సాగు
- ఇతర ప్రాంతాల నుంచి వ్యాపారులు వచ్చి కొనుగోలు



కూకట్లపల్లిలో సాగు చేసిన నల్ల చెరకు



చెరకు గడలకు ఉన్న ఆకును తొలగిస్తున్న కూలీలు

బల్లికురవ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది నల్ల చెరకు సాగు చేసిన రైతులు లాభాలబాటలో ఉన్నారు. పెట్టుబడులు పోను ఎకరాకు రెండు లక్షల వరకు ఆదాయం వస్తుంది. చెరకు సాగు చేసిన రైతుల్లో ఆనందరం వెల్లివిరుస్తోంది. వ్యాపారులు సైతం గ్రామాలకు వచ్చి చెరకు గెడలను కొనుగోలు చేసి వెళుతుండడంతో రైతులకు కూడా పెద్ద ఇబ్బంది లేదు. గత ఏడాది ధరలు కొంత వెనకంజ వేయగా ఈ ఏడాది మాత్రం మంచి డిమాండ్‌తో కొనుగోళ్లు జరుగుతున్నాయి. తాము చెరకు పంటను నమ్ముకొని సాగు చేస్తున్నామని, ధరలు అశాజనకంగా ఉన్నాయని రైతులు అంటున్నారు.

బల్లికురవ మండలం అంటే జనవరి నుంచి నల్ల చెరకు పంటకు కేరాఫ్‌గా మారుతుంది. మండలంలోని కూకట్లపల్లి, గొర్రెపాడు గ్రామాలలో ఎన్నో ఏళ్ల నుంచి రైతులు నల్ల చెరకును సాగు చేస్తున్నారు. ఈ ఏడాది అ గ్రామాలను చూసి అంబడిపూడి, వైదన, కొత్తూరు, వెలమవారిపాలెం తదితర గ్రామాలలో కూడా రైతులు చెరకు పంట వైపు ఆసక్తిని చుపారు. మండలంలో మెత్తం 200 ఎకరాల్లో రైతులు గత ఏడాది ఏప్రిల్‌లో నల్ల చెరకు సాగు చేశారు. బోరు బావుల నీరు అందుబాటులో ఉన్న రైతులకు చెరకు పంట తీపిని పంచింది. రైతులు పండించిన నల్ల చెరకు కోతలు గత పదిహేను రోజుల నుంచి ఊపందుకున్నాయి. రైతుల వద్దకు వైజాగ్, విజయవాడు, కాకినాడ, భీమవరం, నంద్యాల, అత్మకూరు, కలిదిండి, ఏలూరు, కడప తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులు వచ్చి నల్ల చెరకును కొనుగోలు చేస్తున్నారు. ఎకరా చెరకు పంటను రూ.4 లక్షల వరకు కొనుగోలు చేస్తున్నారు. ఎకరా చెరకు తోటలో 25వేల నుంచి 30వేల వరకు గెడల దిగుబడి వస్తున్నాయి. వ్యాపారులు గెడలను కొట్టించుకొని లారీలలో తరలిస్తున్నారు. రుచిగా, తీపిగా చెరకు గెడలు బహిరంగ మార్కెట్‌లో ఒకటి రూ.40కి వ్యాపారులు విక్రయిస్తున్నారు. ఎన్నో ఏళ్ల నుంచి నల్ల చెరకు సాగుకు బల్లికురవ మండలం ప్రసిద్ధి చెందడంతో వ్యాపారులు కూడా సీజన్ వస్తే నేరుగా వస్తున్నారని రైతులు తెలిపారు.

చెరకు సాగుకు పెట్టుబడులు ఇలా

ఎకరంలో నల్ల చెరకు సాగు చేయాలంటే రైతులు ముందుగా ఎకరాకు విత్తనపు చెరకు ముక్కలు 12 వందలు నాటుతారు. ఒక గెడ రూ.10 వెచ్చించి తెస్తారు. పెట్టుబడులు పోయి గెడలు కొట్టుడుకు వచ్చే సమాయానికి రూ.2లక్షల వరకు రైతులకు ఖర్చులు అవుతాయి. ఎకరం చెరకు సాగుకు కౌలు కూడా రూ.40వేల వరకు పలుకుతుంది. రైతులు ఎకరా రూ.4లక్షలకు వ్యాపారులకు అమ్మకాలు చేస్తున్నారు. ఏడాది కాలంలో చెరకు సాగు పూర్తి అయి అమ్మకాలు పూర్తి అవుతాయి. రిటైల్‌గా అయితే రైతులు తోటల వద్ద ఒక గెడ రూ.30కి అమ్మకాలు చేస్తున్నారు. అదే వ్యాపారులు అయితే ఒక గెడ రూ.40కి అమ్మకాలు చేస్తున్నారు.

రెండు గ్రామాల్లో అధికం

బల్లికురవ మండలంలోని కూకట్లపల్లి, గొర్రెపాడు గ్రామాలలోనే గత రెండు దశాబ్దాల నుంచి రైతులు నల్ల చెరకు సాగు చేస్తున్నారు. నష్టాలు వచ్చిన లాభాలు వచ్చినా రైతులు చెరకును పండిస్తుంటారు. మెదట్లో వ్యాపారులు వచ్చి కొనుగోలు చేయని సమయంలో రైతులే నేరుగా తిరునాళ్లకు తీసుకెళ్లి అమ్మేవారు. అయితే మంచి రుచి, నాణ్యమైన చెరకు దిగుబడి అవుతుండడంతో వ్యాపారులే నేరుగా వచ్చి కొంటున్నారని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ రెండు గ్రామాలలో సాగును చూసిన పక్కపక్క గ్రామాల్లో కూడా అడపాదడపా సాగు చేస్తున్నారు.

ఈ ఏడాది మంచి లాభాలు



తాను ఒకటిన్నర ఎకరంలో నల్ల చెరకును సాగు చేశాను. ఎకరా కౌలు రూ.40వేలు చెల్లించి సాగు చేశాను. రూ.2 లక్షల వరకు పెట్టుబడులు పెట్టాను. రూ.4లక్షలకు ఎకరం చెరకు అమ్మాను. ఎకరాకు రెండు లక్షల ఆదాయం వచ్చింది. ఇతర ప్రాంతాల నుంచి వ్యాపారులు వచి కొనుగోలు చేస్తున్నారు.

- పులి దావీదు, రైతు కూకట్లపల్లి

ఎకరానికి కౌలు రూ.40వేలు చెల్లిస్తున్నాం



నల్ల చెరకు సాగు చేసే భూములకు ఎకరాకు రూ.40వేలు కౌలు చెల్లిస్తున్నాం. ఎకరాకు 12 వందల నుంచి 2వేల చెరకు మొక్కలను నాటతాం. ఏడాది సమయంలో చెరకు సాగు, అమ్మకాలు పూర్తి అవుతాయి. గత ఏడాది కంటే ఈ ఏడాది అమ్మకాలకు డిమాండ్ ఉంది.

- బొంతు సాల్, ఎస్సీ రైతు, కూకట్లపల్లి

ఐదు ఎకరాల చెరకును కొనుగోలు చేశాను



తానే కూకట్లపల్లి గ్రామంలో రైతుల వద్ద ఐదు ఎకరాల నల్ల చెరకును కొనుగోలు చేశాను. ఎకరాకు రూ.4లక్షలు చెల్లించాను. తానే చెరకు గెడలను కొట్టించి రిటైల్‌గా అమ్మకాలు చేస్తాం. ఒక గెడ రూ.40 వంతున అమ్మకాలు చేస్తాం, ఎన్నో ఏళ్ల నుంచి చెరకును కొనుగోలు చేస్తున్నాను.

- కె.మురళి, చెరకు వ్యాపారి, విశాఖపట్నం



కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీవో గ్లోరియా, తహసీల్దార్ రవికుమార్

పూనూరులో రీసర్వే వేగవంతం చేయాలి

యద్దనపూడి, (మార్టూరు) ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : యద్దనపూడి మండలం పూనూరు గ్రామంలో జరుగుతున్న రీ-సర్వే కార్యక్రమం వేగవంతంగా చేయాలని, మార్చి మొదటివారానికి పూర్తి చేయాలని ఆర్డీవో గ్లోరియా అధికారులను ఆదేశించారు. గురువారం ఆర్డీవో యద్దనపూడి తహసీల్దారు కార్యాలయానికి వచ్చారు. మండలంలో పైలెట్ ప్రాజెక్ట్ కింద పూనూరు గ్రామంలో జరుగుతున్న రీసర్వే వివరాలను తహసీల్దారు కే రవి కుమార్‌తో పాటు మిగిలిన అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ పూనూరులో 4952 ఎకరాలు పొలాలు విస్తీర్ణం ఉండగా వాటిలో 1400 ఎకరాల రీసర్వే పూర్తయిందన్నారు. గ్రామంలో ప్రత్యేకంగా 4 బృందాలు రీసర్వే చేస్తున్నారన్నారు. అందుకు సంబంధించి కొన్ని రికార్డులను గ్లోరియా పరిశీలించారు. త్వరితంగా ప్రజలకు, రైతులకు ఇబ్బందిలేకుండా ఎలాంటి లోటుపాట్లు లేకుండా రీ-సర్వేను పూర్తి చేయాలని ఆమె చెప్పారు. కార్యక్రమంలో బాపట్ల నుంచి వచ్చిన డీఐ శ్రీనివాసరావు, రీసర్వే డీటీలు మస్తానరావు, విష్ణు, పాల్గొన్నారు.

మద్యం మత్తులో యువకుల గొడవ

మార్టూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : మద్యం సేవిస్తూ బుధవారం అర్ధరాత్రి కొణిదెన రోడ్డులో కొంతమంది యువకులు గొడవ చేసిన ఘటన జరిగింది. అందిన సమాచారం మేరకు.. మార్టూరు గ్రామానికి చెందిన కొంతమంది యువకులు కొణిదెన రోడ్‌లో మద్యం సేవించారు. అనంతరం రోడ్డుపై అరుపులు, కేకలు వేసుకుంటూ అదేమిటని అడిగిన మహిళపై కూడా భౌతికదాడి చేసినట్లు తెలిసింది. అనంతరం వారు కొణిదెన రోడ్డు వద్ద మద్యం సేవిస్తుండగా గస్తీ పోలీసులు వారిని అక్కడ నుంచి పంపించి వేసినట్లు తెలిసింది. కొణిదెన రోడ్‌లో మద్యం దుకాణాలు ఉండడంతో యువకులు మద్యం కొనుగోలుకు వెళ్లిన సమయంలో ఈ గొడవ జరిగినట్లు తెలిసింది. ఈ విషయమై గురువారం సీఐ ఎం.శేషగిరిరావును ఆంధ్రజ్యోతి వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు. అయినా పూర్తి స్థాయిలో విచారణ చేపడతామన్నారు.

యద్దనపూడి మండలంలో విద్యుత్ అధికారుల తనిఖీలు



సమావేశంలో మాట్లాడుతున్న బాపట్ల ఎస్ఈ ఆంజనేయులు, విజిలెన్స్ డీఈఈ మల్లికార్జునరావు, అద్దంకి ఈఈ మస్తానరావు

యద్దనపూడి, (మార్టూరు) ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : యద్దనపూడి మండలంలో విద్యుత్ అధికారుల బృందాలు గురువారం గ్రామాలలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో 43 విద్యుత్ సర్వీసులకు చెందిన వారు విద్యుత్ అధిక లోడు వినియోగిస్తున్నారని వారికి 1 లక్షా 23 వేల రూపాయలను పెనాల్టీగా విధించినట్లు బాపట్ల ఏపీసీపీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ జీ ఆంజనేయులు తెలిపారు. గ్రామాలలో విద్యుత్ అధికారుల బృందాలు తనిఖీలు నిర్వహించిన తర్వాత యద్దనపూడి విద్యుత్ కార్యాలయం వద్ద అధికారులతో కలిసి ఎస్ఈ ఆంజనేయులు విద్యుత్ వినియోగదారులతో మాట్లాడారు. దొంగతనంగా విద్యుత్‌ను వినియోగించడం, అక్రమ పద్ధ తులు ద్వారా విద్యుత్‌ను వినియోగించాలనుకోవడం నేరమన్నారు. నెలవారీ బిల్లు లు వెంటనే చెల్లిస్తే పెనాల్టీలే ఉండవన్నారు. కరెంటు మీటర్లు లేని వారు దరఖాస్తు చేసుకుంటే వెంటనే వారికి మీటరును అందచేస్తామన్నారు. అదేవిధంగా ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకాన్ని అందరూ వినియోగించుకోవాలన్నారు. తద్వారా విద్యుత్ బిల్లులు తగ్గుతాయన్నారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ డీఈ మల్లికార్జునరావు, అద్దంకి ఈఈ మస్తానరావు, యద్దనపూడి ఏఈ టీ సురేష్ బా బు, పలువురు విద్యుత్ ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న అధికారి, పక్కన ఎంపీపీ, ఎంపీడీవో, డీటీ

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులకు అందించడంతో పాటు గ్రామాలలో జరుగుతున్న అభివృద్ధి పనులు త్వరతగితన పూర్తయ్యేలా చూడాలని ఎంపీడీవో బత్తిని సింగయ్య అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశపు హాల్‌లో మండల ప్రజా పరిషత్ సాధారణ సమావేశం ఎంపీపీ ఏ.జ్యోతి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సమావేశానికి పలు శాఖల అధికారులు హజరై పథకాల గురించి వివరించారు. సాధారణ సమావేశం వచ్చామా, వెళ్లామా అన్నట్లుగా సాగింది. సమావేశంలో కొందరు ఎంపీటీసీ సభ్యులు కనిపించకపోయినా వారి తరపున షాడోలు మాత్రం ప్రత్యక్షమయ్యారు. సంతకాలు చేసి వెళ్లేవరకే వారి బాధ్యతగా నిర్వహించారు. సమావేశంలో డిప్యూటీ తహసిల్దార్ సురేషబాబు పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన

మార్టూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : మర్టూరు లోని వీఎస్ఆర్ అండ్ ఏఎం డిగ్రీ కళాశాలలో గురువారం దిశా హెల్ప్ స్వచ్ఛంద సంస్థ టీఐ ఆధ్వర్యంలో విద్యార్థులకు హెచ్ఐవీ ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ వీరగంధం శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ రావి అంకమ్మ చౌదరి, ప్రాజెక్టు డైరెక్టర్ సాగర్ పాల్గొన్నారు.

పోతుకట్లలో చోరీ

పోతుకట్ల (పర్చూరు), ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పోతుకట్ల గ్రామంలో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన గండికోట బాజీ ఇంటికి తాళం వేసి పొలం పనులకు వెళ్లారు. బుధవారం సాయంత్రం ఇంటికి వచ్చి చూసే సరికి తాళం తీసి ఉండడాన్ని గుర్తించారు. వెంటనే లోపలికి వెళ్లి చూడగా బీరువా తాళం తీసి అందులో ఉన్న 10గ్రాముల బంగారు వస్తువులు దొంగిలించినట్లు చూసి ఆందోళన చెందారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆ ఇంటిని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మాల్యాద్రి తెలిపారు.

నాణ్యమైన బోధనకే నూతన విద్యా విధానం



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ రవినాయక్

బల్లికురవ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం గ్రామాలలో ఉన్న పాఠశాలల్లో నూతన విద్య విధానాన్ని అమలులోకి తెచ్చిందని ఉపాధ్యాయులందరూ విద్యార్థుల హాజరు శాతం పెరిగేలా పనిచేయాలని తహసీల్దార్ రవి నాయక్ పేర్కొన్నారు. గురువారం స్థానిక విద్యా వనరుల కేంద్రంలో పాఠశాలల అప్‌గ్రేడ్‌లపై మండల స్థాయి కమిటీలో ఉన్న ఎంపీడీవో కుసుమకుమారి, తహసీల్దార్ రవినాయక్, ఎంఈవోలు వస్త్రంనాయక్, రమేష్ అన్ని పాఠశాలల హెచ్ఎంలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మండలంలో విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా పాఠశాలలను మెడల్ పాఠశాలలుగా ఎంపిక చేస్తున్నామని తెలిపారు. నూతన హైస్కూల్స్ కోసం ప్రతిపాదనలు పంపామని స్థలాలను వెంటనే చుసి పెట్టాలని హెచ్ఎంలను వారు కోరారు. రానున్న విద్యా సంవత్సరంలో విద్యార్థులు ప్రభుత్వ బడిలో చేరేలా ఇప్పటి నుండే ఉపాధ్యాయులు గ్రామాలలో ప్రత్యేక క్యాంపెయిన్ చేయాలని కోరారు.

కొప్పెరపాడు పాఠశాలలో తనిఖీ

మండలంలోని కొప్పెరపాడు గ్రామంలో ప్రాథమిక పాఠశాల (హెచ్ఈ), ఎస్టీ కాలనీ పాఠశాలను ఎంఈవో వస్త్రం నాయక్ గురువారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా పాఠశాలలో విద్యార్థుల రోల్‌ను పరిశీలించి రానున్న ఏడాదికి విద్యార్థుల రోల్ పెరిగితే మోడల్ స్కూల్‌గా ఎంపిక చేస్తామని తెలిపారు.



పనులను పరిశీలిస్తున్న డా.మహేంద్రనాథ్

తాగు నీటికి ఇబ్బంది లేకుండా చూడండి

డా.మహేంద్రనాథ్

చీరాలటౌన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : చీరాల నియోజకవర్గంలో ప్రజలకు, రైతులకు సాగు, తాగు నీటికి ఇబ్బంది లేకుండా చూడాలని టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి డా.మహేంద్రనాథ్ అన్నారు. కారంచేడు సమీపంలోని కొమ్మమూరు కాలువ నుంచి చీరాలకు వచ్చే పైప్‌లైన్ మరమ్మతులను గురువారం అధికారులతో కలిసి మహేంద్రనాథ్ పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రానున్న వేసవికి నీటి ఎద్దటి లేకుండా చూడాలన్నారు. పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. పారిశుధ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పనుల్లో నిరక్ష్యం లేకుండా చూడాలని మహేంద్రనాథ్ సూచించారు. కార్యక్రమంలో మునిసపల్ డీఈ పరంధామయ్య, పలువురు అధికారులు పాల్గొన్నారు.

కార్డున్న ప్రతి కుటుంబానికీ రేషన్ అందాలి



ముప్పవరంలో రేషన్ షాపును తనిఖీ చేస్తున్న అధికారులు

పంగులూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : రేషన్ కార్డుఉన్న ప్రతి కుటుంబానికి నిర్ణీత వ్యవధిలో రేషన్ అందచేయాలని మండల తహసీల్దార్ పి.సింగారావు, పర్చూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ గీతారాణి అన్నారు. మండలంలోని ముప్పవరం గ్రామంలో గురువారం 11, 12 నెంబర్ రేషన్ షాపులలో రెవెన్యూ అధికారులు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. రికార్డులను, నిల్వ ఉన్న స్టాక్‌ను పరిశీలించారు. రేషన్ పంపిణీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. తనిఖీలో మండల ఆర్ఐ శ్వేత, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బర్లీ కొనుగోలుకు చర్యలు చేపట్టండి

రైతు సంఘం విజ్ఞప్తి

పంగులూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : నల్లబర్లీ కొనుగోలుకు ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు విజ్ఞప్తి చేశారు. మిరప, శనగ సాగులో నష్టాలను చవిచూసిన రైతులు గత ఏడాది బర్లీ ధరలు ఆశాజనకంగా ఉండడంతో పొగాకు సాగుకు మొగ్గు చూపారన్నారు. అద్దంకి, పర్చూరు నియోజకవర్గాల పరిధిలో షుమారు 90వేల ఎకరాలలో బర్లీ పొగాకు సాగు చేశారన్నారు. దీనిలో నల్లబర్లీ సాగు అధికంగా ఉందని, పొగాకు దిగుబడులు రైతుల వద్దకు చేరుకున్నా కంపెనీలు కొనుగోలు ప్రారంభించక పోవడంతో రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మార్కెట్లో సరైన ధర లభించే పరిస్థితి లేదనే ఆందోళనలో ఉన్న రైతుల స్థితిని దళారులు సొమ్ము చేసుకునే పరిస్థితి నెలకుందన్నారు. ప్రభుత్వం నల్ల బర్లీ సాగు చేసిన రైతులను ఆదుకునే విదంగా తగిన చర్యలు చేపట్టాలని కోరుతూ మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డికి రైతులతో కలసి గురువారం వినతిపత్రం అందచేవారు.

గైర్హాజరైన అధికారులకు మెమోలు

యద్దనపూడి, (మార్టూరు) ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : మండల సర్వసభ్య సమావేశానికి హాజరుకాని 7శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులకు గురువారం ఎంపీడీవో లక్ష్మీనారాయణ మెమో నోటీసులు జారీ చేశారు. బుధవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఆరోగ్యం, విద్యుత్, వ్యవసాయం, పంచాయతీరాజ్, పోలీస్, రోడ్లు రహదారులు, ఆర్టీసీ శాఖలకు చెందిన అధికారులు హాజరుకాలేదు. దాంతో సంబంధిత అధికారులకు మెమోలు జారీ చేశారు.

చిన్నారులకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం



పోషణ్‌బీపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

బల్లికురవ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందిస్తున్నామని సంతమాగులూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో సుధ పేర్కొన్నారు. గురువారం మండలంలోని కొప్పెరపాడు ఉన్నత పాఠశాలలో 40 మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ్‌బీ పఢాయిబీపై శిక్షణ తరగతులు జరిగాయి. ఈసందర్భంగా పలువురు కార్యకర్తలు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. చిన్నారులకు కేంద్రాల ద్వారా అందుతున్న వసతులను వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సలోమి, విజయనిర్మల పాల్గొన్నారు.

అద్దంకిటౌన్ : అంగన్‌వాడీ కార్యకర్తలకు గురువారం అద్దంకి పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో పోషణ్ బీ, పఢాయిబీపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కె.రమాదేవి, బీ ఇందిరమ్మ శిక్షణ ఇచ్చారు. 0 నుంచి 6 సంవత్సరాల లోపు పిల్లలకు పోషణతో పాటు విద్యను అందించడం, పిల్లల అభివృద్ధి, సంరక్షణ విద్య గురించి వి వరించారు. 0-3 సంవత్సరాల చిన్నారులకు నవ చేతన విద్యా విధానం, 3-6 సంవత్సరాల పిల్లలకు ఆదర్శ శీల విద్యా విధానాలను గురించి పీబీ ప్రోగ్రాం ద్వారా అందించారు. కార్యక్రమంలో మండలంలోని 90 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మృతి చెందిన మహిళ గుర్తింపు


ఆమె వేటపాలెం బండ్ల బాపనయ్య కళాశాల లెక్చరర్



సౌజన్య (ఫైల్)

వేటపాలెం(చీరాలటౌన్), ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : రైలు ప్రమాదంలో గత రెండు రోజుల కిందట మృతి చెందిన మహిళను చీరాల రైల్వే పోలీసులు గుర్తించారు. ఆమె వేటపాలెంకు చెందిన బొజ్జగాని సౌజన్య(48). ఈమె స్థానిక బండ్ల బాపనయ్య జూనియర్ కళాశాలలో కామర్స్ లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. భర్త గతకొంత కాలం కిందట మృతిచెందగా, కుమార్తె విజయవాడలో లా కోర్స్ చేస్తుండగా, కుమారుడు ఇతర ప్రాంతంలో చదువుతున్నాడు. ఈక్రమంలో రోజులాగే వాకింగ్ నిమిత్తం ఇంటి నుంచి బయటకు వచ్చి పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందారు. మృతదేహానికి గురువారం పోస్ట్‌మార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. తల్లిదండ్రులను కోల్పోయిన బిడ్డలు విలపిస్తుండగా బంధువులు ఓదార్చారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు
శుక్రవారం 14 ఫిబ్రవరి 2025



సీఎం పర్యటన షెడ్యూలు ఖరారు

- రేపు కందుకూరులో 'స్వచ్ఛాంధ్ర' • పాల్గొననున్న చంద్రబాబు
- మార్కెట్ యార్డులో బహిరంగసభ • ప్రజలతో ముఖాముఖి

కందుకూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 15వ తేదీన పర్యటన ఖరార య్యింది. శని వారం ఉదయం 11 గంటలకు ఉండవల్లిలోని తన నివాసం నుంచి చంద్రబాబు హెలి కాప్టర్‌లో బయలుదేరి 11.45 గంట లకు కందుకూరులోని టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన హెలిపాడ్‌కు చేరుకుంటారు. ఆ తర్వాత 12.05 గంటలకు పట్టణంలోని దూబగుంట సమీపంలో ఏర్పాటు చేస్తున్న ఎంఆర్‌ఎఫ్ ఫెసిలిటీ సెంటర్‌కు (వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్)కు చేరుకుంటారు. అక్కడ మిషనరీని ప్రారంభిస్తారు.

• దూబగుంటలో స్వచ్ఛాంధ్ర

స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా దూబగుంట గ్రామంలో వీధులు, డ్రైనేజీలు శుభ్రం చేసే కార్యక్రమంలో సీఎం పాల్గొంటారు. ఈ సందర్భంగా పారిశుధ్యం ప్రాముఖ్యతపై గ్రామస్థులతో చంద్రబాబు ముఖాముఖి మాట్లా డతారు. ఎంపిక చేసిన మూడు గృహాలలో ఇంకు డుగుంతలను ప్రారంభిస్తారు. అనంతరం పార్కు కమ్ పాండ్‌ను సందర్శిస్తారు. మధ్యా హ్నం 12.50 గంటలకు వ్యవసాయ మార్కెట్ యార్డుకు చేరు కుంటారు. 1.30 గంటల వరకు విశ్రాంతి తీసు కుని సభావేదికకు చేరుకుం టారు. బహిరంగ సభలో మాట్లాడటంతోపాటు మున్సిపాలిటీలోని ప్రజలతో ముఖాముఖి మాట్లాడతారు. అనం తరం హెలిపాడ్‌కు చేరుకుని ఉండవల్లి లోని తన నివాసానికి చంద్రబాబు బయలుదేరి వెళతారు.



వ్యవసాయ మార్కెట్ యార్డులో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టరు ఆనంద్, పక్కన ఎస్పీ, ఎమ్మెల్యే, సబ్ కలెక్టరు తదితరులు

• ఏర్పాట్ల పరిశీలన

సీఎం పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లను గురువారం కలెక్టరు ఓ. ఆనంద్ ఎస్పీ కృష్ణకాంత్, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. దూబగుంటలో డ్రైనేజీలు, వీధులు శుభ్రం చేయనున్న ప్రాంతాలను, ఇంకుడు గుంతల ఏర్పాటుకు మోడల్‌గా ఎంపిక చేసిన మూడు నివాస గృహాలను పరిశీలించి ఆయా ప్రాంతాలలో చేపట్టాల్సిన చర్యలపై సబ్ కలెక్టరు శ్రీపూజ, మున్సిపల్ కమిషనర్ కె. అనూషలకు పలు సూచనలు చేశారు. గ్రామం ప్రవేశంలో ఉన్న కుంట వద్ద పాండ్ కమ్ పార్కు అభివృద్ధికి జరుగుతున్న ఏర్పాట్లను వారు పరిశీలించారు. అలాగే దూబగుంట సమీపంలో పొగాకు బోర్డుకు పడమర వైపు ఏర్పాటు చేస్తున్న వేస్ట్ ప్రాసెసింగ్ ప్లాంట్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం బహిరంగ సభ జరిగే వ్యవసాయ మార్కెట్ యార్డును సందర్శించి సభా వేదిక వద్ద చేయాల్సిన ఏర్పాట్లపై సూచనలు చేశారు.



మండేకాలం..!

- అగ్గిరేగితే బుగ్గిపాలేనా!? • జిల్లాలో అగ్నిమాపక కేంద్రాల కొరత

అగ్నిమాపక శాఖలో ఈ వాహనం పేరు మిస్ట్ వెహికల్. వీవీఐపీలు, వీఐపీల కాన్వాయ్‌లో ఈ వాహనం తప్పనిసరిగా ఉండాలి. అంత ముఖ్యమైన వాహనం మరమ్మతుకు గురై ఇదిగో ఇలా నెల్లూరులోని అగ్నిమాపక స్టేషన్‌లో ఓ మూలకు చేరింది. గురువారం నుంచి పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పర్యటన సందర్భంగా కాన్వాయి కోసం ప్రకాశం జిల్లా కేంద్రమైన ఒంగోలు నుంచి మిస్ట్ వెహికల్‌ను తెప్పించాల్సి వచ్చింది. ఈ నెల 15వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కందుకూరుకు రానున్నారు. మరి అక్కడి కాన్వాయ్ కోసం అగ్నిమాపక యంత్రాన్ని ఎక్కడ నుంచి తెప్పించాలో అర్థంకాక ఆ శాఖ అధికారుల్లో మదనపడుతున్నారు.

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): వేసవి రాకముందే ఎండలు మండిపోతున్నా యి. రాత్రిపూట మంచుతో కూడిన చలిగాలులు వీస్తున్నా పగలు మాత్రం ఉష్ణోగ్రతలు ఠారెత్తిస్తున్నాయి. సాధారణంగా ఎండాకాలం వచ్చిందంటే నగరం, పట్టణం, పల్లె ఏ ప్రాంతం అని కాకుండా అగ్ని ప్రమాదాలు నిత్యం జరుగుతూనే ఉంటాయి. జిల్లాలో 23 లక్షలకు పైగా జనాభా ఉంటే అగ్నిమాపక కేంద్రాలు మాత్రం తొమ్మిదే ఉన్నాయి. ఈ కేంద్రాల్లోనూ కేవలం పది అగ్నిమాపక యంత్రాలు ఉన్నాయి. జిల్లాలో ఫైర్ స్టేషన్ల సంఖ్య పెంచాలని ఎప్పటి నుంచో కోరుతున్నా పాలకులు స్పందించడం లేదు.

• ఫైర్ స్టేషన్ల కోసం ఎదురుచూపు

జిల్లాలో ఏళ్ల తరబడి కొత్త ఫైర్ స్టేషన్ల కోసం ప్రజలు ఎదురు చూస్తూనే ఉన్నారు. మండ లానికి ఒక ఫైర్ స్టేషన్ కావాలన్నది ప్రజల ఆకాంక్ష. దీనికి అనుగుణంగా ప్రభుత్వాలు మారిన ప్పుడల్లా జిల్లాలో కొత్త స్టేషన్లు కావాలని అధికారులు సిఫారసు చేస్తూనే ఉన్నారు. ప్రస్తుతం నెల్లూరు, ఆత్మకూరు, కావలి, ఉదయగిరి, వింజమూరు, పొదలకూరు, రాపూరు, మర్రిపాడు, కందుకూరులలో మాత్రమే స్టేషన్లు ఉన్నాయి. వెంకటాచలం, నెల్లూరు రూరల్, సైదాపురం, బుచ్చి, సర్వేపల్లి, అల్లూరు, ఇందుకూరుపేట తదితర ప్రాంతాల్లో స్టేషన్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి ఎప్పటినుంచో సిఫారసులు వెళుతున్నాయి. కానీ అవన్నీ కాగితాల్లోనే ఉండిపోతున్నాయి.

• వెంటాడుతున్న సిబ్బంది కొరత

జిల్లాలో 9 ఫైర్ స్టేషన్ల పరిధిలో 95 మంది ఫైర్‌మెన్‌లు, 15 మంది డీవోపీలు, 27మంది లీడింగ్ ఫైర్‌మెన్‌లు, ఆరుగురు ఎస్ఎఫ్ఓలు, 40 మంది డ్రైవర్లు, ఆపరేటర్లు, హోంగార్డులు ఉన్నారు. మొత్తం 183 మంది ఉన్నారు. ఇంకా 50 పోస్టులకుపైగా ఖాళీలు ఉన్నట్లు తెలుస్తోంది. భారీ అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు సిబ్బంది కొరతతో మంటలను అదుపు చేయడం కష్టతరంగా మారుతోంది. ఉన్నవారిపైనే పనిభారం పడుతోంది.

రూ.2 కోట్ల మంజూరు

జిల్లాలో గత వైసీపీ హయాంలో నెల్లూరు రూరల్, బుచ్చిరెడ్డిపాలెం, వెంకటాచలం ప్రాంతాల్లో స్టేషన్లు ఏర్పాటు చేయాలని పలుమార్లు సిఫారసులు వెళ్లాయి. కానీ పట్టించుకున్న దాఖలాలులేవు. అయితే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బుచ్చి ఫైర్ స్టేషన్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతోపాటు, స్థలాన్ని కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి కేటాయించారు. ఇక అగ్నిమాపక శాఖ డీజీ నుంచి అనుమతులు రావాల్సి ఉంది. ఆత్మకూరు, పొదలకూరులో ఫైర్ స్టేషన్ల నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు ప్రభుత్వం ఇటీవల నిధులు మంజూరు చేసింది. విపత్తుల నిర్వహణ కింద అగ్నిమాపక శాఖకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొదటి ఫేస్ కింద వారం రోజుల కిందట రూ.75 కోట్లు కేటాయించారు. అయితే, బుచ్చి, ఆత్మకూరులలో స్టేషన్ల నిర్మాణానికి సుమారు రూ2 కోట్లు ఇటీవల మంజూరయ్యాయి. ఈ క్రమంలో జిల్లాకు సంబంధించి నూతన స్టేషన్ల ఏర్పాటు, వాహనాల కొనుగోలు, పరికరాలకు ఎంత ఖర్చు చేయాలన్న దానిపై డీజీ మాదిరెడ్డి ప్రతాప్ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.



రెండు హృదయాల కలయికే ప్రేమ

ప్రేమ.. ఓ అద్భుతం, ఓ నమ్మకం, ఓ ఆరాధన ఇలా చెప్పుకుంటూపోతే చాలా నిర్వచనాలే ఉన్నాయి. రెండు గుండె చప్పుళ్లను ఏకం చేసే ప్రేమ ఎలా పుడుతుందో ఎవరికీ అంతుపట్టదు. ఆకర్షణపై కన్నా అర్థం చేసుకునే పునాదులపై ఏర్పడిన ప్రేమ కలకాలం నిలబడుతుంది. అది నిస్వార్థమైన త్యాగానికి ఆలవాలంగా నిలుస్తుంది. ఎన్నటికీ తరగని ప్రేమను తన హృదయంలో శాశ్వతంగా నిలుపుకుంటుంది. ప్రేమదాసులు దేవదాసులైనా.. పెళ్లి తర్వాత ప్రేమలు ఫెయిల్యూర్ అయినా.. అసలైన ప్రేమ మాత్రం అజరామరంగా నిలిచి వెలుగుతుంది. ఈ రోజు ప్రేమికుల దినోత్సవం. ప్రాణం తీసే ప్రేమలు కాదు.. ప్రాణం పోసే ప్రేమలు వర్ధిల్లాలని మనసారా కోరుకుందాం.

- వివరాలు 6లో

'ఈ-పంట' నమోదే ప్రామాణికం

- ఈకేవైసీ కూడా తప్పనిసరి
- ఇప్పటికి 95 శాతం ఈ-పంట, 57 శాతం ఈకేవైసీ నమోదు
- నెలాఖరు వరకు అవకాశం

- వివరాలు 6లో



తహసీల్దారు కార్యాలయం పైన..


ఇరిగేషన్ కార్యాలయం, డీఆర్‌డీఏ కార్యాలయం వెనుక పిచ్చి మొక్కలు

మొక్కే కదా అని వదిలేయకండలా..!

● ప్రభుత్వ భవనాల్లో చొచ్చుకొస్తున్న నిర్లక్ష్యం

ఈ చిత్రాలు గమనించారా!? ఇవెక్కడో పాడుబడిన భవనాలని అనుకుంటున్నారా!? అయితే మీరు పొరబడ్డారు. నిత్యం అధికారులు, ప్రజలు రాకపోకలతో సందడిగా ఉండే మన ప్రభుత్వ కార్యాలయాలు ఇవి. నిర్వహణలోపం కారణంగా ఇవిగో ఇలా రంగులు వెలసిపోయి కళావిహీనంగా మారిపోయాయి. అంతేకాదండోయ్... భవనాల గోడలపై మొలచిన మొక్కలు మానులైనా పట్టించుకున్న అధికారి లేదు. వీటిని ఇలాగే వదిలేస్తే భవనాలు దెబ్బతినే ప్రమాదం ఉంది. ఇకనైనా అధికారులు స్పందించి మొక్కలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

\- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం..

పాత మున్సిపల్ సమావేశ మందిరం ప్రస్తుత సచివాలయం, కలెక్టరేట్ భవనం గోడలపై మొక్కలు

ఇంత పెద్దవయ్యేదాక వదిలేశారే..!

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఏపుగా..

పీహెచ్‌సీలకు జాతీయ అవార్డులు

● ప్రదానం చేసిన డీఎంహెచ్‌వో సుజాత



జాతీయ అవార్డులు అందుకున్న ఆరోగ్య కేంద్రాల నిర్వాహకులతో డీఎంహెచ్‌వో సుజాత, అధికారులు

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు కేంద్ర ప్రభుత్వం నుంచి జాతీయ నాణ్యతా ప్రమాణాల అవార్డులు లభించాయి. ఆ పురస్కారాలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుజాత గురువారం ఆరోగ్య కేంద్రాల అధికారులకు అందించారు. రామతీర్థం, జొన్నవాడ పీహెచ్‌సీలతోపాటు విడవలూరు మండలం ఊటుకూరు, ముత్తుకూరు మండలం దొరువుల పాళెం, నెల్లూరు రూరల్ మండలం అమంచర్ల, పొదలకూరు మండలం మొగళ్లూరు విలేజ్ హెల్త్ సెంటర్(ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలు)లకు ఈ అవార్డులను డీఎం హెచ్‌వో అందించారు. ఆమె మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలు పాటించే ఆసుపత్రులకు కేంద్ర ప్రభుత్వం ఈ అవార్డు అందిస్తుందని చెప్పారు. జిల్లా లోని మిగిలిన పీహెచ్‌సీలు కూడా నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ ఉమామహేశ్వరి, డీపీఎంవో డాక్టర్ రమేష్, హెచ్‌డబ్ల్యూసీ వైద్యాధికారి డాక్టర్ బ్రహ్మేశ్వరనాయుడు, డెమో కనకరత్నం, ఎంక్వాస్ క్వాలిటీ మేనేజర్ భరత్, అవార్డులు స్వీకరించిన వైద్యాధికారులు పాల్గొన్నారు.

పాతనేరస్థుల బైండోవర్

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): రౌడీ, సస్పెక్ట్ షీటర్లు, పాతనేరస్థులను చిన్నబజారు పోలీసు స్టేషన్ పరిధిలో గురువారం బైండోవరు చేశారు. సీఏఎం స్కూలు ప్రాంగణంలో అనుమానాస్పదంగా ఉన్న డైకాస్‌రోడ్డు చేపల మార్కెట్‌కు చెందిన రౌడీషీటర్ పీ తౌసీఫ్‌ఖాన్, పాత నేరస్థుడు పొదలకూరురోడ్డు లక్ష్మీనగర్‌కు చెందిన అబ్బూ సుఫియాన్‌ను చిన్నబజారు ఎస్‌ఐ అయ్యప్ప తన సిబ్బందితో అదుపులోకి తీసుకున్నారు. వారిని స్థానిక తహసీల్దార్ వద్ద బైండోవర్ చేశారు.

ప్రేమ ఓ ప్రేమ!

ప్రేమ.. ప్యార్.. ఇష్క్.. లవ్.. మొహబ్బత్ ఇలా ఏ భాషలో చెప్పినా భావం ఒక్కటే. ప్రేమ కోసం కొందరు ప్రాణాలు అర్పిస్తే.. మరికొందరు పాలరాతి మందిరాలు నిర్మించారు. ఇంకొందరు గుండెనే గుడిగా మలిచి పూజించారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా ప్రేమను గెలిపించుకున్నవారు కొందరైతే... ప్రేమలేని జీవితాన్ని ఊహించలేమంటూ ప్రాణాలు విడిచిన ప్రేమికులు మరికొందరు. ప్రేమ అనేది ఎప్పుడు ఎలా పుడుతుందో ఎవరూ చెప్పలేరు. ప్రేమికులు తమ ప్రేమను వ్యక్తం చేయడానికి సందర్భం ఎంచుకుంటారు. ప్రత్యేక సంఘటనలు, పుట్టినరోజు, వలంటైన్స్‌డే ఇలా ఏదో ఒక సందర్భాన్ని సద్వినియోగం చేసుకుంటారు. ఇందులో అధికశాతం మంది ప్రేమికుల రోజునే తమ ప్రేమను వ్యక్తం చేస్తుంటారు. అలాంటి రోజు రానే వచ్చింది. తమ మనసులో మాట చెప్పేందుకు ప్రేమికులు ఎదురు చూస్తున్నారు. ప్రేమను వ్యక్తం చేసేవారు.. ప్రేమలో ఉన్నవారు ఈ రోజు ఎప్పటికీ గుర్తుండిపోయేలా ప్లాన్ చేసుకుంటున్నారు. నేడు ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం..



రెండు హృదయాల కలయిక

నేడు ప్రపంచ ప్రేమికుల దినోత్సవం

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) :ఖరీదైన కానుకలతో సర్‌ప్రైజ్ చేసుకునేందుకు ప్రేమికులు సన్నద్ధమయ్యారు. మదిలో ఉన్న ప్రేమ సందేశాలను ఇచ్చి పుచ్చుకునేందుకు మార్కెట్లో ఎన్నో వస్తువులు అందుబాటులోకి వచ్చేశాయి. ప్రేమికుల రోజు సందర్భంగా సరికొత్తగా సృజనాత్మకమైన వస్తువులెన్నో ప్రేమికులను ఆకట్టుకుం టున్నాయి. మా ప్రేమ చిరకాలం ఉండాలన్నా, తీపి గుర్తుగా మిగిలిపోవాలన్నా, మధుర జ్ఞాపకాలను ఫ్రేమ్‌లో బంధించాలన్నా ఎన్నో గిఫ్ట్‌లు అందుబాటులో ఉన్నాయం టున్నారు ప్రేమికులు. వారు మెచ్చిన నచ్చిన ఫొటోలు ఫ్రేమ్‌లో బంధించి కానుకగా ఇవ్వడంతోపాటు లవర్స్ స్పెషల్ కీచైన్‌లు, టుడే అండ్ టుమారో, జస్ట్ ఫర్ యూ అనే హార్ట్ పిల్లోస్‌పై ఆసక్తి చూపుతున్నారు. అలాగే ప్రేమికుల కోసం ఎన్నో రకాల విదేశీ చాక్లెట్లు నోరూరిస్తున్నాయి. హార్ట్ షేప్‌లో ఉండే ఈ తీపిగుర్తులు ప్రత్యేక ప్యాక్‌లతో సిద్ధంగా ఉన్నాయి. ప్రేమను వ్యక్తం చేసేవారు టెడ్డీబేర్‌లు కొనుగోలు చేసేందుకు యువత మొగ్గు చూపుతోంది. గతంలో కంటే ఈసారి వాలెంటైన్స్‌డేకి ప్రత్యేక గిఫ్ట్‌లు అందుబాటులో ఉన్నాయని, ప్రేమను తెలిపే విధంగా రకరకాల వస్తువులు సిద్ధంగా ఉంచామని వ్యాపారులు చెబుతున్నారు.



● ఆకర్షణ వలలో పడొద్దు..!

నేటి యువత ప్రేమ పేరుతో ఆకర్షణకు లోనై ఆలోచన, విచక్షణా జ్ఞానం మరిచిపోతోంది. యవ్వనపు తొలిదశ కాస్త కవితాత్మకంగా మాట్లాడితే కరిగిపోతున్న ప్రేమికులకు కొదవేలేదు. ఆకర్షణ ఉచ్చులో పడి వ్యక్తిత్వ లోపం కలిగిన వ్యక్తులను నమ్మి వంచనలకు గురవుతున్న యువ తులు ఎందరో ఉన్నారు. ప్రేమ, పెళ్లిళ్లపై స్పష్టమైన అవగాహన లేని వయస్సులోనే దాని వెంటపడి పరుగులు పెడుతూ కుటుంబాలకు ఆవేదన మిగిలుస్తున్న వారి సంఖ్య కూడా పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. అలాగే తనకోసం ఏదీ ఆశించని పవిత్రమైన ప్రేమకు మాత్రమే విలువ ఇచ్చే వారు కూడా సమాజంలో ఉన్నారంటే అతిశయోక్తి కాదు. ఒకరికోసం ఒకరు త్యాగాలు చేసుకుంటూ, బలహీనతలను కూడా ప్రేమించగలిగి పెళ్లితో జీవితాన్ని శాశ్వతంగా ప్రేమమయం చేసుకున్న దంపతులు కూడా ఎందరో ఉన్నారు. బాయ్‌ఫ్రెండ్, గర్ల్‌ఫ్రెండ్ ఉండడం స్టేటస్ సింబల్ ఎంతమాత్రం కాదని తెలుసుకోవాలి. ప్రేమించడం వేరు.. ప్రేమిస్తున్నాననే భావన వేరు.. ఆకర్షణకు, ప్రేమకు మధ్య సున్నితమైన తేడాను గుర్తించాలి. ఆర్థిక స్థిరత్వం, వ్యక్తిత్వం లేని ప్రేమ ఎల్లకాలం నిలబడదు. జీవితంలో ప్రేమ ఒక భాగం మాత్రమే ప్రేమే జీవితం కాదు. ప్రేమ కోసం చావాలనుకోవడం, చంపాలనుకోవడం రెండూ నేరమే. ప్రేమకు మరణం ఉండదు. మరణానికి కారణం ప్రేమ కాకూడదు. హ్యాపీ వాలంటైన్స్ డే..

గుంతలు లేని రోడ్లే లక్ష్యం అని ఓ వైపు ప్రభుత్వం ప్రకటనలు చేస్తుంటే.. నెల్లూరులో మాత్రం గుంతలు పూడ్చడంలో తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గుంతలు పూడ్చేందుకు సుమారు రూ.20 కోట్ల వరకూ జిల్లాకు మంజూరు చేసింది. చాలా రోడ్లపై ఉన్న గుంతలు ఇప్పటికే పూడాయి. కానీ నెల్లూరు-పొదలకూరు రోడ్డుకు మాత్రం గుంతల నుంచి ఉపశమనం కలగడం లేదు.

ఇంకెన్నాళ్లీ కష్టాలు?

● పొదలకూరు రోడ్డు బాగుపడేదెప్పుడు!

● ఏడాది దాటినా అభివృద్ధికి నోచుకోని రహదారి

● గుంతల ప్రయాణంతో నిత్యం నరకం

నెల్లూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : సర్వేపల్లి, వెంకటగిరి నియోజకవర్గాలతోపాటు కడప జిల్లా నుంచి నెల్లూరుకు వచ్చేందుకు పొదలకూరు రోడ్డు ప్రధాన రహదారి. అటువంటి కీలకమైన రోడ్డు అభివృద్ధికి నోచుకోవడం లేదు. కొత్త రోడ్డు నిర్మాణం కోసం డీకేడబ్ల్యూ కాలేజీ నుంచి డైకస్ రోడ్డు సెంటర్ వరకూ (కి.మీ 0 నుంచి 5 వరకూ, కి.మీ 8 నుంచి 10 వరకూ) విస్తరించి నాలుగు వరుసల రోడ్డు వేయాలని అధికారులు ప్రతిపాదించారు. నాలుగేళ్ల క్రితం పశ్చిమ వైపు రోడ్డు బాగు చేసేందుకు నిధులు మంజూరయ్యాయి. అప్పుడు రోడ్డు వేసినా కొద్ది రోజులకే మళ్లీ దెబ్బతిన్నది. సైడు కాలువలు లేకుండా నిర్మిస్తున్నారని, దీని మూలంగా రోడ్డుపై నీళ్ల నిలబడి దెబ్బతినే ప్రమాదముందని నాడే 'ఆంధ్రజ్యోతి' హెచ్చరించినా అధికారులు పట్టించుకోలేదు. ఊహించిన విధంగానే వేసిన రోడ్డుతోపాటు తూర్పు వైపు ఉన్న రోడ్డు నీళ్ల నిలబడి మరింత గుంతలమయంగా మారింది. దీని మూలంగా అనేక ప్రమాదాలు కూడా జరిగాయి. అనేక విజ్ఞప్తుల తర్వాత తూర్పు వైపు రోడ్డును కూడా అభివృద్ధి చేసేందుకు 2023లో రూ.5.53 కోట్లు మంజూరయ్యాయి. అదే ఏడాది ఆర్‌అండ్‌బీ అధికారులు టెండర్లు పూర్తి చేసి, గతేడాది ఫిబ్రవరిలో కాంట్రాక్టర్ అగ్రిమెంటు కూడా చేసుకున్నారు. పశ్చిమ వైపు రోడ్డు వేసిన కాంట్రాక్టరే తూర్పు వైపు రోడ్డు వర్కును కూడా దక్కించుకున్నారు. 9 నెలల్లో పనులు పూర్తి చేయాల్సి ఉండగా, ఏడాది దాటినా ఇంతవరకూ నాలుగో వంతు పనులు కూడా పూర్తి కాలేదు. ప్రజల నుంచి ఆగ్రహం వ్యక్తమవు తుండడంతో ఇటీవల డైకస్ రోడ్డు సెం టర్లో భారీ గుంతలు ఉన్నచోట సిమెంటు రోడ్డు వేసి వదిలేశారు. ఈ రోడ్డు పనులను ఐదు శాతం ఎక్సెస్‌కు దక్కించుకున్నారు. నాడు టెండర్ల సమయంలో వేరొకరు టెండర్లు వేయకుండా అడ్డుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అయితే పనులు దక్కించుకున్న వేగంగా పనులు చేయకపోవడంతో ఇటు కాంట్రాక్టర్, అటు అధికారులపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై ఆర్‌అండ్‌బీ నెల్లూరు ఈఈ మురళీ కృష్ణను వివరణ కోరగా రెండు, మూడు రోజుల్లో పనులు మొదలు పెడతామని చెప్పారు. పనులు చేయడానికి అవసరమైన మెటీరియల్‌ను సమకూర్చుకోవాలని కాంట్రాక్టర్‌కు సూచించినట్లు పేర్కొన్నారు.



పొదలకూరు రోడ్డుపై ఏర్పడిన గుంతలు

పంట రుణాలపై వడ్డీ రాయితీ, పంట నష్ట పరిహారం అందించేందుకు, ధాన్యం కొనుగోలు వంటి పలు ప్రభుత్వ పథకాలు రైతుల దరి చేరాలంటే ఈ-పంట నమోదే ప్రామాణికం. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు రైతులకు పరిహారం అందేందుకు 'ఈ-పంట' ఎంతో ముఖ్యం. రబీ సీజన్‌కు సంబంధించి నెలాఖరు వరకు నమోదుకు సమయం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

'ఈ-పంట' నమోదే ప్రామాణికం



● ఈకేవైసీ కూడా తప్పనిసరి

● ఇప్పటికి 95 శాతం ఈ-పంట, 57 శాతం ఈకేవైసీ నమోదు

● నెలాఖరు వరకు అవకాశం

నెల్లూరు(వ్యవసాయం), ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 3,33,378 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతున్నాయి. ఇప్పటికే 3,23,000 ఎకరాలకు ఈ-పంట నమోదు ప్రక్రియ పూర్తయింది. ప్రభుత్వ ఆదేశాలు మేరకు వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి రైతు కు ఎంత భూమి ఉంది?, ఏ పంట సాగు చేస్తున్నారు.. తదితర వివరాలు సేకరించారు. ఆధార్, మొబైల్ నెంబరు, సర్వే నెంబర్లతో పాటు రైతులు సాగుచేస్తున్న పంటల చిత్రాలు యాప్‌లో నమోదు చేశారు. సేకరించిన ధాన్యానికి దాదాపు 48గంటల్లోనే సొమ్ములు చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే.

● 57శాతం ఈకేవైసీ

జిల్లాలో ఈకేవైసీ నమోదు మాత్రం కాస్త మందకొడిగా సాగుతున్నట్లు కనిపి స్తోంది. ప్రస్తుతం నోటిఫైడ్ పంటలు సాగుచేస్తున్న రైతులకు మాత్రమే ఈకే వైసీ చేస్తున్నట్లు అధికారులు చెబుతు న్నారు. దాదాపు 67207 మంది రైతులకు గాను ఇప్పటి వరకు 38308 మందికి మాత్రమే అంటే 57శాతం మాత్రమే నమోదైంది. పీఎం కిసాన్ పథకం సొమ్ములు జమ కావాలంటే ఈకేవైసీ తప్పనిసరిగా చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశాలు జారీ చేశాయి. అనర్హులు లబ్ధిపొందుతున్నారనే సమాచారంతోనే తప్పనిసరిగా నమోదు చేయాలనే నిబంధన విధించాయని అధికారులు చెబుతున్నారు. దాదాపు ఏడాది కాలంగా ఈకేవైసీ నమోదుకు సమయం ఇస్తున్నా నూరుశాతం నమోదు కావడం లేదు. ఈ కారణంగా 20శాతం పైగా రైతులు పథకం లబ్ధి పొందలేక పోతున్నారు. ప్రస్తుతం దీనిపై అధికారులు అవగాహన కల్పిస్తూ నమోదు చేస్తున్నారు.



నూరుశాతం నమోదుకు కృషి చేస్తున్నాం



జిల్లాలో ఈ-పంట నమోదు 95శాతం వరకు పూర్త యింది. ఈకేవైసీ 57శాతం పైగానే నమోదైంది. అయితే ప్రస్తుతం ప్రతి రైతుకు ఆధార్ తరహాలో 12 అంకెల విశిష్ట సంఖ్య నమోదు కార్యక్రమంపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. దీంతో ఈకేవైసీ నమోదు వేగం తగ్గింది. నెలాఖరు వరకు సమయం ఉంది. గడువులోగా నూరు శాతం నమోదు చేసేందుకు కృషి చేస్తున్నాం.

\- పీ సత్యవాణి, జిల్లా వ్యవసాయాధికారి

మొక్కలు పెంచుదాం

● నెల్లూరు - ఇచ్ఛాపురం సైకిల్ యాత్ర



చైతన్యను మొక్కను అందించి సైకిల్‌యాత్రను ప్రారంభిస్తున్న జేసీఐ నాయకులు సతీష్‌కుమార్, కోట సత్యనారాయణ, తదితరులు

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణకు మొక్కల పెంపకం ఆవశ్యకతపై ప్రచారం చేసేందుకు నెల్లూరుకు చెందిన యువ కుడు చైతన్య నగరం నుంచి ఇచ్ఛాపురం వరకు సైకిల్ యాత్ర చేపట్టారు. జేసీఐ నెల్లూరు, శుభమస్తు, ఫన్‌పార్క్, హైటెక్ ఫార్మా అభిషేక్ సంస్థలు ఈ యాత్రను ప్రోత్సహిం చాయి. గురువారం ఉదయం నగరంలోని మెడికవర్ ఆసుపత్రి వద్ద జేసీఐ మాజీ అధ్యక్షుడు సతీష్‌కుమార్, కోట సత్యనారాయణ, అభిషేక్, సాయి, కిషన్‌రామ్, జగన్, మల్లికార్జున్ జెండా ఊపి యాత్రను ప్రారంభించారు. ఈ యాత్ర నెల్లూరు నుంచి ఇచ్ఛాపురం, తిరిగి ఇచ్ఛాపురం నుంచి నెల్లూరుకు సాగుతుందని, ఈ యాత్రలో మొక్కల పెంపకంపై ప్రచారం చేయడంతోపాటు అక్కడక్కడ మొక్కలు నాటుతారని జేసీఐ సభ్యులు తెలిపారు.

విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

నెల్లూరు రూరల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్లోని ధనలక్ష్మీపురం వద్ద ఉన్న ఓ ప్రైవేటు స్కూల్లో విద్యార్థిని ఆత్మహత్యకు యత్నించింది. స్థానికులు, రూరల్ పోలీసులు అందించిన సమాచారం మేరకు.. ఆ స్కూల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని గురువారం మూడవ అంతస్తు నుంచి కిందకు దూకింది. పాఠశాల సిబ్బంది హుటాహుటిన నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం బాలిక ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు సమాచారం. పైనుంచి కిందకు దూకిన ప్రాంతంలో ఇసుక ఉండటం వల్ల ప్రమాదం తప్పినట్లు తెలిసింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. కాగా, ఇదే పాఠశాలలో రెండు నెలలు క్రితం ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన విషయం గమనార్హం.

ఆరేళ్ల బాలికపై లైంగిక దాడి

● వెంకటాచలంలో కేసు నమోదు

వెంకటాచలం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల మహిళలపై లైంగికదాడులు పెరిగిపోతున్నాయి. చిన్నా పెద్ద, వావివరసలు లేకుండా మృగాళ్లు రెచ్చిపోతున్నారు. పోక్సో చట్టం ఉన్నా అఘాయిత్యాలు మాత్రం తగ్గడం లేదు. వెంకటాచలం మండలంలో 15 రోజుల వ్యవధిలో మూడు లైంగికదాడి కేసులు నమోదు కావడం గమనార్హం. తాజాగా గూడ్లూరువారిపాళెం జడ్పీ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న 15 ఏళ్ల బాలుడు అదే గ్రామంలో ఆరేళ్ల బాలికపై ఆదివారం లైంగికదాడికి ఒడిగట్టాడు. గురువారం ఈ విషయం వెలుగులోకి రావడంతో బాలిక తల్లి వెంకటాచలం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో సీఐ సుబ్బారావు, ఎస్‌ఐ ఆంజనేయులు గూడ్లూరువారిపాళెంలో విచారించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా, గూడ్లూరువారిపాళెం జడ్పీ హైస్కూల్‌లో గురువారం సీఐ సుబ్బారావు ఆధ్వర్యంలో బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చట్టాలపైన అవగాహన కల్పించారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

ఉదయగిరి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జడ్పీ డిప్యూటీ సీఈవో జే.మోహన్‌రావు సిబ్బందికి సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ సర్వేలను నూరు శాతం సమగ్ర సమాచారంతో పూర్తిచేయాలన్నారు. వేసవి దృష్ట్యా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు.

న్యూస్ బాక్స్

ఉపాధి పనులు కల్పించాలి

అనంతసాగరం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనులు కల్పించాలని స్థానిక ముస్లీం కాలనీ వాసులు ఎంపీడీవో కార్యాలయం వద్ద గురువారం నిరసన తెలిపి అధికారులకు వినతిపత్రం అందించారు. వ్యవసాయ పనులు పూర్తయ్యాయని, ప్రస్తుతం పనులు లేక ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం మండల అధ్యక్షుడు అన్వర్‌బాషా, పొలయ్య, సందాని తదితరులు పాల్గొన్నారు.

విలీనం వద్దంటూ నిరసన

అనంతసాగరం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): సోమశిలలోని మెయిన్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులను హిల్ కాలనీకి విలీనం చేసే ప్రక్రియ ఆపాలని డిమాండ్ చేస్తూ గురువారం పాఠశాల వద్ద నిరసన తెలిపారు. విలీనం చేస్తే విద్యార్థులు 2 కి.మీ నడిచి వెళ్లాల్సి ఉంటుందని వాపోయారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు వేగు పెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉలవపాడువాసికి డాక్టరేట్

ఉలవపాడు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని బీసీ యాదవ కాలనీకి చెందిన ఓగుబోయిన యానాది, మస్తానమ్మల పెద్ద కుమారుడు శ్రీకాంత్ విశ్లేషణాత్మక రసాయన శాస్త్రం మీద పరిశోధనలు చేసి డాక్టరేట్ అందుకున్నాడు. ఈ నెల 5న తన గైడ్ ఎస్ఎం బోయర్ చేతుల మీదుగా డాక్టరేట్ పట్టా అందుకున్నట్లు శ్రీకాంత్ తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్థులు, ఆయనకు అభినందనలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో షబే బరాత్

అనంతసాగరం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి):సోమశిల,ఉప్పలపాడు, అనంతసాగరంలో గురువారం రాత్రి షబేబరాత్ వేడుకలను ముస్లీంలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈసందర్భంగా మసీదులను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ఉదయగిరి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): గండిపాళెంలో ఇటీవల మృతిచెందిన గోరంట్ల వేణు కుటుంబ సభ్యులకు గురువారం సేవాగుణ ఫౌండేషన్ సభ్యులు రూ.21 వేలు, నియోజకవర్గ ఐటీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రెడ్డిబత్తిన ఉమాసాయిరాం రూ.5 వేలు అందజేశారు. కార్యక్రమంలో కిరణ్, ఇమ్రాన్, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.


నగదు ఇస్తున్న ఫౌండేషన్ సభ్యులు

గ్రంథాలయం తనిఖీ

సంగం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమారరాజా గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. పాఠకుల సంఖ్య పెరిగేందుకు కృషి చేయాలని సూచించారు. అదేవిధంగా పంచాయతీల నుంచి రావాల్సిన సెస్ బకాయిలు వసూలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట గ్రంథాలయ లైబ్రేరియన్ రవీంద్రరెడ్డి ఉన్నారు.


రికార్డులు చూస్తున్న కుమారరాజా

విద్యా, వైద్యరంగాల అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే కాకర్ల


భూమి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్, టీడీపీ నాయకులు

ఉదయగిరి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో విద్యా, వైద్యరంగాలను అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు కృషిచేస్తున్నట్లు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎంఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్, టీడీపీ నాయకులతో కలిసి పీఎం ఉష పథకం కింద రూ.5 కోట్ల నిధులతో వివిధ అభివృద్ధి పనులకు భూమిపూజ చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. త్వరలో 22 నూతన శుద్ధిజల కేంద్రాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. వెలుగొండ, సోమశిల హైలెవల్ కెనాల్‌కు రానున్న బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించేలా చర్యలు చేపట్టి, వాటి పనులను త్వరితగతిన పూర్తిచేసి సాగు, తాగునీటి కష్టాలు తీరుస్తామన్నారు. ఉదయగిరి దుర్గాన్ని పర్యాటక కేంద్రంగా మార్చి ఈప్రాంత అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. నియోజకవర్గంలో పరిశ్రమలు నెలకొల్పి యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడమే తన ధ్యేయమన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి త్వరలో ఉదయగిరి ఆర్అండ్‌బీ అతిథిగృహంలో ప్రజాదర్బార్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి, పొలిటికల్ మేనేజర్ మాలేపాటి చైతన్య, పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ చిరంజీవి రెడ్డి, టీడీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు రియాజ్, ప్రిన్సిపాల్ ఎల్ నారాయణస్వామి, ఏపీఈడబ్ల్యూఐడీసీ ఈఈ సుబ్బరాయుడు, ఏఈ శ్రావణ్, గుత్తేదారులు గడ్డం శ్రీనివాసులు, బొజ్జా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను కార్యాలయం చుట్టూ తిప్పించుకోవద్దు

ఉదయగిరి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం వచ్చే ప్రజలను కార్యాలయం చుట్టూ తిప్పించుకోవద్దని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సూచించారు. గురువారం స్థానిక తహసీల్దారు కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో ఎన్ని అర్జీలు వచ్చాయి.. ఎన్ని పరిష్కరించారంటూ తహసీల్దారు సుభద్రను ప్రశ్నించారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో అశ్రద్ధ వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం పలు సమస్యలపై ప్రజలు అందజేసిన వినతులను స్వీకరించారు.

హౌస్ హోల్డ్ జియో ట్యాగ్ త్వరగా పూర్తిచేయండి

సీతారామపురం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): హౌస్ హోల్డ్ జియో ట్యాగ్ త్వరగా పూర్తి చేయాలని జడ్పీ డిప్యూటీ సీఈవో మోహన్ రావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఇంతవరకు హౌస్ హోల్డ్ జియో ట్యాగ్ కాని కుటుంబాలకు త్వరగా మ్యాపింగ్ చేయాలని తెలిపారు. వలసలు పోయిన కుటుంబలను గుర్తించి హౌస్ హోల్డ్ మ్యాపింగ్ చేయించుకోవడం వల్ల కలుగు ప్రయోజనాలపై వారికి అవగాహన కల్పించాలని తెలిపారు. ఆధార్ కార్డు లేని చిన్నపిల్లలను గుర్తించి వారికి ఆధార్ నమోదు చేసుకునేలా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భాస్కర్, ఈవో పీఆర్డి భార్గవి తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రత .. అందరి బాధ్యత: ఆర్టీవో


మాట్లాడుతున్న ఆర్టీవో సుధాకర్ రెడ్డి

కావలి రూరల్, ఫిబ్రవరి13(ఆంధ్రజ్యోతి): రహదారి భద్రత అందరి బాధ్యత అని ఆర్టీవో వై. సుధాకర్ రెడ్డి అన్నారు. పట్టణం లోని లారీ ఓనర్స్ అసోసియేషన్స్ ఆధ్వర్యంలో గురువారం జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలపై డ్రైవర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆర్టీవో సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం రహదారి భద్రతపై ప్రత్యేక చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. వాహనాలు నడిపేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. కార్యక్రమంలో రమేష్ నాయుడు మాట్లాడారు. అసంఘటిత కార్మికుల కోసం ఉచితంగా గుర్తింపు కార్డులు ఇవ్వటం జరుగుతుందన్నారు. ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.2 లక్షలు బీమా వర్తిస్తుంద న్నారు. కార్యక్రమంలో ఎంవీఐ సుందర్ రావు, అసిస్టెంట్ ఎంవీఐ కరుణాకర్, 1వ పట్టణ ఎస్ఐలు సుమన్, జమాల్ వలీ లారీ యూనియన్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు మండలి క్రిష్టారావు, రంగారెడ్డి, గూడ్స్ డ్రైవర్లు, లారీ, ఆటో డ్రైవర్లు, స్కూల్, కళాశాలల బస్ డ్రైవర్లు పాల్గొన్నారు.

కుంకుమ, జాకెట్ల పంపిణీ

కందుకూరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): గ్రామదేవత అంకమ్మ అమ్మవారి ఆలయంలో 24 గంటలపాటు లలితాసహస్రనామ పారాయణం చేసిన మహిళా భక్తులకు గురువారం ఆలయ కమిటీసభ్యులు అమ్మవారి కుంకుమ, జాకెట్లు పంపిణీ చేశారు. ఈ పా రాయణ కార్యక్రమానికి విచ్చేసిన భక్తులందరికీ ఈ సందర్భంగా ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పొడపాటి నరసింహ్మం, గాయత్రీ రామకృష్ణ దంపతులు, వసంత, కోట వెంక టేశ్వర్లు, రావెళ్ల ప్రసాదు, ఆలయ కమిటీస భ్యులు వెంకటరెడ్డి, మురళి పాల్గొన్నారు.

అభివృద్ధికి తోడ్పాటు అందించాలని సీఎంని కోరతాం

- ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈనెల 15న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నియోజకవర్గ పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పార్టీ నాయకులు, కార్యకర్తలను పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారం చేపట్టిన 8నెలల్లోనే ముఖ్యమంత్రి నియోజకవర్గ పర్యటనకు వస్తుండటం ఆనందదాయకం అన్నారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని నియోజకవర్గ అభివృద్ధికి వరాలు కురిపించాల్సిందిగా ఆయనకు విజ్ఞప్తి చేస్తామని వివరించారు. ఎన్నికల హామీలలో కూడా ప్రధానమైనవి తక్షణం అమలుచేయాలని కోరుతామన్నారు. అలాగే రాళ్లపాడు ప్రాజెక్టుకు సోమశిల నుంచి నీరు ప్రవహించే జీకేఎన్ కెనాల్ వెడెల్పు పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని, కందుకూరు మున్సిపాలిటీకి తక్షణం నిధులు విడుదలకు చర్యలు తీసుకోవాలని కోరనున్నట్లు తెలిపారు. మరికొన్ని సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళతామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, మాదాల లక్ష్మీనరసింహ్మం, నార్నె రోశయ్య, జనిగర్ల నాగరాజు, చదలవాడ కొండయ్య, చిలకపాటి మధు, రఫీ, బెజవాడ ప్రసాద్, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ గట్టమనేని హరిబాబు పాల్గొన్నారు.

డెయిరీ ఫాం నిర్మాణానికి శంకుస్థాపన

స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని ఎర్రగుంటపాలెం వద్ద ఏర్పాటు చేస్తున్న శ్రీ లక్ష్మీనరసింహ్మ డెయిరీఫాంకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు మర్రిపూడి మహేంద్ర, మాధవ, నాయకులు దామా మల్లేశ్వరరావు, ఉప్పుటూరి శ్రీనివాసరావు, గట్టమనేని హరిబాబు, నాదెళ్ల వెంకట రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా పుష్పయాగం


పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కావలి టౌన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): హనుమత్ క్షేత్రంలో గురువారం లక్ష్మీపద్మావతి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి పుష్పయాగ మహోత్సవం కనులపండువగా జరిగింది. ఆలయ వ్యవస్థాపక ప్రధాన అర్చకులు వేదగిరి సూర్యనారాయణాచార్యులు పర్యవేక్షణలో జరుగుతున్న ఉత్సవాల్లో ఉదయం అష్టోత్తర కలశ స్థాపన పారమాత్మిక శాంతిహోమం నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలి


విగ్రహ ప్రతిష్ఠలో వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల

కలువాయి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి):గ్రామాల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ కోరారు. కుల్లూరులో నూతనంగా నిర్మించిన శ్రీ వీరాంజనేయస్వామి ఆలయంలో గురువారం విగ్రహ ప్రతిష్ఠ, కుంభాభిషేకం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఆలయాన్ని పునర్నిర్మించిన సీతారామును అభినందించి ఇలాంటి వారు గ్రామాభివృద్ధికి ముందుకు రావాలన్నారు. అనంతరం అన్న దానం, సాయంత్రం స్వామివార్ల గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఇమ్మడి సిద్ధరామేశ్వర స్వామిజీ, మాజీ ఎమ్మెల్సీ మాదాసు గంగాధరం, టీడీపీ కన్వీనర్ వెంకటేశ్వర్లు నాయుడు పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రాలు ప్రారంభించాలి


కార్యదర్శులతో సమావేశమైన డీఎల్‌పీవో నయీం తాజ్ హసన్

సంగం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి):డివిజన్‌లోని అన్ని పంచాయతీల్లో ఈ నెల 15వ తేదీ నాటికి చెత్తసంపద కేంద్రాలు ప్రారంభించడానికి సిద్ధం చేస్తున్నట్లు డీఎల్‌పీవో నయీం తాజ్ హసన్ తెలిపారు. గురువారం ఆయన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటిపన్నులు, స్వర్ణ పంచాయతీ, చెత్తసంపద కేంద్రాల పనితీరు తదితర అంశాలపై సమీక్షించారు. ఈనెల 15వ తేదీ నుంచి అన్ని చెత్త సంపద కేంద్రాలు ప్రారంభించాలని, ఆమేరకు పంచాయతీల్లో గ్రీన్ అంబాసిడర్స్‌ను ఏర్పాటుచేసి చెత్త సేకరించి పొడి, తడి చెత్త వేరు చేసి చెత్త సంపద కేంద్రాలకు తరలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఈవోఆర్డీ వరప్రసాద్ ఉన్నారు.

'పోషణ్ బీ పడాయి బీ'పై అవగాహన


అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పిస్తున్న సీడీపీవో సునీలత

సంగం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ భవనంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ్ బీ పడాయి బీ (చిన్నారుల సంరక్షణ, పోషకాహారం) కార్యక్రమంపై ఐసీడీయస్ ఆధ్వర్యంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీయస్ సీడీపీవో సునీలత, ప్రధానోపాధ్యాయులు బుజ్జయ్య పాల్గొని ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ, పోషకాహారం, బాల్య విద్యపై సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఐసీడీయస్ సూపర్‌వైజర్ పద్మావతి, స్కూల్ ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ మోహన్ పాల్గొన్నారు.

- వలేటివారిపాలెం: అంగన్‌వాడీకేంద్రాలకు వచ్చే ప్రీస్కూల్ చిన్నారులకు ఆట పాటల తో కూడిన విద్యనందించాలని ఎంపీడీఓ నరేంద్రదేవ్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయలో అంగన్‌వా డీ కార్యకర్తలకు పోషణ బీ, పడాయి బీ అనే కార్యక్రమంపై నిర్వహించిన శిక్షణ తరగతుల్లో ఆయన పాల్గొని సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సునీత, తహసీల్దార్ అబ్దుల్‌అమీద్, ఎంఈఓ-2 మల్లికార్జునరావు, సీహెచ్ఓ శివరామయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం


విద్యార్థులను సన్మానిస్తున్న హెచ్ఎం. జనార్ధన్‌రెడ్డి, ఉపాధ్యాయులు

కలువాయి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎన్ఎంఎస్) పథకానికి మండలంలోని చీపినాపి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు షేక్ ఖాజానబి, కార్తీక్, షేక్ రహమాన్, అర్హత సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.జనార్ధన్‌రెడ్డి తెలిపారు. కాగా, అర్హత సాధించిన విద్యార్థులను గురువారం పాఠశాలలో హెచ్ఎం సన్మానించారు. ఇందుకు కృషి చేసిన ఉపాధ్యాయులను ఆయన అభినందించారు. ఆర్థికంగా వెనుకబడి ప్రతిభ గల విద్యార్థులకు ఈ పథకం కింద 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు నాలుగేళ్ల పాటు ఏడాదికి రూ.12వేలు వంతున స్కాలర్‌షిప్ అందిస్తారు.

ఎన్ఎంఎంఎస్‌కు విద్యార్థుల ఎంపిక

సంగం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎనిమిది మంది విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్)కు ఎంపకయ్యారని ఎంఈవో జానకీరామ్ తెలిపారు. సంగం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన వి లీలానంద కుమార్‌రెడ్డి, సీహెచ్ మోక్షిత, కె హరిత, పివి యోగిత, జి ఇంద్రజ, బి షణ్ముఖప్రియ, అదేవిధంగా తరుణవాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన గంటా గిరిష్మ, షేక్ అల్పియా ఎంపికయ్యారు.


ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికయిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

బోగోలులో ఎమ్మెల్యే దగుమాటి పర్యటన


విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే దగుమాటి

బిట్రగుంట, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడి గురించి పర్యటించారు. ముందుగా సోమేశ్వరపురం, కమ్మపాలెంలో పోతురాజుస్వామి సమేత పోలేరమ్మతల్లి, మహాలక్ష్మ నూతన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. అనంతరం బోగోలు కుమ్మరవీధికి చెందిన టీడీపీ సీనియర్ నేత మేకల వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు, కప్పరాళ్ళతిప్ప బాడన్‌పేటలోని గోగుల శిరీష కుటుంబ సభ్యులు, కోవూరుపల్లిలో కార్‌పెంటర్ ఖాదర్‌బాషా కుటుంటసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట పార్టీ మండల కన్వీనర్ నాగేశ్వరరావు, మధుబాబునాయుడు, ఎం. వెంకయ్య, వెంకటేశ్వరరెడ్డి, ప్రభాకర్ పాల్గొన్నారు.

ఉద్యమంలా స్వచ్ఛాంధ్ర

కావలిటౌన్, ఫిబ్రవరి 13: స్వచ్ఛఆంధ్ర కార్య క్రమాన్ని రాష్ట్రప్రభుత్వం ఉద్యమ రూపంలో చేపట్టిందని మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ తెలిపారు. గురువారం పట్టణ 10వ వార్డులో స్వచ్ఛఆంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎమ్మెల్యే దగుమాటి క్రిష్టారెడ్డి సూచనలతో 10వ వార్డును (మోడల్) పైలెట్ వార్డుగా ఎంపిక చేశామన్నారు. డ్రైనేజీ, పారి శుధ్య పరిరక్షణ తదితర స్థానిక సమస్యలను గుర్తించి నూరు శాతం సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా స్థానికులు కొన్ని సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో వార్డు టీడీపీ నాయకులు వల్లేరి కిరణ్‌కుమార్, ఎం.సుకుమార్, ఎల్లంటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సమస్యలపై 17న ధర్నా

ఉలవపాడు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల సమస్యలపై ఈనెల 17న ఉలవపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు వద్ద ధర్నా చేపట్టనున్నట్లు సీఐటీయూ జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు, జీవీబీ కుమార్, ఇందిర, లతారెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం వారు సీడీపీవో అరుణకు వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీల కనీస వేతనం రూ26వేలకు పెంచాలని డిమాండ్ చేశారు.

భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి, వరికుంటపాడు మండలాల్లో గురువారం రాత్రి ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. షబే-ఏ-బరాత్ సందర్భంగా ముస్లింలు మసీదులకు చేరుకుని రాత్రంతా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మసీదులో భక్తుల సౌకర్యార్థం అల్పాహారం ఏర్పాటు చేశారు.

నిధుల మంజూరు

లింగసముద్రం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు కలెక్టర్ రూ.12లక్షలు మంజూరు చేసినట్లు గురువారం కందుకూరు ఆర్అండ్‌బీ ఏఈ షేక్ అహమ్మద్ బాషా తెలిపారు. ఈ నెల 6న టెండర్లు పూర్తి చేశారని త్వరలో పనులు పనులు ప్రారంభిస్తామన్నారు.

శిథిలావస్థలో వసతిగృహం

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), (ఆంధ్రజ్యోతి): స్థానిక బీసీ బాలుర వసతిగృహం శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రతి ఏడాది విద్యార్థుల సంఖ్య తగ్గుముఖం పడుతోంది. గదుల శ్లాబు పెచ్చులూడుతుండడంతోపాటు తలుపులు, కిటికీలు, మరుగుదొడ్లు అధ్వానంగా మారాయి. అటు వైపు చూసిన వి ద్యార్థులు, తల్లిదండ్రులు వెను కడుగు వేస్తున్నారు. ప్రస్తుతం 24 మంది ఉండడం ఆ హాస్టల్లో ఉండటం విశేషం.


పెచ్చులూడుతున్న గది